మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

సోమవారం MONDAY 8.9.2025 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 10+4 Pages: 10+4 | సంపుటి (Volume): 15 || సంచిక (Issue): 94 || వెల (Price) రూ.6.50

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline



ఆసియా హమారా › 10

హాకీ ఫైనల్లో కొరియాపై భారత్ ఘన విజయం

దిల్‌ప్రీత్‌సింగ్ డబుల్ ధమాకా.. ప్రపంచ టోర్నీకి అర్హత



చంద్రగ్రహణం సంపూర్ణం!

మహాలయ పక్షం ప్రారంభం

సోమవారం, సూర్యోదయం: 6-03, సూర్యాస్తమయం: 6-24. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం కృష్ణ పక్షం తిథి: పాడ్యమి రాత్రి 9-12 వరకు. నక్షత్రం: పూర్వాభాద్ర రాత్రి 8-02 వరకు. వర్జ్యం: తెల్లవారుజామున 4-51 నుంచి మర్నాడు ఉదయం 6-19 వరకు. రాహుకాలం: ఉదయం 7-36 నుంచి ఉదయం 9-08 వరకు. దుర్ముహూర్తం: పగలు 12-38 నుంచి పగలు 1-27 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 3-06 నుంచి పగలు 3-55 వరకు. అమృతకాలం: పగలు 12-35 నుంచి పగలు 2-04 వరకు.



కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన సిద్దిపేట జిల్లా తుక్కాపూర్ పంప్‌హౌస్ నుంచి మల్లన్నసాగర్‌లోకి ఎత్తిపోస్తున్న గోదావరి జలాలు

కూలిపోయిందన్న కాళేశ్వరం నీళ్లతో


లక్షన్నర కోట్ల ప్రాజెక్టు!

- కాళేశ్వరం జలాలతో గోదావరి డ్రింకింగ్ వాటర్ స్కీమ్
- మల్లన్న సాగర్ నుంచి 20 టీఎంసీలను తీసుకొచ్చే ప్లాన్
- ఘనపురం వద్ద 15 టీఎంసీల నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు
- 2.5 టీఎంసీల నీళ్లు మూసీ నది ప్రక్షాళనకు వినియోగం
- గోదావరి తాగునీటి పథకం ఫేజ్ 2, 3 ప్రాజెక్టులకు నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన

'కాళేశ్వరం కూలింది.. కాళేశ్వరం కాదది కూలేశ్వరం.. ప్రాజెక్టుతో లక్ష కోట్లు వృథా అయినయ్'.. అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ఇప్పటి కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి సహా ఆ పార్టీ నేతలు చేసిన దుష్ప్రచారమిది! ఇలా కూలింది అని ప్రచారం చేసిన ఆ కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లనే రూ.లక్షన్నర కోట్లతో చేపడుతున్న మూసీ పునరుజ్జీవన పథకం కోసం రేవంత్ సర్కారు తరలించబోతున్నది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మల్లన్న సాగర్ నుంచి 20 టీఎంసీల జలాలను మూసీకి మళ్లించే పనులకు నేడు శంకుస్థాపన చేయనున్నది.

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన దుష్ప్రచారం అంతాఇంతా కాదు. ప్రాజెక్టు నిర్మాణంలో లక్ష కోట్ల రూపాయలు వృథా అయ్యాయని, కూలిపోయిందని ప్రచారం చేస్తూ దానిని ఒక విఫల ప్రాజెక్టుగా ముద్ర వేసేందుకు ఎన్ని ప్రయత్నాలు చేయాలో అన్నీ చేసింది. ఘోష్ కమిషన్ వేసింది. అసెంబ్లీలో అర్ధరాత్రి కాళేశ్వరంలో అక్రమాలు జరిగాయని ప్రకటించి సీబీఐ విచారణకు ఆదేశించింది. కానీ, ఇప్పుడు అదే ప్రాజెక్టుపై ఆధారపడి లక్షన్నర కోట్ల రూపాయల మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మల్లన్న సాగర్ నుంచి 20 టీఎంసీల జలాలను మూసీనదికి తరలించే పనులకు రేవంత్‌రెడ్డి కొబ్బరికాయ కొట్టేందుకు సర్వం సిద్ధమైంది. మూసీ పునరుజ్జీవన పథకంలో భాగంగా ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ చెరువులను జలాలతో నింపేందుకు ఉద్దేశించిన గోదావరి డ్రింకింగ్ వాటర్ స్కీమ్ ఫేజ్-2, ఫేజ్-3 పథకానికి ముఖ్యమంత్రి సోమవారం శంకుస్థాపన చేయబోతున్నారు. అలాగే, కోకాపేట లేఅవుట్ సమగ్రాభివృద్ధి ప్రాజెక్టుకు కూడా సీఎం శంకుస్థాపన చేస్తారు. నియోపోలిస్ లేఅవుట్ వద్ద ఓఆర్ఆర్ ఎగ్జిట్-1ఏపై హెచ్ఎండీఏ నిర్మించిన ఇంటర్ చేంజ్ ట్రంపెట్‌ను సీఎం ప్రారంభిస్తారు. ఇక, డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టులో భాగంగా మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి 20 టీఎంసీల నీటిని తరలిస్తారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలను ఆ నీటితో నింపి 17.5 టీఎంసీల › 2వ పేజీలో

పల్లెపల్లెన పంటలు మొలిచే పాలమూరులోన!



కేసీఆర్ హయాంలో పూర్తి చేసిన కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పరిధిలోని గుడిపల్లి రిజర్వాయర్ కింద పచ్చగా కళకళలాడుతున్న పంటలు

తగ్గుముఖం పట్టిన వలసలు

- సొంతూళ్లకు వలసజీవులు తిరుగుముఖం
- లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లతో రివర్స్ మైగ్రేషన్
- పెరిగిన సాగు విస్తీర్ణం.. మెరుగైన ఉపాధి
- మెరుగైన ప్రజల జీవన ప్రమాణాలు
- బీఆర్ఎస్ హయాంలో మారిన రూపురేఖలు
- సెస్ అధ్యయనంలో వెలుగులోకి కీలకాంశాలు
- ఉమ్మడి జిల్లాలో నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమా, కోయిల్‌సాగర్ లిఫ్ట్‌ల ప్రభావంపై సెస్ స్టడీ

'పల్లెపల్లెనా పల్లేర్లు మొలిచే పాలమూరులోనా..' అనే పాట ఉమ్మడిరాష్ట్రంలో వినిపించని రోజు లేదు. సాగునీటికి నోచుకోక.. చేతిలో పనుల్లేక పొట్టచేత పట్టుకొని ఊరుదాటిన వారితో మహబూబ్‌నగర్ వలసల జిల్లాగా మారింది. ఉమ్మడి పాలకులు దశాబ్దాలుగా పడావు పెట్టిన పాలమూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లను కేసీఆర్ అధికారంలోకి వచ్చిన రెండేండ్లలోనే పట్టాలెక్కించి 95 శాతం పూర్తి చేయించారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాలు, డిస్ట్రిబ్యూటరీలను పూర్తిచేసి, వెయ్యికి పైగా చెరువులను పునరుద్ధరించి లక్షలాది ఎకరాలకు జీవం పోశారు. బీడువారిన భూములకు నీళ్లు రావడంతో వలసజీవులంతా సొంతూర్లకు తిరిగి వచ్చి దర్జాగా వ్యవసాయం చేపట్టారు. ఇప్పుడు 'పల్లెపల్లెనా పంటలు మొలిచే పాలమూరులోనా' అని పాడుకుంటున్నారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నమస్తే తెలంగాణ): పాలమూరు వలస మారింది. ప్రజల గోస తీరింది. ప్రత్యేక తెలంగాణ వచ్చాక పచ్చబడ్డ తెలంగాణ సాక్షిగా, కేసీఆర్ చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులే సాక్ష్యంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జీవన చిత్రమే పూర్తిగా మారిపోతున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయడం, చెరువులను పునరుద్ధరించడం, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లను అందుబాటులోకి తేవడంతో పాలమూరు వలసలు తగ్గుముఖం పట్టాయి. ఫలితంగా వలసల్లో మగ్గుతున్న జనం సొంతూళ్లకు వచ్చి దర్జాగా వ్యవసాయం చేసుకుంటున్నారు. వ్యవసాయం వృద్ధి చెందడంతోపాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతున్నాయి. ఇవీ సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్) నిర్వహించిన › 9వ పేజీలో



యూరియా వెతలకు 60 రోజులు

ఎరువుల కోసం రైతులు రోడ్డెక్కి నేటికి 60 రోజులు. పంటలను కాపాడుకొనేందుకు పనులన్నీ వదులుకొని.. నిద్రాహారాలు మాని యూరియా కోసం అన్నదాతలు రెండు నెలలుగా కుస్తీ పడుతున్నా వారి కష్టాలు మాత్రం తీరడం లేదు. తొలకరి వర్షాలు మొదలైనప్పటి నుంచి ఒక్క బస్తా యూరియా కూడా దొరకని రైతులు ఎందరో ఉన్నారు. చిన్నాపెద్దా అంతా ఎరువుల దుకాణాల ముందు పడిగాపులు కాస్తున్నారు. ఒక్క బస్తా యూరియా కోసం పెద్ద యుద్ధమే చేస్తున్నారు. ధర్నాలు, రాస్తారోకోలు, జాగారాలు, చెప్పుల క్యూలు, ఎరువుల దుకాణాలపై రాళ్ల దాడులు, పోలీసుల లాఠీచార్జీలు, తోటి రైతులతో కొట్లాటలతో రాష్ట్రం అగ్నిగుండంలా మారింది. › 5

ఉప ఎన్నికలు తథ్యం!

ఒకటిరెండు చోట్ల బైపోల్స్ తప్పనిసరి

- మిగిలిన వారికి ప్రమాదం లేదు.. ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రేవంత్
- పాత కాంగ్రెస్ క్యాడర్ తమను శత్రువులుగా చూస్తున్నారన్న ఎమ్మెల్యేలు
- విభేదాలను పరిష్కరించే బాధ్యత పీసీసీ చీఫ్‌కు అప్పగించిన రేవంత్
- సీఎం, డిప్యూటీ సీఎంల భేటీలో పనిలేదు, పతార లేదన్న ఎమ్మెల్యేలు



హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొంది పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేల్లో ఒకరిద్దరిపై అనర్హత వేటు తప్పక పోవచ్చని, ఆయా నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వచ్చినా ఎదుర్కొనేందుకు మానసికంగా సిద్ధమై ఉండాలని ఫిరాయింపు ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించినట్టు తెలిసింది. అనర్హత వేటు పడిన ఎమ్మెల్యేలకు పార్టీ టికెట్ ఇచ్చి గెలిపించుకుంటామని హామీ ఇచ్చినట్టు సమాచారం. పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేల్లో 9 మంది ఆదివారం సాయంత్రం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూడా ఈ భేటీకి హాజరయ్యారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఈ భేటీకి గైర్హాజరైనట్టు తెలిసింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలకు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇటీవల నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. విచారణకు హాజరై వివరణ ఇవ్వాలని › 3వ పేజీలో



బీసీ వాటాకు టాటా

- జీవో ద్వారానే 42% కోటా.. 14లోపు ఉత్తర్వులు
- 15న కామారెడ్డిలో రాహుల్‌గాంధీతో బీసీల సభ
- చట్టబద్ధంగా ఇస్తామంటూ ఇన్నాళ్లూ మభ్యపెట్టి..
- ఇప్పుడు చెల్లని జీవోతో హంగామా › 2
- ఎవరు కోర్టుకెళ్లినా ఉత్తర్వుల కొట్టివేత ఖాయం!
- ఇది తెలిసే మోసగించేందుకు సర్కార్ యత్నం



ములుగు జిల్లా మాధవరావుపల్లిలో మృతుడు మైదం మహేశ్ తల్లితో ఫోన్‌లో మాట్లాడుతున్న కేటీఆర్

మహేశ్‌ది ప్రభుత్వ హత్యే!

కాంగ్రెస్ అసమర్థతతోనే ములుగులో మున్సిపల్ కార్మికుడి ఆత్మహత్య › 3

- 6 నెలలుగా జీతాలు రాక బలవన్మరణం
- సీఎం, సీతక్క క్షమాపణలు చెప్పాలి
- బాధిత కుటుంబానికి 50 లక్షలివ్వాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- బాధిత కుటుంబానికి ఫోన్‌లో పరామర్శ
- పిల్లల పేరిట నగదు జమ చేస్తానని హామీ
- ఫేక్ వీడియో తీసింది ఆ ఇద్దరే:జ్యోతి

కాంగ్రెస్ పాలన.. ఆత్మహత్యల తెలంగాణ!

బతుకుబండి సాగక బాధతో బలవన్మరణాలు

- బిల్లులు అందక మాజీ సర్పంచులు, కాంట్రాక్టర్లు,
- జీతాలు రాక కార్మికులు, ఉద్యోగుల అరిగోస › 3
- 'పంచాయతీ'ల్లో ఇప్పటివరకు 13 మంది మృతి

క్యాన్సర్ టీకా క్లినికల్ ట్రయల్స్ సక్సెస్ › 6

- అభివృద్ధి చేసిన రష్యా పరిశోధకులు
- త్వరలోనే అందుబాటులోకి వ్యాక్సిన్

నాలా పూడ్చెయ్.. బిల్డింగ్ కట్టెయ్



బుల్కాపూర్ నాలాను ఆక్రమించి నిర్మిస్తున్న బహుళ అంతస్తులు

రియల్టర్లు, అధికార పార్టీ నేతలు, అధికారుల కుమ్మక్కు

- కోట్ల విలువ చేసే బుల్కాపూర్ భూముల కబ్జా
- అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల నిర్మాణం
- వెంచర్లు వేసినా పత్తాలేని నీటి పారుదల శాఖ
- ఫిర్యాదు రాలేదని తప్పించుకుంటున్న హైడ్రా
- కండ్లు కనిపించడం లేదా? అంటున్న స్థానికులు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి/మణికొండ, సెప్టెంబర్ 7: (నమస్తే తెలంగాణ): చారిత్రక బుల్కాపూర్ నాలా మాయమవుతున్నది. రికార్డుల్లో పదిలంగా ఉన్న నాలా భూములు క్షేత్రస్థాయిలో అన్యాక్రాంతమవుతున్నాయి. ఇప్పటికే కొన్నిచోట్ల అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు నిర్మితం కాగా, మరికొన్ని చోట్ల వెంచర్లు వెలిశాయి. అక్కడక్కడా నాలా శిథిల ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. నగరంలో అత్యంత ఖరీదైన ప్రాంతాల మీదుగా ఈ బుల్కాపూర్ నాలా వెళ్తుండగా దాన్ని చెరబట్టేందుకు అధికార పార్టీ నేతలు, అధికారులు, రియల్టర్లు చేతులు కలిపారు. మట్టితో పూడ్చి వెంచర్లు వేస్తూ అమ్మకానికి పెట్టేస్తున్నారు. కొన్నిచోట్ల బుల్కాపూర్ › 2వ పేజీలో



నెల్లుట్ల రమాదేవికి కాళోజీ పురస్కారం

- రేపు రవీంద్రభారతిలో అవార్డు ప్రదానం › 9
- ఎంపికచేసిన అందెశ్రీ నేతృత్వంలోని జ్యూరీ కమిటీ
- రచయిత్రిగా, కవయిత్రిగా, కార్టూనిస్ట్‌గా బహుముఖ ప్రజ్ఞ
- రమాయణం పేరిట 'నమస్తే తెలంగాణ'లో రచనలు
- శుభాకాంక్షలు తెలియజేసిన సీఎం రేవంత్‌రెడ్డి

21 నుంచి దసరా సెలవులు

అక్టోబర్ 4న తెరుచుకోనున్న స్కూళ్లు › 2

అలైన్‌మెంట్ మారాలంటే సర్కారు మారాలేమో!



- ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తేనే పరిష్కారం
- ట్రిపుల్ ఆర్ నిర్వాసితులకు అన్యాయం జరిగితే ఎక్కడిదాకైనా వెళ్లి కొట్లాడుతా
- రైతుల కోసం ఎలాంటి త్యాగమైనా చేస్తా
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్/సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 7: ట్రిపుల్ ఆర్ భూనిర్వాసితుల కోసం ప్రభుత్వంపై ఎలాంటి పోరాటానికైనా తాను సిద్ధమేనని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెగేసిచెప్పారు. 'ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్ మారాలంటే ఉత్తరభాగం మారాలి.. ఉత్తర భాగం మారాలంటే ప్రభుత్వమే మారాలేమో!' అని సంచలన వ్యాఖ్యలు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురంలో ఆదివారం ఆయన ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితులతో సమావేశమయ్యారు. 'నాకు మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చిన మాట వాస్తవం.. ఆలస్యమైనా పర్వాలేదు.. నాకు అన్యాయం › 3వ పేజీలో

బీసీల వాటాకు టాటా?

- జీవో ద్వారానే 42% కోటా.. 14లోపు ఉత్తర్వులు
- 15న కామారెడ్డిలో రాహుల్‌గాంధీతో బీసీల సభ
- చట్టబద్ధంగా ఇస్తామంటూ ఇన్నాళ్లూ మభ్యపెట్టిన కాంగ్రెస్
- ఇప్పుడు చెల్లని జీవో ఇచ్చి హంగామా చేసే ఆలోచన
- ఎవరు కోర్టుకు వెళ్లినా ఉత్తర్వులు కొట్టివేత ఖాయం!
- ఇది తెలిసీ మోసగించేందుకు కాంగ్రెస్ సర్కార్ యత్నం

హైదరాబాద్, సెప్టెంబర్ 7(నమస్తే తెలంగాణ): రిజర్వేషన్ల పేరుతో బీసీలను మోసగించేందుకు కాంగ్రెస్ సర్కారు రంగం సిద్ధంచేస్తున్నట్టు తెలిసింది. నిన్న మొన్నటివరకు బీసీలకు రాజ్యాంగబద్ధంగానే 42% రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ పెద్దలు.. ఇప్పుడు ఇందుకు పూర్తి విరుద్ధంగా ప్రభుత్వ ఉత్తర్వులు(జీవో) ద్వారానే ఇచ్చే ఆలోచన చేస్తున్నట్టు తెలిసింది. ఇందుకు సంబంధించి ఈ నెల 14వ తేదీలోపు ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ నెల 10న గానీ, 13న గానీ ఉత్తర్వులు జారీ చేసి ఆ మరుసటి రోజే స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చే విధంగా ప్రణాళిక సిద్ధంచేసినట్టు సమాచారం. జీవోపై కోర్టులకు వెళ్లకుండా శని, ఆదివారాల్లో ఉత్తర్వులు ఇచ్చే అవకాశం ఉన్నట్టు తెలిసింది. అనంతరం ఈ నెల 15న కామారెడ్డిలో రాహుల్‌గాంధీ సమక్షంలో బీసీల విజయభేరీ సభ నిర్వహించాలని భావిస్తున్నట్టు తెలిసింది. కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించిందనే అంశాన్ని ఈ సభ ద్వారా ప్రచారం చేయాలనే ఆలోచనలో పార్టీ పెద్దలు ఉన్నట్టు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

కోర్టులో నిలవదని తెలిసినా...

కాంగ్రెస్ పార్టీ చెప్పినట్టుగా రాజ్యాంగబద్ధంగా బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పించాలంటే సుప్రీంకోర్టు విధించిన 50% సీలింగ్ ప్రకారం ఇది సాధ్యం కాదు. ఒకవేళ ఇలా చేయాలంటే పార్లమెంట్‌లో చట్ట సవరణ చేయాల్సి ఉంటుంది. కానీ, ఢిల్లీలో చేయాల్సిన పనులను చేయకుండా కాంగ్రెస్ సర్కారు.. రాష్ట్రంలో హడావుడి చేసి బిల్లుల పేరిట డ్రామాలు ఆడిందనే విమర్శలున్నాయి. ఇక ఇప్పుడు కొత్తగా జీవో పేరుతో మరో నాటకానికి తెరతీసిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా ఉత్తర్వులు జారీచేయడం తప్పనే విషయం ప్రభుత్వ పెద్దలకు తెలియంది కాదు. అదే విధంగా ఒకవేళ ఉత్తర్వులు జారీచేసినా.. అవి కోర్టుల్లో నిలబడవని, కొట్టివేస్తాయనే విషయం కూడా తెలుసు. అయినప్పటికీ, బీసీలను మభ్యపెట్టేందుకు, మోసం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం డ్రామాలపై డ్రామాలు ఆడుతున్నదనే విమర్శలొస్తున్నాయి. అమలుకు యోగ్యం కాని చర్యలు తీసుకుంటూ.. బీసీలకు ఏదో మేలు చేసినట్టుగా ప్రచారం చేసుకుంటున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఏం చేశారని విజయోత్సవ సభ...?

ఈ నెల 15న కామారెడ్డిలో బీసీల విజయోత్సవ సభ నిర్వహించాలని కాంగ్రెస్ సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు తెలిసింది. ఈ సభకు ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీని ఆహ్వానించాలని నిర్ణయించినట్టు సమాచారం. అయితే, ఏం సాధించారని బీసీల విజయోత్సవ సభ నిర్వహిస్తున్నారంటూ బీసీలు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించారా? పోనీ, స్థానిక సంస్థల ఎన్నికల్లోనైనా 42% రిజర్వేషన్లు కల్పించేందుకు మార్గం సుగుమం చేశారా? ఇవేవీ చేయకుండానే విజయోత్సవ సభ ఎందుకని ప్రశ్నిస్తున్నారు. తుమ్మితే ఊడిపోయే ముక్కు మాదిరిగా ఎవరైనా కోర్టుకు వెళ్తే, కొట్టివేసే జీవోతో తమను మభ్యపెట్టాలని చూస్తున్నారా? అని నిలదీస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు కల్పించిన తరువాతే విజయోత్సవ సభ నిర్వహించాలని, లేకుంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మే ప్రసక్తే లేదని చెప్తున్నారు.

21 నుంచి దసరా సెలవులు

అక్టోబర్ 4న తెరుచుకోనున్న స్కూళ్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అన్ని స్కూళ్లకు ప్రభుత్వం ఈ నెల 21 నుంచి అక్టోబర్ 3 వరకు దసరా సెలవులు ప్రకటించింది. 13 రోజులపాటు అన్ని స్కూళ్లకు సెలవులు ఇవ్వనున్నారు. దసరా పండుగ అనంతరం అక్టోబర్ 4న(శనివారం) పాఠశాలలను తిరిగి తెరువనున్నారు. ప్రైవేట్, ఎయిడెడ్ జూనియర్ కాలేజీలకు మాత్రం 28 నుంచి అక్టోబర్ 5 వరకు సెలవులు ప్రకటించారు.

కూలిపోయిందన్న కాళేశ్వరం నీళ్లతో

లక్షన్నర కోట్ల ప్రాజెక్టు!

మొదటిపేజీ తరువాయి...

జలాలను తాగునీటి అవసరాలకు, 2.5 టీఎంసీలను మూసీ పునరుజ్జీవనానికి కేటాయిస్తారు.

పదేండ్ల తాగునీటి అవసరానికి కాళేశ్వరం నీళ్లు

రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుతోపాటు హైదరాబాద్ మహానగర తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు మల్లన్నసాగర్ నుంచి 20 టీఎంసీల నీటిని గోదావరి తాగునీటి ప్రాజెక్టు 2,3 దశలలో తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో రూ. 7,360 కోట్ల ఖర్చుతో రెండు ప్యాకేజీలుగా పనులు చేపట్టాలని నిర్ణయించింది. ఇందులో ప్రభుత్వం 40 శాతం పెట్టుబడి వాటా పెట్టనుండగా, కాంట్రాక్ట్ కంపెనీ 60 శాతం నిధులు సమకూరుస్తుంది. ఆ పనులకు సంబంధించి గతంలోనే టెండర్లను ఆహ్వానిస్తూ జలమండలి నోటిఫికేషన్ జారీచేసింది. మేఘా, ఎల్అండ్‌టీ సంస్థలకు టెండర్ ఖరారు చేశారు. తాజాగా ఈ పనులకు రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయబోతున్నారు. 2,3 దశలకు సంబంధించిన పైప్‌లైన్‌లను రెండు వరుసలుగా వేయనున్నారు. 3,000 ఎంఎం డయాతో రెండు పైప్‌లైన్లు వేసి 20 టీఎంసీల కాళేశ్వరం నీటిని మళ్లించనున్నారు. మొదటి ప్యాకేజీలో మల్లన్నసాగర్ నుంచి ఘనపురం వరకు, రెండో ప్యాకేజీలో ఘనపురం నుంచి ఉస్మాన్ సాగర్ వరకు పనులు చేపడతారు.

మొదటి ప్యాకేజీకి రూ. 3,330.95 కోట్లు

మల్లన్న సాగర్ నుంచి ఘనపురం వరకు నీటిని తరలించేందుకు రూ. 3,225.47 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఇందులో మల్లన్న సాగర్ వద్ద భారీ పంప్‌హౌస్, ఎలక్ట్రోమెకానికల్ ఎక్విప్‌మెంట్లతో కూడిన సబ్ స్టేషన్ నిర్మిస్తారు. దీంతోపాటు ఘనపురం వద్ద 1,170 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, 40 మిలియన్ లీటర్ల క్లియర్ వాటర్ రిజర్వాయర్, పంప్‌హౌస్‌లను నిర్మిస్తారు. దీనిని పదేండ్లపాటు నిర్వహించేందుకు రూ.105.48 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఈ రెండు కలిపి ప్రాజెక్టు విలువ రూ.3,330.95 కోట్లు అవుతుందని అధికారులు అంచనా వేశారు.



మూసీ సుందరీకరణకు మూలం కాళేశ్వరమే

రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రస్తుతం లక్షన్నర కోట్లతో చేపట్టతలచిన మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు కేసీఆర్ సర్కార్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టే కీలకం కానుంది. గోదావరి జలాలను మూసీలో పోయడమే ప్రాజెక్టు ఉద్దేశం. అయితే గోదావరి జలాలు ఏవిధంగా వస్తాయంటే కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రిజర్వాయర్లు, సొరంగాలు, పంప్‌హౌస్‌లు, భారీ కాలువలు ఇతర నీటి సరఫరా వ్యవస్థను వినియోగించుకోవడం ద్వారానే. లేదంటే గోదావరి జలాలు మూసీకి చేరడం అసాధ్యం. సూటిగా చెప్పాలంటే మూసీ ప్రాజెక్టుకు మూలం కాళేశ్వరం ప్రాజెక్టే. మరి అలాంటప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు వృథా ఎలా అవుతుంది? లక్ష కోట్లు వృథా అని ఇంతకాలం తాము చేసిన ప్రచారం పూర్తిగా అబద్ధమని కాంగ్రెస్ ప్రభుత్వమే ఇప్పుడు మూసీ సుందరీకరణ ప్రాజెక్టు ద్వారా తేల్చిచెప్పింది. అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ అయినా కాళేశ్వరం ప్రాజెక్టు అంతర్భాగంలోని ఉప ప్రాజెక్టులే. అదే కాళేశ్వరం నీళ్ల మీద ఆధారపడి హైదరాబాద్ తాగునీటి వనరులకు కాంగ్రెస్ సర్కార్ రూపకల్పన చేయడం గమనార్హం. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఉద్దేశపూర్వకంగానే అసత్యప్రచారాలు చేయడం తప్ప మరేమీ లేదని రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే అంగీకరిస్తున్నది.

రూ. 2052.72 కోట్లతో రెండో ప్యాకేజీ

ఘనపురం నుంచి ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌కు నీటిని తరలించే రెండో ప్యాకేజీకి రూ. 2,052.72 కోట్లు అవుతుందని అంచనా రూపొందించారు. ఘనపూర్ నుంచి ఉస్మాన్ సాగర్ వరకు 2,200 ఎంఎం వ్యాసార్థంతో కూడిన పైప్‌లైన్లు, ఘనపురం నుంచి ముత్తంగి వరకు 2,400 ఎంఎం వ్యాసార్థపు పైప్‌లైన్లు, కోకాపేట నుంచి ఉస్మాన్ సాగర్, ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) వెంట 3,000 ఎంఎం డయా పైప్‌లైన్ ద్వారా నీటి తరలిస్తారని జలమండలి అధికారులు తెలిపారు. 2,200 ఎంఎం పైప్‌లైన్ ద్వారా ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ రిజర్వాయర్లను ఇంటర్ కనెక్ట్ చేస్తారు. వీటితోపాటు ఉస్మాన్ సాగర్ వద్ద 120 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, 10 మిలియన్ లీటర్ల క్లియర్ వాటర్ పంప్‌హౌస్ నిర్మించనున్నారు. ఆధునాతన సబ్‌స్టేషన్‌ను సైతం నిర్మించనున్నారు. దీంతోపాటు గోల్డెన్ మైల్ వద్ద 22.50ఎంఎల్ మెయిన్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను నిర్మిస్తారు. హిమాయత్ సాగర్ వద్ద 70 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, 18 ఎంఎల్‌డీ క్లియర్ వాటర్ పంప్‌హౌస్, పంపింగ్ చేయడానికి సబ్‌స్టేషన్‌లను నిర్మించి అక్కడి నుంచి 1,000 ఎంఎం డయా పంపింగ్ ద్వారా బుద్వేల్ రిజర్వాయర్‌కు నీటిని తరలించే ప్రణాళికలు రూపొందించారు.

కేసీఆర్ ప్రభుత్వ ప్రతిపాదనను పక్కన పెట్టి..

గోదావరి నుంచి హైదరాబాద్ తాగునీటి అవసరాలకు 30 టీఎంసీల నీటి కేటాయింపు ఉంది. ఇందులో 10 టీఎంసీల నీటిని ఎల్లంపల్లి నుంచి మొదటి దశ ద్వారా మళ్లించి వినియోగిస్తున్నారు. రెండో దశ కింద కొండపోచమ్మ సాగర్ నుంచి 10 టీఎంసీల నీటిని మళ్లించేలా కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా కేశవాపురం వద్ద 10 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించడానికి 2017 అక్టోబరులో రూ.4,777.59 కోట్లతో అప్పటి ప్రభుత్వం పరిపాలనా అనుమతి ఇచ్చింది. హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ కాంట్రాక్టు పద్ధతిలోనే ఈ పనిని చేపట్టాలని నిర్ణయించి టెండర్ పిలిచి 2018 ఫిబ్రవరిలో కాంట్రాక్టర్‌కు అప్పగించింది. రిజర్వాయర్‌ను డిజైన్ చేసేందుకు కన్సల్టెన్సీ సంస్థ వాప్కోస్‌కు అప్పగించింది. 2019 ఆగస్టులో నివేదిక ఇచ్చిన వాప్కోస్ రిజర్వాయర్ సామర్థ్యాన్ని 10 టీఎంసీలు కాకుండా 5.04 టీఎంసీలకు తగ్గించాలని సిఫార్సు చేసింది. దీంతోపాటు అదనంగా కొండపోచమ్మ నుంచి 10 టీఎంసీల నీటిని మళ్లించి ఘనపూర్ వద్ద వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మించి సరఫరా చేయడానికి కూడా వాప్కోస్ సిఫార్సు చేసింది. ఈ పనులన్నింటినీ మొదట ఒప్పందం చేసుకొన్న నిర్మాణ సంస్థ ఎంఈఐఎల్‌కు అప్పగిస్తూ ఇస్తూ 2020లో ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. పనులు కూడా మొదలయ్యాయి. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక 2024 నవంబరు 5న కేశవాపురం వద్ద రిజర్వాయర్ నిర్మాణ పనిని రద్దుచేస్తూ ఉత్తర్వులు ఆదేశాలు జారీ చేశారు. కొండపోచమ్మ సాగర్ నుంచి కాకుండా మల్లన్న సాగర్ నుంచి నీళ్లు తీసుకోవాలనే కొత్త ప్రణాళిక అమల్లోకి తెచ్చారు.

మంచిరేవులలో ఆదిమమానవుడి ఆనవాళ్లు

- పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నమస్తే తెలంగాణ): నగర శివారు ప్రాంతం నార్సింగ్ మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవులలో ఆదిమమానవుడి ఆనవాళ్లు కనిపించాయని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. మూసీ పరిసరాల్లో ఆదివారం జరిపిన పురావస్తు అన్వేషణలో భాగంగా, స్థానిక వీరభద్రాలయ వంశ పారంపర్య అర్చకులు మాడపాటి పరమేశ్వర ఇచ్చిన సమాచారం మేరకు అక్కడకు వెళ్లగా.. ఆలయ ప్రాంగణంలోని రాతి పరుపుపై దాదాపు 15చోట్ల కొత్తరాతి యుగం (4000 సంవత్సరాల) నాటి రాతి గొడ్డళ్లను పదును పెట్టేందుకు నూరిన గాట్లు ఉన్నాయని తెలిపారు. అవి 15 సెంటీమీటర్ల పొడవు, 3 సెంటీమీటర్ల వెడల్పు, 2 సెంటీమీటర్ల లోతు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. మూసీనది ఒడ్డునున్న వీరభద్రాలయం చుట్టుపక్కల రాతి చరియల కింద గుహల్లోనూ కొత్త రాతి యుగం వారు నివసించారని వెల్లడించారు. ఈ ఆనవాళ్లు హైదరాబాద్ నగర చరిత్రను 6వేల ఏండ్ల పూర్వానికి తీసుకెళ్తున్నాయని తెలిపారు. కొత్త రాతి యుగపు ఆనవాళ్లు చారిత్రక వివరాలతో పేరు పలకలు ఏర్పాటుచేసి మంచిరేవులను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని మున్సిపాలిటీ అధికారులకు శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

అపోలో నుంచి సీబీఐ డైరెక్టర్ డిశ్చార్జి

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నమస్తే తెలంగాణ) : సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ జూబ్లీహిల్స్ అపోలో దవాఖాన నుంచి ఆదివారం డిశ్చార్జి అయ్యారు. శనివారం స్వల్ప అస్వస్థతకు గురైన ఆయనను అపోలో దవాఖానలో జాయిన్ చేసి, మెరుగైన చికిత్స అందించారు. తీవ్రమైన అలసట కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తడంతో కార్డియాటిక్, శ్వాసకోశ సంబంధ పరీక్షలు నిర్వహించి.. మెడిసిన్స్ అందించారు. శనివారమే ఆయన ఆరోగ్యం మెరుగవగా.. 24 గంటలు వైద్యుల పర్యవేక్షణలో ఉంచి.. ఆదివారం డిశ్చార్జి చేయడంతో ఆయన ఢిల్లీకి వెళ్లారు. దీంతో తెలంగాణలో పాల్గొనాల్సిన కార్యక్రమాలు వాయిదా పడ్డాయి.

మానవత్వాన్ని చాటిన మహిళా కండక్టర్

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నమస్తే తెలంగాణ): విధి నిర్వహణలో మేడ్చల్ డిపోకు చెందిన మహిళా కండక్టర్ మానవత్వాన్ని చాటారు. ఆదివారం సికింద్రాబాద్ స్టేషన్‌లో 229 బస్సు పాయింట్ వద్ద ఓ ప్రయాణికుడు ఫిట్స్ వచ్చి పడిపోయాడు. అక్కడ ఎంతోమంది ఉన్నా కానీ ఒక్కరూ ముందుకు వచ్చి సాయం చేయలేదు. అయితే, ఆ సమయంలో విధుల్లో ఉన్న మేడ్చల్ డిపో కండక్టర్ మహిళా కండక్టర్ బస్సులో నుంచి తాళంచెవి తీసుకొచ్చి అతడి చేతిలో పెట్టి సాయం చేశారు. సకాలంలో స్పందించడంతో ఆ వ్యక్తి ప్రమాదం నుంచి బయటపడ్డాడు. ఆమె చూపిన మానవత్వాన్ని ఆర్టీసీ ఎండీ సజ్జనర్ కొనియాడారు. ఆర్టీసీ సిబ్బంది నిబద్ధతకు మహిళా కండక్టర్ స్ఫూర్తిగా నిలిచిందని ప్రశంసించారు.



ఫిట్స్ వచ్చిన వ్యక్తికి సాయం చేస్తున్న మహిళా కండక్టర్



పుప్పాలగూడ గ్రామ పరిధిలోని బుల్కాపూర్ నాలాను యథేచ్ఛగా పూడ్చివేస్తున్న దృశ్యం



నాలాను ఆక్రమించి నిర్మించిన బహుళ అంతస్తుల భవన ప్రహరీ

నాలా పూడ్చేయ్.. బిల్డింగ్ కట్టేయ్

మొదటిపేజీ తరువాయి...

నాలాను కాపాడామని ప్రకటించుకున్న హైడ్రా.. బడాబాబులు నిర్మించిన ఆకాశహర్మ్యాల వైపు, వెంచర్లవైపు కన్నెత్తి చూడటం లేదు. ఎందుకని అడిగితే ఫిర్యాదులు రాలేదని సాకు చెప్తున్నది. తెరవెనుక 'పెద్దలు' ఉండటంతో భయపడి ఫిర్యాదుకు సామాన్యులు ముందుకు రావడంలేదు. నాలా ఆలనాపాలనా చూడాల్సిన నీటిపారుదల శాఖ ఎన్‌వోసీలు ఇవ్వడంలో బిజీగా ఉంటే కండ్లముందే ఆక్రమణలు కనిపిస్తున్నా హైడ్రా కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. బడాబాబులు నిర్మాణాలు పూర్తి చేసి, ఆ ఫ్లాట్లను అమ్మి సొమ్ము చేసుకున్న తర్వాత, వాటిని కొనుగోలు చేసిన సామాన్యులపై హైడ్రా ప్రతాపం చూపుతుందా? అని స్థానికులు మండిపడుతున్నారు.

రూ.కోట్ల భూములు కబ్జా

రంగారెడ్డి జిల్లా పరిధిలోని శంకర్‌పల్లి మండలం నుంచి ప్రారంభమై మూసీ వరకు ప్రవహించే బుల్కాపూర్ నాలా రాజేంద్రనగర్ మండల పరిధిలోని ఖానాపూర్, కోకాపేట, నార్సింగి, పుప్పాల్‌గూడ, మణికొండ గ్రామాల మీదుగా ప్రవహించేది. ఈ నాలా ఒకప్పుడు ఈ ప్రాంత వాసులకు సాగు, తాగునీరు అందించింది. నాలా నీటితో దిగువన ఉన్న చెరువులు, కుంటలు కళకళలాడేవి. ప్రస్తుతం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ సర్వేనంబర్ 314, 416, 417, 428 తదితర భూముల మీదుగా బుల్కాపూర్ నాలా ఉన్నది. రికార్డుల్లో పదిలంగా ఉన్నా, క్షేత్రస్థాయిలో నాలాను పూర్తిగా పూర్తిగా మూసేసి నిర్మాణాలు చేపడుతున్నట్టు స్పష్టం అవుతున్నది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మర్రిచెట్టు కూడలి ముందు, వెనుక ప్రాంతాల్లో నాలాకు కనీసం పది అడుగుల దూరం కూడా లేకుండానే బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే తమకు హెచ్ఎండీఏ అనుమతులున్నాయంటూ దబాయిస్తున్నారని స్థానికులు చెప్తున్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట గ్రామ సమీపం నుంచే వెళ్లే నాలాను కబ్జాదారులు పూర్తిగా కనుమరుగు చేశారు. ఖానాపూర్ గ్రామం మీదుగా వచ్చే నాలాను కోకాపేట సెజ్ భూములను ఆనుకుని ప్రవహించే ప్రాంతంలో సర్వేనంబర్ 84, 85 పక్క నుంచి వెళ్లే దాదాపు ఎకరం విస్తీర్ణం గల నాలా మట్టితో పూడ్చేసి వారి భూముల్లోకి వెళ్లేందుకు రహదారులుగా మార్చేశారు. పక్కనే ఉన్న కోకాపేట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని పూర్తిస్థాయిలో కబ్జాలు చేసి ప్రహరీ నిర్మించి ప్లాట్లుగా ఏర్పాటు చేసేందుకు మట్టితో చదును చేసి వాటిపై విల్లాలను నిర్మించారు. నిజానికి ఈ భూముల్లోకి వెళ్లేందుకు రహదారులు లేకపోవడంతో పక్కనే ఉన్న సెజ్ భూముల్లోంచి అక్రమంగా దారులను ఏర్పాటు చేసి వాటినే లే అవుట్లల్లో చూపి ప్లాటింగ్ చేశారు. వట్టినాగులపల్లి గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 257, 258ల్లోనూ నాలా పూడ్చి ఏకంగా ప్రహరీ నిర్మించారు. ఇవన్నీ అవుటర్ రింగురోడ్డు పక్కనే ఉండడంతో ఎకరా రూ.60 కోట్ల వరకు పలుకుతున్నది.

రూ.కోట్లలో కమీషన్లు

అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకుల అండదండలతో నాలా చాలా మటుకు అన్యాక్రాంతం అయ్యింది. మొన్నటి దాకా నాలాకు ఇరువైపులా 30 మీటర్లు (సుమారు వంద ఫీట్లు) బఫర్‌జోన్‌గా నిబంధనలు ఉన్నాయి. ఎల్ఆర్ఎస్ పథకం అమలు నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిబంధనలను ఏకంగా వంద మీటర్లకు (సుమారు 330 ఫీట్లు) పెంచి, బఫర్‌జోన్‌గా అమలు చేస్తున్నది. కానీ నాలా పరిరక్షణలో భాగంగా ఏర్పాటైయిన నిబంధనలను ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఆక్రమణలకు రెవెన్యూ అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాలాలను పూడ్చివేయడాన్ని గ్రామస్థాయి రెవెన్యూ అధికారులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నా రియల్టర్లు వారిని పట్టించుకోవడం లేదని చెప్తున్నారు. ఇందుకోసం రెవెన్యూ అధికారులకు రూ.కోట్లు కమీషన్లు ఇచ్చినట్టు చర్చ జరుగుతున్నది. దీంతో యథేచ్ఛగా రాత్రింబవళ్లు నాలా పూడ్చేసి రోడ్లు పోసేశారని చెప్తున్నారు.

ఫ్లాట్లు అమ్మేసిన తర్వాత కూల్చుతారా?

నగరంలోని నాలాలపై ఉన్న నిరుపేదల నిర్మాణాలను కూల్చివేసి హడావిడి చేస్తున్న హైడ్రా.. బుల్కాపూర్ నాలాపై మాత్రం పూర్తిస్థాయిలో దృష్టిసారించడం లేదు. ఇప్పటికే హైడ్రా అధికారులు బుల్కాపూర్ నాలాను పరిశీలించారు. అయినా ఆక్రమణలపై చర్యలు తీసుకోలేదు. నాలాపై అనేకచోట్ల భవంతులు నిర్మించారు. ఇప్పటికీ కొన్నిచోట్ల పనులు జరుగుతున్నాయి. వాటిపై చర్యలు తీసుకోవాలని హైడ్రా అధికారులను అడిగితే 'వాటిపై ఫిర్యాదులు రాలేదు' అని సాకుగా చూపుతున్నట్టు తెలిసింది. ప్రస్తుతం నిర్మాణాలు బడాబాబుల చేతుల్లో ఉన్నాయని, అవి పూర్తయ్యి, ఫ్లాట్లను విక్రయించి రియల్టర్లు దర్జాగా తప్పుకున్న తర్వాత కూల్చివేతలు మొదలు పెడతారా? అప్పుడు రూ.లక్షలు పెట్టి కొనుగోలు చేసినవారు ఆర్థికంగా కుంగిపోవాలా? అని నిలదీస్తున్నారు. కండ్ల ముందే ఆక్రమణలు జరుగుతున్నా ఫిర్యాదులు లేవని సాకులు చెప్పడంపై మతలబేంటని ప్రశ్నిస్తున్నారు.

కిలో 50 లక్షలకు అమ్మకం

- హైదరాబాద్, ముంబై, కర్ణాటక, గోవాల్లో విక్రయాలు
- చర్లపల్లి డ్రగ్స్ రాకెట్ కేసులో విస్తుగొలిపే విషయాలు
- ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసుకున్న శ్రీనివాస్ విజయ్
- 7 నెలల క్రితమే నోటీసులిచ్చి సరిపెట్టిన 'ఈగల్'



హైదరాబాద్/సిటీబ్యూరో సెప్టెంబర్ 7 (నమస్తే తెలంగాణ): చర్లపల్లి డ్రగ్స్ రాకెట్‌లో విస్తుగొలిపే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. నిందితుడు శ్రీనివాస్ విజయ్ ఓలేటి డ్రగ్స్‌ను రహస్యంగా విక్రయించేందుకు ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసుకున్నట్టు ముంబై పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. వాగ్దేవి ల్యాబొరేటరీ ప్రైవేట్ లిమిటెడ్, వాగ్దేవి ఇన్నోసైన్స్, అటెంటివ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎక్సెల్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ పేరిట చర్లపల్లి, నాచారంలో శ్రీనివాస్ విజయ్ పలు కంపెనీలను స్థాపించి, తన సోదరుడు శ్రీనివాస్ అజయ్, రాజన్‌రెడ్డి రామసాని, దువ్వూరి సుబ్రహ్మణ్యంను డైరెక్టర్లుగా నియమించినట్టు గుర్తించారు. వాగ్దేవి ల్యాబొరేటరీలో తయారు చేసిన డ్రగ్స్‌ను హైదరాబాద్‌లో కిలో రూ.50 లక్షల చొప్పున విక్రయించినట్టు తేల్చారు. హైదరాబాద్‌తోపాటు ముంబై, కర్ణాటక, గోవాలోనూ శ్రీనివాస్ విజయ్ భారీగా డ్రగ్స్ విక్రయాలు జరిపినట్టు అనుమానిస్తున్న ముంబై పోలీసులు.. అంతర్జాతీయ డ్రగ్ రాకెట్‌తో ఆయనకు ఉన్న సంబంధాలపై ఆరా తీస్తున్నారు.

షెల్ కంపెనీలకు నగదు బదిలీ?

దువ్వూరి సుబ్రహ్మణ్యం డైరెక్టర్ ఐడెంటిటీ నంబర్ (డీఐఎన్) 01815164తో సెర్చ్ చేయడంతో దేశవ్యాప్తంగా 17 కంపెనీలకు చెందిన వివరాలు వచ్చాయని ముంబై పోలీసులు తెలిపారు. పలు నగరాల్లో ఉన్న ఆ కంపెనీలకు అనుబంధంగా ఒకేరకమైన అడ్రస్‌లు కలిగిన షెల్ కంపెనీలు ఉన్నాయని, వాటికి బదిలీ చేస్తున్నట్టు అనుమానముందనారు.

చర్యలు తీసుకోవడంలో విఫలం

తెలంగాణలో డ్రగ్స్ కట్టడికి ఏర్పాటైన 'ఈగల్' టీమ్ 7 నెలల క్రితమే శ్రీనివాస్ విజయ్‌పై దృష్టి పెట్టింది. కానీ, ఆయన తయారు చేస్తున్న డ్రగ్స్ వివరాలను పూర్తిస్థాయిలో తెలుసుకోకుండా కేవలం నోటీసులిచ్చి సరిపెట్టింది. ఆ నోటీసులను సవాలు చేస్తూ శ్రీనివాస్ విజయ్ హైకోర్టును ఆశ్రయించాడు. ఆ కేసును ఫాలో అప్ చేయాల్సిన ఈగల్ టీమ్.. ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో శ్రీనివాస్ విజయ్ డ్రగ్స్ తయారీకి పూనుకున్నట్టు సమాచారం. కాగా, ఏడాది క్రితం ముంబై పోలీసులూ శ్రీనివాస్ వ్యవహారాన్ని తేలిగ్గా తీసుకున్నట్టు తెలిసింది.

ముంబైకి ముడిసరుకు తరలింపు

ముఠా నుంచి స్వాధీనం చేసుకున్న ముడిసరుకు, రసాయనాలు, సామగ్రిని ఆదివారం ముంబైకి 200 డ్రమ్ముల్లో తరలించారు. ముంబై పోలీసులు శనివారం తెలంగాణలో డ్రగ్స్ ముఠాను అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

నిద్రమత్తులో ఈగల్!

- మెడికల్ షాపులకే డీసీఏ పరిమితం
- రాష్ట్రంలోకి భారీగా సింథటిక్ డ్రగ్స్
- పెరిగిపోతున్న వినియోగదారులు

2024 నివేదిక ప్రకారం రాష్ట్రంలో డ్రగ్స్ కేసులు

సంవత్సరం	2020	2021	2022	2023	2024	పెరుగుదల శాతం
కేసులు	431	1,233	1,179	1,360	1,950	43.38

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో డ్రగ్స్ కట్టడికి ఏర్పాటు చేసిన ఈగల్ బృందాలు గుర్రుపెట్టి నిద్రపోతున్నాయి. పక్క రాష్ట్రం పోలీసులు తెలంగాణలోకి వచ్చి సీక్రెట్ ఆపరేషన్ ద్వారా రూ.వేల కోట్ల మాల్‌ను సీజ్ చేసేవరకూ మనోళ్లు నిద్ర లేవలేదు. మరోవైపు ఏది లీగల్ డ్రగ్? ఏది ఇల్లీగల్ డ్రగ్? అనే వివరాలను తెలిపే డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) కేవలం మెడికల్ షాపులకే పరిమితమైంది. దీంతో మాదకద్రవ్యాల మత్తు తెలంగాణను కమ్మేసింది. గంజాయి, కొకైన్, మెఫెడ్రోన్ లాంటి ప్రమాదకర డ్రగ్స్‌కు రాష్ట్రం నిలయంగా మారింది. యువతను నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్‌ను అరికట్టడంలో ప్రభుత్వ సంస్థలు, పోలీసులు, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు ఘోరంగా విఫలమవుతుండటంతో 'ఉడ్తా తెలంగాణ'గా రాష్ట్రం అపకీర్తిని మూటగట్టుకుంటున్నది. 'పల్లెలతోపాటు పాఠశాలలకూ డ్రగ్స్ వస్తున్నాయి. వాటిని కట్టడి చేయండి మొర్రో' అని సీఎం రేవంత్‌రెడ్డే స్వయంగా మొరపెట్టుకోవడం సమస్య తీవ్రతకు అద్దం పడుతున్నది.

మెడికల్ షాపులకే డీసీఏ పరిమితం

హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లోని పారిశ్రామిక వాడల్లో ఎన్నో అనధికారిక డ్రగ్స్ కంపెనీలు ఇష్టారీతిన మాదకద్రవ్యాలు చేస్తున్నట్టు నిత్యం వార్తలు వస్తున్నా అటువైపు తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్, యాంటీ నార్కోటిక్ టీమ్‌లు, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం మెడికల్ షాపుల్లో రెండు మూడు రకాల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకోవడంతోనే డీసీఏ అధికారులు సరిపెడుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు. మన దగ్గర ఎన్ని పారిశ్రామిక వాడలు ఉన్నాయి? వాటిలోని కంపెనీలు ఏ తరహా డ్రగ్స్‌ను తయారు చేస్తున్నాయి? అవి లీగలా? ఇల్లీగలా? అనే వివరాలను అధికారులు తనిఖీ చేసిన దాఖలాలే లేవు.

పెరిగిపోతున్న డ్రగ్స్ బాధితులు

రాష్ట్రంలో డ్రగ్స్‌ను అరికట్టేందుకు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన 'యాంటీ నార్కోటిక్ బ్యూరో'ను ఇప్పుడు సమర్థంగా అమలుచేసే అధికారులే లేరు. గొప్పల కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఆ విభాగం పేరును 'ఈగల్'గా మార్చినప్పటికీ దాని పనితీరు అంతంత మాత్రమే. గతంలో మహానగరాల్లోని పబ్బుల్లో మాత్రమే వినిపించే డ్రగ్స్ పేర్లు ఇప్పుడు పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా రాష్ట్రమంతటా వినిపిస్తున్నాయి. యూనివర్సిటీలు, కాలేజీలు, చివరికి స్కూళ్లలో సైతం విచ్చలవిడిగా డ్రగ్స్ దొరికుతున్నాయంటే మన నిఘా వ్యవస్థలు ఎంతలా విఫలమవుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. రూ.500కే గంజాయి దొరుకుతుండటంతో యువత మత్తుకు బానిసలవుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా స్కూళ్లు, కాలేజీలు, హాస్టళ్లు, బస్టాండ్లు, శ్మశానాలు, పాడుబడ్డ భవనాలు, చెరువు గట్లు, రైలు పట్టాలపై గంజాయి దమ్ము కొడుతూ కనిపిస్తున్నారు. వారిని మార్చాల్సిన డీ-అడిక్షన్ సెంటర్లు కూడా అంతంతమాత్రంగానే పనిచేస్తున్నాయి.

డ్రగ్స్‌కు సీఎందే నైతిక బాధ్యత

- వెంటనే పదవికి రాజీనామా చేయాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్పీ



కాగజ్‌నగర్/సిర్పూర్(టీ), సెప్టెంబర్ 7 : హైదరాబాద్‌లోని చర్లపల్లిలోగల ఓ కంపెనీలో రూ. 12 వేల కోట్ల విలువైన డ్రగ్స్ దొరకడం తెలంగాణ చరిత్రలో ఇదే మొదటిసారని, ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి నైతిక బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో ఇంత పెద్ద మొత్తంలో డ్రగ్స్ లభించడం దేశ చరిత్రలో ఇది రెండోదని, ఇందులో సీఎం రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్ నాయకుల హస్తమున్నదని ఆరోపించారు. డ్రగ్స్ పట్టుబడడం సిగ్గుచేటని మండిపడ్డారు. డ్రగ్స్ ఎక్కడున్నా వదిలేదిలేదని గొప్పలకు పోయిన సీఎం, చర్లపల్లిలో డ్రగ్స్‌ను ఎందుకు పట్టుకోలేదని ప్రశ్నించారు. అనంతరం సిర్పూర్(టీ)లో పారిగాంకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా వారిని ఆహ్వానించారు.

కేసీఆర్ మరో గరళకంఠుడు

- మల్లికార్జునుడి ఆశీస్సులతో మళ్లీ సీఎం కావడం ఖాయం
- ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్



హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నమస్తే తెలంగాణ): సముద్ర మథనంలో ఉద్భవించిన గరళాన్ని గొంతులో నింపుకొని విశ్వాన్ని కాపాడిన పరమ శివుడిలా బీఆర్ఎస్ పై జరిగిన ఎన్నో కుట్రలు, కుతంత్రాలను తనలోనే దాచుకుంటూ తెలంగాణను సాధించిన కేసీఆర్ మరో గరళకంఠుడని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ అభివర్ణించారు. శ్రీశైలం మల్లికార్జునుడి అనుగ్రహంతో ఆ మహానేత మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని జోస్యం చెప్పారు. ఆదివారం తన పుట్టినరోజును పురస్కరించుకొని శ్రీశైలం మల్లికార్జునస్వామిని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ... కేసీఆర్, ఆయన సతీమణి ఆయురారోగ్యాలతో నిండు నూరేండ్లు వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్టు తెలిపారు. ఎన్ని సంక్షోభాలు వచ్చినా, ఇబ్బందులు ఎదురైనా ఆయన మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని విశ్వాసం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ సర్కార్‌కు ముందుచూపు లేకనే రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని ఆరోపించారు.

ఎంబీఎస్సీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేయాలి

సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశం డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నమస్తే తెలంగాణ): మాదిగ, మాల మినహా మిగతా 57మోస్ట్ బ్యాక్‌వర్డ్ ఎస్సీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని ఎంబీఎస్సీ హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి వెంకటేశం డిమాండ్ చేశారు. ఆదివారం ప్రకటన విడుదల చేశారు. హామీ మేరకు కార్పొరేషన్ ఏర్పాటుచేసి నిధులు కేటాయించాలని కోరారు.

మహేశ్‌ది ప్రభుత్వ హత్యే!

కాంగ్రెస్ అసమర్థతతోనే ములుగులో మున్సిపల్ కార్మికుడి ఆత్మహత్య

- 6 నెలల జీతాలివ్వకనే బలవన్మరణం
- సీఎం, మంత్రి సీతక్క క్షమాపణలు చెప్పాలి
- బాధిత కుటుంబానికి రూ.50 లక్షలివ్వాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్
- ములుగు కార్మికుడు మహేశ్ మృతిపై ఆరా
- బాధిత కుటుంబానికి ఫోన్‌లో పరామర్శ
- పిల్లల పేరిట నగదు జమ చేస్తానని హామీ
- మహేశ్‌తో ఫేక్ వీడియో తీసింది ఆ ఇద్దరే:జ్యోతి



మైదం మహేశ్ కుటుంబానికి బీఆర్ఎస్ తరఫున అండగా ఉంటాం. ఆయన ముగ్గురు బిడ్డలను కేసీఆర్ తరఫున ఆదుకుంటాం. పార్టీ ద్వారా పిల్లల పేరిట నగదు జమ చేయిస్తాం. రెండు రోజుల్లో రెడ్కో మాజీ చైర్మన్ సతీశ్ వచ్చి నగదును అందిస్తారు.. మీరు అధైర్యపడవద్దు. -కేటీఆర్



మృతుడు మైదం మహేశ్ భార్య, పిల్లలు, తల్లితో సతీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నమస్తే తెలంగాణ)/ములుగు: 'ములుగులో మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు మైదం మహేశ్‌ది ఆత్మహత్య కాదు.. ముమ్మాటికీ సర్కారు హత్యే' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతోనే మహేశ్ పురుగుల మందు తాగి ప్రాణాలు తీసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. బలవన్మరణానికి అసమర్థ కాంగ్రెస్ సర్కారే కారణమని విమర్శించారు. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క బాధ్యత వహించి వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికుడు మహేశ్ మృతిపై కేటీఆర్ ఆరా తీశారు. ఆయన ఆదేశాల మేరకు రెడ్కో మాజీ చైర్మన్ వై సతీశ్‌రెడ్డి ఆదివారం ములుగు జిల్లా మాధవరావుపల్లి గ్రామంలోని మృతుడి ఇంటికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కేటీఆర్‌తో మహేశ్ తల్లి, ఇతర కుటుంబ సభ్యులను మాట్లాడించారు. ఈ సందర్భంగా మహేశ్ మృతికి గల కారణాలను కేటీఆర్ తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మహేశ్ మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. అంతకుముందు మహేశ్ మృతిపై కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. 6 నెలలుగా వేతనాలందక పోవడంతోనే మహేశ్ ఆత్మహత్య చేసుకున్నాడని, కాంగ్రెస్ పాలనలో మున్సిపల్ సిబ్బందికి కనీసం వేతనాలు చెల్లించలేని దుస్థితి నెలకొనడం బాధాకరమని పేర్కొన్నారు. మంత్రి సీతక్క నియోజకవర్గమైన ములుగులో జరిగిన ఈ దారుణ ఘటనకు సీఎం, మంత్రిదే బాధ్యతని తేల్చిచెప్పారు.

వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకే దుష్ప్రచారం

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాల్సిన సర్కారు.. మహేశ్ మరణంపై దుష్ప్రచారం చేయడం దుర్మార్గమని కేటీఆర్ ధ్వజమెత్తారు. మంచినీళ్లు అనుకొని పురుగుల మందు తాగానంటూ చెప్పిన ఓ ఫేక్ వీడియోను సృష్టించి సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆదుకోవాల్సిన సర్కారే ఇలాంటి దుర్మార్గానికి ఒడిగట్టిందని మండిపడ్డారు. ఇలాంటి తప్పుడు చర్యలతో ప్రభుత్వ ఘోర వైఫల్యాలను కప్పిపుచ్చుకోలేరని హెచ్చరించారు. సోషల్ మీడియా ముసుగులో తప్పించుకునేందుకు యత్నిస్తున్న కాంగ్రెస్‌కు ప్రజాక్షేత్రంలో శిక్ష తప్పదని స్పష్టంచేశారు. మహేశ్ కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, అతడి భార్యకు ప్రభుత్వం ఉద్యోగమిచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే బాధిత కుటుంబానికి, కార్మికులకు న్యాయం జరిగేదాకా బీఆర్ఎస్ పోరాడుతుందని హెచ్చరించారు. కాంగ్రెస్ వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని తేల్చిచెప్పారు.

జీతమివ్వకుండా శ్మశానంలో పనిచేయించారు: మహేశ్ తల్లి

బీఆర్ఎస్ నేతల ద్వారా కేటీఆర్ మహేశ్ తల్లితో ఫోన్లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె భోరున విలపించారు. ఉబికి వస్తున్న కన్నీళ్లను దిగమింగుకుంటూ కొడుకు మృతికి గల కారణాలను ఏకరువు పెట్టింది. తన కొడుకుకు ఆరు నెలలుగా జీతమివ్వకుండా శ్మశానంలో పనిచేయించారని చెప్పారు. 'మహేశ్‌కు నలుగురు ఆడపిల్లలని, గతంలో ఒక బిడ్డకు జ్వరం రాగా.. పైసల కోసం తిప్పలు పడితే రూ.2 వేలే ఇచ్చారని.. చికిత్సకు డబ్బు లేకపోవడంతో పాప ప్రాణాలు కోల్పోయిందని ఆవేదన వ్యక్తంచేసింది. కొన్ని రోజుల కింద మరోక బిడ్డకు జ్వరమొస్తే రూ.2 వేలు అప్పు తెచ్చి దవాఖానలో వైద్యం చేయించిండని కన్నీటిపర్యంతమైంది. ఆరు నెలల నుంచి జీతాలందకపోవడంతో భార్యాపిల్లలు తిండికి టికానా లేక అవస్థలు పడుతున్నారని ఆ మాతృమూర్తి వాపోయింది. ఇలాంటి దిక్కుతోచని స్థితిలో మున్సిపాలిటీ వాళ్లు శ్మశానవాటిక కోసం ఇచ్చిన గడ్డి మందును తాగి చనిపోయాడని వెల్లడించింది. ఆమె మాటలు విన్న కేటీఆర్ చలించిపోయారు. గతంలో ఇలాంటి ఇబ్బందులుండేవా? అని కేటీఆర్ అడగగా లేవని బదులిచ్చింది. ఆరు నెలల నుంచే కొడుకు చేతిలో చిల్లిగవ్వలేక అష్టకష్టాలు పడుతున్నాడని ఏకరువు పెట్టింది.

మహేశ్ అన్న బిడ్డతో తప్పుడు మాటలు

మహేశ్ అన్న బిడ్డ మైదం జ్యోతి తన బాబాయ్ మరణంపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని రెడ్కో మాజీ చైర్మన్ సతీశ్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. తన బాబాయ్ చనిపోయే ముందు ఎవరూలేని సమయంలో కిరీటి, రఘు వచ్చి నీళ్లు అనుకొని గడ్డి మందు తాగినట్టు బలవంతంగా చెప్పించి వీడియో తీసుకున్నారని చెప్పింది. బాబాయ్ మైకంలో లేని సమయంలో ఆయనతో బలవంతంగా మాట్లాడించారని చెప్పింది. జీతం రాకపోవడం, మున్సిపల్ వాళ్లు పెట్టిన ఇబ్బందులతోనే చనిపోయాడని తెలిపింది. కేటీఆర్ ఆదేశాల మేరకు పార్టీ తరఫున ఆర్థికసాయం చేస్తామని సతీశ్‌రెడ్డి వారికి భరోసా ఇచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, నాయకులు పోమానాయక్, భిక్షపతి, పోరిక విజయ్ రామ్‌నాయక్, గజ్జి నగేశ్, కోగిల మహేశ్, ఆకుతోట చంద్రమౌళి, గరెగె రఘు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో పారిశుధ్య కార్మికురాలి మృతి

ఖైరతాబాద్, సెప్టెంబర్ 7: రోడ్డు ప్రమాదంలో ఓ పారిశుధ్య కార్మికురాలు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. సైఫాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడిమల్కాపూర్‌కు చెందిన రేణుక(42) 15 ఏండ్లుగా జీహెచ్ఎంసీ గోషామహల్ సర్కిల్‌లో ఔట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్నది. దీనిలో భాగంగానే ఆదివారం ఉదయం బషీర్‌బాగ్ నుంచి లిబర్టీకి వెళ్తుండగా ప్రమాదవశాత్తు టస్కర్ చక్రాల కింద పడిపోయింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమెను వెంటనే స్థానిక దవాఖానకు తరలించగా, ఆమె అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. టస్కర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంపై మేయర్, కమిషనర్ ఆరా

కాగా, జీహెచ్ఎంసీ కార్మికురాలు రేణుక మృతిపై నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆరా తీశారు. ఆమె మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబసభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. రేణుక కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

మావోయిస్టు అరుణ్ అరెస్టు

హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న ఛత్తీస్‌గఢ్ పోలీసులు

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ పోలీసులకు తెలియకుండా ఛత్తీస్‌గఢ్ పోలీసులు రహస్యంగా మావోయిస్టు శంకర్ అలియాస్ అరుణ్ ఎర్ర మిచాను అరెస్టు చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని బండేపారాకు చెందిన శంకర్‌పై.. మహారాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల రివార్డు ప్రకటించింది. 2023 నవంబర్‌లో కోవర్టు పేరుతో కపేవన్‌ను హత్య చేయడంతో శంకర్‌పై కేసులు నమోదయ్యాయి. అప్పట్నుంచి శంకర్ అరెస్టుకు పోలీసులు ప్రయత్నిస్తుండగా ఈ నెల 4న అదుపులోకి తీసుకున్నారు. అతడికి కోర్టు 4 రోజుల రిమాండ్ విధించింది.



ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న వేముల

లిఫ్టులను ప్రారంభించి చెరువులు నింపాలి

ఈ పని ఇదివరకే చేసి ఉండాల్సింది ● ఇరిగేషన్ అధికారులకు మాజీ మంత్రి వేముల సూచన

వేల్పూర్, సెప్టెంబర్ 7 : నవాబు లిఫ్ట్, కుకునూర్, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి, గుత్ప లిఫ్ట్‌లను వెంటనే ప్రారంభించి ఆయా గ్రామాల్లోని చెరువులను నింపాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులకు సూచించారు. లిఫ్టులు ప్రారంభం కాక చెరువులకు నీరు రావడం లేదని నవాబు లిఫ్ట్ కమిటీ, కుకునూర్ వీడీసీ సభ్యులు, ఆయకట్టు రైతులు వేల్పూర్‌లో ఎమ్మెల్యే వేములను ఆదివారం కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఎస్సారెస్పీలో పుష్కలంగా నీళ్లు ఉన్నప్పటికీ లిఫ్టులను ఎందుకు ప్రారంభించడంలేదని ప్రశ్నించారు. లిఫ్టులను వెంటనే ప్రారంభించాలని సాంకేతికపరమైన సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలని సూచించారు. లిఫ్టుల పరిస్థితులపై ఇరిగేషన్ శాఖ సీఈ మధుసూదన్, ఈఈ భానుప్రకాశ్‌ను అడిగి తెలుసుకున్నారు. సీజన్ ప్రారంభించక ముందే మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు అన్ని సిద్ధంగా ఉన్నాయా లేనిది చూసుకోవాల్సిన బాధ్యత అధికారులదే అని పేర్కొన్నారు. ఎస్సారెస్పీలో 45 టీఎంసీల నీరు ఉన్నప్పుడే చెరువులు నింపి ఉంటే ఇప్పుడు ఈ సమస్య వచ్చేది కాదని, ఇప్పుడు వందలాది టీఎంసీలు సముద్రం పాలయ్యాయని తెలిపారు. లిఫ్టులను వెంటనే ప్రారంభించి చివరి ఆయకట్టు వరకు నీరందించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని వేముల సూచించారు.

రేవంత్ పాలనలో గురుకులాలు అస్తవ్యస్తం

- కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి రెండు నెలలుగా జీతాలివ్వకపోవడం దుర్మార్గం
- ఎక్స్ వేదికగా హరీశ్‌రావు ఫైర్



హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ హయాంలో సకల హంగులతో కళకళలాడిన గురుకులాలు, రేవంత్ పాలనలో అస్తవ్యస్తంగా మారాయని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. గురుకులాల్లో పనిచేస్తున్న 2,500మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి రెండు నెలలుగా జీతాలివ్వకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. 'ఉపాధ్యాయ దినోత్సవం రోజు పేపర్లు, టీవీల్లో ఆడంబరంగా ప్రకటనలు ఇవ్వడంకాదు.. వారికి సకాలంలో జీతాలు చెల్లించు' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని డిమాండ్‌చేశారు. విషజ్వరాలు, పాములు, ఎలుకల కాట్లతో విద్యార్థులు దవాఖానలపాలై ప్రాణాలుపోయే దుస్థితి దాపురించిందని ధ్వజమెత్తారు. 'గురుకులాలను స్వయంగా పర్యవేక్షిస్తానని చెప్పిన సీఎం మాటలు నీటిమూటలయ్యాయి. కల్తీ ఆహారం పెడితే జైలుకు పంపుతానని చెప్పిన ఢాంబికాలు గాలిలో కలిసిపోయాయి.'అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పాలనలో దేశానికి ఆదర్శంగా నిలిచిన గురుకుల వ్యవస్థ, రేవంత్‌రెడ్డి హయాంలో అధోగతి పాలైందని దుయ్యబట్టారు. రోజుకోచోట విద్యార్థుల మరణాలతో నరకకూపాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు 294 ఉన్న గురుకులాల సంఖ్యను 1,024కు, 1.90 లక్షల విద్యార్థుల సంఖ్యను 6 లక్షలకు పెంచి నాణ్యమైన విద్యను అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని కొనియాడారు. నాడు గొప్పగా వెలుగొందిన గురుకులాలు.. కాంగ్రెస్ 22 నెలల పాలనలో కునారిల్లుతున్నాయని ఆవేదన్య వ్యక్తం చేశారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు చదివే విద్యాలయాలపై ఎందుకంత చిన్నచూపు? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా కండ్లు తెరిచి గాడితప్పిన గురుకులాలపై శ్రద్ధ చూపాలని చురకలంటించారు. వెంటనే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్‌చేశారు.

నేడు సీపీగెట్ రిజల్ట్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణలోని తొమ్మిది యూనివర్సిటీల్లో ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంఏ తదితర కోర్సుల్లో ప్రవేశానికి గత నెల 4,5 తేదీల్లో నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్షల ఫలితాలను సోమవారం విడుదల చేయనున్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. 12 సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలకు 10,841మంది దరఖాస్తు చేసుకున్నారు. 9,218 మంది(88.03%) హాజరయ్యారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో చైర్మన్ బాలక్రిష్ణారెడ్డి ఫలితాలు విడుదల చేయనున్నారని పేర్కొన్నారు. ర్యాంకు కార్డులను అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ పాలన.. ఆత్మహత్యల తెలంగాణ!

బిల్లులు అందక మాజీ సర్పంచులు, కాంట్రాక్టర్లు.. జీతాలు రాక కార్మికులు, ఉద్యోగుల అరిగోస

బతుకు బండి సాగక బాధతో బలవన్మరణాలు

- ములుగులో పారిశుధ్య కార్మికుడి ఆత్మహత్య
- ఇప్పటివరకు పంచాయతీరాజ్‌శాఖలో 13 మంది మృతి

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల బతుకులు భారంగా, భయానకంగా మారిపోయాయి. కార్మికుల నుంచి కాంట్రాక్టర్ల వరకు పాలకుల పీడనకు గురై ప్రాణాలు తీసుకుంటున్న దుస్థితి నెలకొన్నదని విలపిస్తున్నారు. అప్పులు చేసి అభివృద్ధి పనులు చేపట్టిన తమకు బిల్లులు రావడం లేదని సర్పంచులు, జీతాలు అందడంలేదని ఉద్యోగులు, కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. మరి కొందరు ఆవేదనతో గుండెపోటుకు గురై ప్రాణాలు వదులుతున్నారు. పాలకుల నిర్లక్ష్యం, అలసత్వంతో జరుగుతున్న ఆత్మహత్యలు, మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. వీటిని ప్రభుత్వ హత్యలుగానే భావిస్తున్నట్టు బీఆర్ఎస్ స్పష్టంచేసింది. వరుస విషాదాల నేపథ్యంలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు జిల్లాలోనే



ఆరు నెలల జీతం అందక పారిశుధ్య కార్మికుడు ఆత్మహత్య చేసుకోవడం సంచలనంగా మారింది.

పల్లెపల్లెనా ఇదే పరిస్థితి

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీల్లో 52,221 మంది ఉద్యోగులు, కార్మికులు పని చేస్తున్నారు. వీరంతా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, మంచినీటి సరఫరా, వీధి లైట్లు, డంపింగ్ యార్డ్స్, హరితహారం, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాల్లో వివిధ క్యాటగిరీల వారీగా పనులు చేస్తున్నారు. వీరికి నెలకు ఇచ్చే రూ.8,500 వేతనం కూడా మూడు నెలలుగా అందడం లేదు. కొన్ని గ్రామ పంచాయతీల్లో జూన్, జూలై, ఆగస్టు వేతనాలు అందకపోగా, మరికొన్ని పంచాయతీల్లో జూలై, ఆగస్టు జీతాలు రాలేదు. అటు కేంద్రం నుంచి, ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో జీతాల చెల్లింపు కూడా కష్టంగా మారిందని అధికారులు చెప్తున్నారు. సమస్యలు పరిష్కరిస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట.. నీటిమూటగానే మారిపోయిందని కార్మికులు, ఉద్యోగులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

సర్పంచులది మరో గోస

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలో కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపోయాయి. మాజీ సర్పంచులు, కాంట్రాక్టర్లు, కార్మికులు అనే తేడా లేకుండా అందరూ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలోనే ఇప్పటివరకు 13 మంది సర్పంచులు చనిపోయారు. వీరిలో నలుగురు బలవన్మరణాలకు పాల్పడగా, తొమ్మిది మంది వివిధ కారణాలతో మరణించారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడం వల్ల కాంట్రాక్టర్లు ఆర్థికంగా చితికిపోయారు. ఒక కాంట్రాక్టర్ ఆత్మహత్య చేసుకోగా, మరో కాంట్రాక్టర్ అప్పుల ఒత్తిడి తట్టుకోలేక గుండెపోటుతో మరణించాడు. ఇలాంటి ఘటనలు ప్రభుత్వ పరిపాలనా వైఫల్యానికి నిదర్శనాలను కార్మిక సంఘాల నేతలు మండిపడుతున్నారు.

వేతనం అందక కార్మికుడి ఆత్మహత్య

ములుగు మున్సిపాలిటీలో జీతం రాలేదనే మనస్తాపంతో పారిశుధ్య కార్మికుడు మైదం మహేశ్ ఆత్మహత్య చేసుకున్నాడు. ములుగు గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు 103 మంది కార్మికులు పనిచేసేవారు. ఈ ఏడాది మే 30న ములుగు జిల్లా కేంద్రం మున్సిపాలిటీగా మారింది. మున్సిపాలిటీ పరిధిలోని మాధవరావుపల్లి శ్మశాన వాటికలో మైదం మహేశ్(30) పారిశుధ్య కార్మికుడిగా విధులు నిర్వహించేవాడు. గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడే ప్రభుత్వం మహేశ్‌కు రెండు నెలల వేతనం ఇవ్వలేదు. అధికారులను అడిగినా సాంకేతిక సమస్యలు అంటూ దాటవేశారు. ములుగు మున్సిపాలిటీగా మారిన తర్వాత కూడా మూడు నెలలుగా వేతనం రాలేదు. జీతం రాక, కుటుంబం గడవక మహేశ్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. ప్రభుత్వం జీతం ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురైన మహేశ్.. మంగళవారం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మహేశ్‌కు భార్య, నలుగురు కుమార్తెలు కాగా, గతంలో ఒక కుమార్తె అనారోగ్యంతో చనిపోయింది. వేతనం అందక, కుటుంబాన్ని పోషించలేక మహేశ్ బలవన్మరణానికి పాల్పడటం స్థానికంగా విషాదం నింపింది.

వేతనాలు తక్షణమే చెల్లించాలి



కార్మికులకు గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలి. పెండింగ్ జీతాలు కూడా వెంటనే ఇవ్వాలి. ఏటా వినాయక చవితి ప్రారంభం నుంచి దసరా నవరాత్రులు ముగిసే వరకు పంచాయతీ కార్మికులపై తీవ్రమైన పని భారం ఉంటుంది. అదనపు పనికి అదనపు వేతనం చెల్లించకపోగా పండుగల సందర్భంగా ప్రమాదాల్లో కార్మికులు మరణిస్తే ఎలాంటి పరిహారం చెల్లించడంలేదు. మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలి. జీవో నంబర్ 51 సవరించాలి. ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలి. -గ్యార పాండు, జీపీ వర్కర్స్ యూనియన్ నాయకుడు

ప్రభుత్వం మేల్కోవాలి



సర్పంచులుగా పనిచేసిన మేం.. ప్రభుత్వ ఆదేశం మేరకు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. అప్పులు తెచ్చిమరీ పనులు నిర్వహించాం. చేసిన పనులకు కూడా బిల్లులు ఇవ్వకపోవడం దారుణం. బిల్లులు అందక సర్పంచులు ఆత్మహత్య చేసుకోవాల్సిన దుస్థితి నెలకొన్నది. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి. పెండింగ్ బిల్లులు విడుదల చేసే వరకు సర్పంచుల సంఘం పోరాడుతుంది. -గూడూరు లక్ష్మీ నర్సింహారెడ్డి, తెలంగాణ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

రెండు రోజుల్లో ఇస్తామన్నరు



మాకు రావాల్సిన బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఇటీవల పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం కార్యాలయం ఎదుట ధర్నా చేశాం. మాకు రూ.121 కోట్ల బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తి చేశాం. అక్కడి వచ్చిన పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క మా వినతిని విన్నారు. రెండు రోజుల్లోనే రూ.100 కోట్లు విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కానీ ఇప్పుడు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదు. -గజ్జెల అంజిరెడ్డి, మిషన్ భగీరథ కాంట్రాక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

అలైన్‌మెంట్ మారాలంటే సర్కారు మారాలేమో!

మొదటిపేజీ తరువాయి...

జరిగినా మంచిదే.. మునుగోడు ప్రజలకు అన్యాయం జరిగితే మాత్రం ఎంత దూరమైనా వెళ్తా' అని స్పష్టంచేశారు. అవసరమైతే ట్రిపుల్ ఆర్ రద్దయినా మునుగోడు ప్రజలకు అన్యాయం జరగనివ్వనని భరోసానిచ్చారు. ఎక్కడికక్కడ ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తేనే సమస్య పరిష్కారమవుతుందని స్పష్టంచేశారు. తాను కాంగ్రెస్ ఎమ్మెల్యేనే అయినా అవసరమైతే ప్రభుత్వంతో పోరాడుతానని చెప్పారు. 'నేనేదో లాలూచీ పడి సీఎం దగ్గరికి వెళ్లి నాకేదో పదవి ఇస్తే సప్పుడు చెయ్యక కూర్చుంటా అనుకోవద్దు.. మా రైతులకు అన్యాయం చేస్తామంటే నీ పదవి వద్దు.. నీ పైసలొద్దు.. ప్రజలే నా బలం.. నా బలగం.. వారి కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధం' అని ప్రకటించారు. భూములు కోల్పోతున్న బాధిత రైతులు తొక్కని గడపలేదని, బీజేపీ నాయకులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సహా నితిన్ గడ్కరీ, నడ్డా సహా ఢిల్లీలో పెద్దలందర్నీ కలిసినా వారికి న్యాయం జరగలేదని వాపోయారు. ట్రిపుల్ ఆర్‌లో మునుగోడు రైతులే అత్యధిక భూములు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్ ఆర్‌కు అన్నిచోట్లా సమానమైన పొడవు ఉండాలని, కానీ మునుగోడు నియోజకవర్గానికి వచ్చే సరికి పొడవు తగ్గిందని చెప్పారు. ఇక్కడ భూనిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, కేంద్ర మంత్రి గడ్కరీతో కూడా మాట్లాడుతానని తెలిపారు.

జీతాల కోసం భగీరథ కార్మికుల సమ్మె

పర్ణశాల, సెప్టెంబర్ 7: తక్కువ జీతానికే గొడ్డు చాకిరి చేయించుకుంటున్నారని, జీతాలు ప్రతి నెలా రావడం లేదంటూ భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండలం పర్ణశాలలోని మిషన్ భగీరథ తాగునీటి శుద్ధి కేంద్రం కార్మికులు ఆదివారం సమ్మెబాట పట్టారు. 3నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తాగునీటి శుద్ధి కేంద్రం వద్ద కొద్ది రోజులుగా ధర్నా చేస్తున్న కార్మికులు తాజాగా సమ్మెబాట పట్టారు.

ఉప ఎన్నికలు తథ్యం!

మొదటిపేజీ తరువాయి...

అందులో పేర్కొన్నారు. వీరిలో ఒకరిద్దరు మాత్రమే వివరణ ఇచ్చినట్టు తెలిసింది. మిగతా ఎమ్మెల్యేలు నోటీసులపై ఇప్పటి వరకు వివరణ ఇవ్వలేదని సమాచారం. దీంతో సీఎం వారితో సమావేశం కావడం గమనార్హం.

పనీలేదు.. పతార లేదు

భేటీ సందర్భంగా ఫిరాయింపు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ నమ్మి వచ్చిన తమను నట్టేట ముంచవద్దని సీఎంను వేడుకున్నట్టు తెలిసింది. స్పీకర్ నోటీసులు తమను ఇరికించేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేసినట్టు సమాచారం. నియోజకవర్గంలో గొడవలు, నేతల మధ్య విభేదాలను వారు రేవంత్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. అంతేకాదు, తమకు పనీ లేదు, పతార లేదని, ఎందుకొచ్చామో అర్థం కావడం లేదని సీఎం ముందు తలపట్టుకున్నట్టు సమాచారం. పార్టీ మారి వచ్చిన తమను కాంగ్రెస్ పాత కార్యకర్తలు, నేతలు ఇంకా శత్రువులుగానే చూస్తున్నారని వాపోయారట. బాన్సువాడలో ఏనుగు రవీందర్ రెడ్డి, బాలరాజు వర్గాలు తనకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని పోచారం శ్రీనివాస్‌రెడ్డి సీఎం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. గద్వాలలో సరితాయాదవ్ అడుగడుగునా తనను ఇబ్బంది పెడుతున్నారని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పార్టీ నేతలకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ప్రతి నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి ఉందని, పోలీసు బదిలీలు, అధికారుల బదిలీలు అన్నీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు చెప్పినట్టే జరుగుతున్నాయని, అధికారులు తమను లెక్కచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేసినట్టు సమాచారం. నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని, యూరియా కొరత రైతులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నదని, మహిళలు రూ. 2,500 ఇచ్చే ఇందిరమ్మ అభయహస్తం కోసం ఎదురుచూస్తున్నారని ఏకరవు పెట్టినట్టు తెలిసింది. ఇలాంటి సమయంలో ఉప ఎన్నికలకు వెళ్తే ఒక్క సీటు కూడా గెలిచే అవకాశం లేదని ఆవేదన వ్యక్తంచేసినట్టు సమాచారం.

ఆ ఇద్దరి పేర్లు బయటపెట్టిన సీఎం

ఫిరాయింపు ఎమ్మెల్యేల ఫిర్యాదులపై స్పందించిన రేవంత్‌రెడ్డి నేతల మధ్య విభేదాల పరిష్కారానికి హామీ ఇచ్చినట్టు తెలిసింది. పరిష్కార బాధ్యతను పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు అప్పగిస్తామని చెప్పినట్టు సమాచారం. స్పీకర్ నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు ఒకటి రెండు రోజుల్లో న్యాయ నిపుణులను ఏర్పాటు చేస్తామని, ఎమ్మెల్యేల నోటీసులకు వారే సమాధానాలు రాస్తారని చెప్పినట్టు తెలిసింది. అలాగే, పదిమంది ఎమ్మెల్యేల్లో ఒకరిద్దరు ఉప ఎన్నికలు ఎదుర్కొనే అవకాశం ఉన్నదని సూచన ప్రాయంగా చెప్పినట్టు తెలిసింది. వారి పేర్లను కూడా ఆయన బహిర్గతం చేసినట్టు సమాచారం. మిగతా 8 మందికి ప్రభుత్వం తరఫున ఆయన హామీ ఇచ్చినట్టు తెలిసింది. అనర్హత వేటు పడిన వారికి పార్టీ బీఫారాలు ఇచ్చి గెలిపించుకుంటామని, వారి మంచిచెడ్డలు అన్నీ పార్టీ చూసుకుంటుందని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్టు సమాచారం.

నమస్తే తెలంగాణ
హైదరాబాద్
సోమవారం 8 సెప్టెంబర్ 2025
www.ntnews.com

చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి...
editpage@ntnews.com

'పురా కవీనాం గణనా ప్రసంగే / కనిష్ఠికాధిష్ఠిత కాళిదాసః' క్రీ.శ. 5వ శతాబ్దంలో కవీ, మహాకవీ కాళిదాసు ఒక్కడే. అనంతరం కాలంలో కవి భారవి – 'కిరాతార్జునీయం' అనే మహాకావ్యం రాసి మహాకవిగా పరిగణింపబడినాడు. 'ఉపమా కాళిదాసస్య భారవే రర్థగౌరవమ్' అనే శ్లోకపంక్తిని బట్టి ఉపమాలంకార ప్రయోగంలో కాళిదాసూ, అర్థగౌరవంలో భారవీ సాటిలేని సుప్రసిద్ధులనీ అర్థం. అర్థవంతమైన కొద్ది పదాలతోనే గొప్ప భావాన్ని ప్రకటించడం 'అర్థ గౌరవం'!

భారవి-ప్రాంతం: భారవికి ముని మనుమడైన కవి దండి రచించిన 'అవంతీ సుందరి' కథ ద్వారా కవి భారవి బ్రాహ్మణుడనీ, కౌశిక గోత్రీకుడనీ, కాంచీపుర ప్రాంత 'అచలపురం' నివాసి అనీ, పండిత నారాయణస్వామి పుత్రుడనీ తెలుస్తున్నది.

భారవి కాలం: క్రీ.శ.634లో రాజు రెండవ పులకేశి 'ఐహోళె' (కర్ణాటక)లోని మేగుటి జైన దేవాలయం దగ్గర ప్రాచీన కన్నడ లిపిలో వేయించిన సంస్కృత శాసనంలో – ఆ శాసన రచయిత, కవి రవికీర్తి తాను కవితా నైపుణిలో, కీర్తిలో కాళిదాసూ, భారవిలతో సమానుడననీ చెప్పుకున్నాడు. పశ్చిమ గంగవంశరాజు దుర్వినీతుడి ఆస్థానంలోనూ, పల్లవరాజు సింహవిష్ణు (క్రీ.శ. 556–590) ఆస్థానంలోనూ భారవి ఉండేవాడనీ చారిత్రికాధారాలు చెప్తున్నాయి. కనుక పైన ఉదాహరించిన శాసనాది ఆధారాలతో కవి భారవి క్రీ.శ.6వ శతాబ్దం వాడని చెప్పవచ్చు.



అర్థ గౌరవ కవితా రవి.. భారవి

కౌమారంలోనే అర్థగౌరవ కవితాగరిమ: భారవి కౌమార దశ నుంచే అర్థవంత శ్లోకాలు రాస్తూ పండిత ప్రశంసలు పొందుతుండేవాడు. భారవి తండ్రి మాత్రం చిన్నవాడైన తన కొడుకు రాసే కవిత్వం మెచ్చుకోదగినది కాదనీ పండితులకు చెప్పడంతో తండ్రిపై భారవి కోపం పెంచుకొని బండరాయితో మోదాలనుకుంటాడు. అయితే చిన్ననాడే మెచ్చుకుంటే గర్వం పెరిగి, కవిగా పెరగడం ఆగిపోతుందనీ మెచ్చుకోవడం లేదనే తండ్రి మనసులోని మాటను తెలుసుకొని భారవి–తండ్రి పాదాలపై పడి క్షమించమనీ, తన తప్పుకూ శిక్ష విధించమంటాడు. అప్పుడు తండ్రి–భారవిని అత్తవారింట ఆరు నెలలు గడిపి రమ్మనీ, అదే శిక్ష అంటాడు. భారవి భార్యతో అత్తవారి ఊరికి పయనమవుతాడు.

భారవికి – అత్తవారింట మొదటి నెలవరకూ రాచమర్యాదలందుతాయి. ఆ తర్వాతే పశువులను మేపుకు రావడం, ఆ పశువుల పాకను శుభ్రం చేయడం వంటి చిన్న పనులు చేయమనీ ఆజ్ఞాపింపులు మొదలవుతాయి. భార్య చినిగిన వస్త్రాలతో ఉండటం చూడలేక భారవి ఒక తాటాకుపై శ్లోకం వ్రాసి, ఆ ఊరి షావుకారుకు చూపించి కావలసినవి కొని తెచ్చుకొమ్మంటాడు. షావుకారు శ్లోకం చదివి, ఆమెకు ధనమిచ్చి పంపిస్తాడు. ఎదురుగ ఎపుడూ ఆ శ్లోకం కనిపించేట్లు ఇంటి గోడకు తగిలిస్తాడు. కొద్దిరోజులకు అయిదేళ్ళ కొడుకు బాధ్యతను భార్య కప్పగించి ఆ షావుకారు వ్యాపార నిమిత్తం దేశాంతరం వెళతాడు. పదేళ్ళ తర్వాత స్వదేశానికి ప్రయాణమై అర్థరాత్రి ఇల్లు చేరుకుంటాడు. లోపల యువకుడు పడుకొని ఉండటం చూసి, భార్య శీలాన్ని శంకించి, శిక్షించడానికి తొందరపడి ముందుకుపోబోతాడు. గోడపైన శ్లోకాన్ని చూసి ఆగిపోయి నిదానపడి భార్యను నిద్రలేపి, ఆ యువకుడు కొడుకని తెలుసుకొని ప్రేమగా దగ్గరికి తీసుకుంటాడు. శ్లోకంతో తన కుటుంబాన్ని కాపాడిన కవి భారవిని మరునాడు తమ ఊరికి రప్పించి, ధనకనకాదులతో ఘన సన్మానం చేసి పంపిస్తాడు.

> ఆ షావుకారు కుటుంబాన్ని కాపాడిన, భారవి అర్థగౌరవ శ్లోకం ఇది – 'సహసా విదధీతన క్రియా మవివేకః పరమాపదామ్ పదమ్/ వృణతే హి విమృశ్య కారిణం గుణాలుబ్ధాః స్వయమేవవ సంపదః'– ఆలోచన లేకుండా తొందరపడి ఏ పనీ చేయరాదు. అది అనేక ఆపదలకు కారణమవుతుంది. వివేక కార్యశీలురనే సంపదలు తామే వచ్చి చేరుతాయి అని అర్థం. (ఈ శ్లోకం 'కిరాతార్జునీయం' రెండవ సర్గలో 30వ శ్లోకంగా కనిపిస్తుంది)

మహాకావ్యం– 'కిరాతార్జునీయం': కవి భారవి – రాజాస్థాన కవిగా కుదురుకున్న తర్వాతే 'కిరాతార్జునీయం' మహా కావ్యాన్ని ప్రారంభించి ఉంటాడు. ద్వైతవనంలో ద్రౌపదీ సమేతులై వనవాసం చేస్తున్న పాండవుల వద్దకు వ్యాసమహర్షి వచ్చి పాశుపతాస్త్ర సంపాదన ఆవశ్యకతను చెప్పి శివుని గురించి తపస్సు చేసి సంపాదించుకొమ్మని ఉపదేశించి వెళ్ళడం, ధర్మరాజు అనుమతితో అర్జునుడు హిమాలయాలకు వెళ్ళి తపమొనర్చి శివానుగ్రహంతో పాశుపతాస్త్రాన్ని పొంది తిరిగిరావటం ఇది వ్యాస మహా భారతం వన పర్వంలో ఉన్న చిన్న కథ.

> భారవి – ఈ చిన్న కథను తీసుకొని మహాకావ్యోచిత వర్ణనలతో వేయికి పైగా శ్లోకాలతో 'కిరాతార్జునీయం' పేరిట 18 సర్గల మహా కావ్యాన్ని బట్టి 1, 2, 3 సర్గలను ఒక భాగంగా చూడవచ్చు. ఇందులో క్షత్రియోచిత ధర్మాలూ, రాజనీతి గురించీ విలువైన శ్లోకాలున్నాయి.

'శ్రియః కురూణామధిపస్య పాలనీం/ ప్రజాసు వృత్తిం యమయుంత వేదితుమ్' (1–1) అంటూ వనేచర గుప్తచరుడి మాటతో ఈ కావ్యం ఆరంభమవుతుంది. దుర్యోధనుడిరాజ్య పాలననూ కపట ప్రవర్తననూ తెలుసుకోవడానికి ధర్మరాజు హస్తినకు పంపిన వనేచర గుప్తచరుడు వచ్చి, తాను తెలుసుకున్న సమాచారాన్నంతా నివేదించి వెళ్లిపోతాడు. తర్వాత విచారగ్రస్త ద్రౌపది ధైర్యంగా ధర్మరాజుకు క్షత్రియోచిత ధర్మాలు చెప్తూ శాంతిని వదిలి పరాక్రమంతో శత్రు సంహారం చేయమంటూ 'లక్ష్మీస్త్వాం సమభ్యేతు భూయః' (1–46) నీవు మళ్ళీ పూర్వ రాజ్యలక్ష్మిని పొందెదవు గాక అని కోరుకుంటుంది. (భారవి ఇందులోని ప్రతి సర్గాంత శ్లోకంలోనూ 'లక్ష్మి' పదం వచ్చేలా రచించాడు) తర్వాత భీముడూ శాంత స్వభావుడైన ధర్మరాజుకు క్షత్రియోచిత ధర్మాలు విన్పిస్తూ యుద్ధోన్ముఖుడిగా చేయాలని ప్రయత్నిస్తాడు. ధర్మాలన్నింటినీ తెలిసిన ధర్మరాజు – యుద్ధానికి సమయం రాలేదనీ 'సహసా విదధీత న క్రియామ వివేకం...' (2–30) ఆలోచించకుండా తొందరపడి ఏ పనీ చేయరాదనీ, వివేక కార్యశీలురనే సంపదలు స్వయంగా వచ్చి చేరుతాయనీ ద్రౌపదీ, భీమ సేనులను సమాధానపరుస్తాడు. ఇంతలో వ్యాసమహర్షి వచ్చి, ధర్మరాజుతో పరాక్రమించడంతో రాచ్యప్రాప్తి కలుగుతుందని చెప్పి తపస్సుతో అలౌకిక అస్త్రాలు సంపాదించమని అర్జునుడికి ఇంద్రమంత్రోపదేశం చేసి, హిమాలయాలకు తొందరగా చేరడానికి సహాయకుడిగా యక్షుడిని నియోగించి ఆ మహర్షి వెళ్లిపోతాడు. అర్జునుడు అన్న ధర్మరాజు అనుజ్ఞతో, భార్య ద్రౌపది ప్రేమాభిరామ నయనయుగళ వీక్షణాన్ని 'చద్ది'గా గ్రహించి, యక్షుడు మార్గం చూపుతుండగా తపస్సుకై హిమాలయాలకు బయల్దేరుతాడు.

ఇక – 4వ సర్గ నుండి 11వ సర్గ వరకూ మరో భాగంగా చూడాలి. మహా కావ్య వర్ణనలు ఇందులో ఉన్నాయి. భారవి ఊహాశాలిత్వ ప్రతిభ, భావనాశక్తి ఇందులో కనిపిస్తుంది. పచ్చని పంట పొలాలూ, వ్యవసాయదారులున్న ప్రదేశాన్ని చేరుకున్న అర్జునుడికి 'వినమ్రశాలి ప్రసవౌఘశాలినీ.. ఉపాయనీ భూత శరద్గుణశ్రియః (4–2) హరిత గ్రామ సీమలు శరదృతు సంపదను బహుమతిగా ఇస్తున్నట్టుగా ఉన్నాయని వర్ణిస్తాడు భారవి. ఇట్లా పొలాలూ, పంట కాపు కాంతలూ, ఆలమందలూ, పెరుగు చిలుకుతున్న గొల్ల భామలున్న గ్రామ సీమలనూ, గ్రామోప సీమలను దర్శిస్తూ దాటుతూ సూర్యుడిని కప్పివేసేంత ఎత్తయిన హిమాలయాలకు అర్జునుడు చేరుకుంటాడు. 'తపన మండల దీపిత మేకతః.. శివమివానుగతం గచ చర్మణౌ' (5–2) ఒకవైపు సూర్యకాంతిలో ప్రకాశిస్తూ, మరోవైపు రాత్రి చీకటి ఆవరించినట్లు ఉండి గజ చర్మాన్ని ధరించిన శివుని వలె హిమ పర్వతం ఉన్నదని వర్ణించాడు భారవి.

> కైలాస పర్వత పరిసరాల వర్ణన చేస్తూ భారవి – 'ఉత్ఫుల్లస్థలనవినీ.. కనకమయాతపత్ర లక్ష్మీమ్' (5–39) మిక్కిలిగ వికసించిన స్థల పద్మవనం నుంచి గాలిచే ఎగురగొట్టబడిన పుప్పొడి నింగిలో గుండ్రంగా తిరుగుతూ ఆ ప్రాంతంలో స్వర్ణఛత్ర శోభవలె ఉందనీ అద్భుత భావన చేశాడు. దీనితో 'ఆత పత్ర భారవి' పేరునూ పొందాడు.

హిమాలయాల ప్రాంతంలో చంద్రోదయవర్ణన చేస్తూ.. 'సంవిధాతు మభిషేకముదాసే.. సోత్పలో రజత కుంభః ఇవేందుః' (9–32) మన్మథాభిషేకం చేయడానికి యామినీ వనిత, ప్రకాశ కిరణ జలాలతో నింపి, పరిమళం కోసం నల్ల కలువను అందులో ఉంచి, పైకెత్తిన వెండి కలశం వలె చంద్రుడు భాసిల్లాడు' అని చంద్రునిలోని మచ్చను నల్ల కలువతో భారవి మహాద్భుతంగా పోల్చినాడు.

అర్జునుడి తపస్సుకనుకూలమైన ఇంద్రకీలాద్రి చూపి యక్షుడు వెళ్లిపోతాడు. అర్జునుడు ఇంద్రుని గురించి కఠోర తపస్సు మొదలుపెడుతాడు. ఇంద్రుడు అర్జునుడి నియమ నిష్ఠను పరీక్షించడానికి అప్సరసలనూ, గంధర్వులనూ భూలోకానికి పంపుతాడు. వాళ్ళు అర్జునుడు తపస్సు చేస్తున్న ప్రదేశానికి వచ్చి అతడిని ప్రలోభపరచడానికి వన విహారం, పుష్పాపచయం, జలక్రీడలు, శృంగార లీలలు మున్నగునవి చేస్తారు. భారవి కావ్యోచిత వర్ణనలన్నీ – అంటే సూర్యోదయ, చంద్రోదయాది వర్ణనలూ, నదీవర్ణనలూ, శరత్, వర్ష, వసంత, గ్రీష్మ, హేమంతాది ఋతువర్ణనలూ అద్భుతంగా చేశాడు. అప్సరసలు అర్జునుడి ముందు మన్మథావస్థల్ని ప్రదర్శించి ఎంత ప్రయత్నం చేసినా అతడిని కించిత్ ప్రలోభపెట్టలేక విఫలమవుతారు. అప్సరసలూ, గంధర్వులూ తిరిగి వెళ్లిపోయి ఇంద్రుడికి రాజర్షి అర్జునుడి విషయం విన్నవిస్తారు. అప్పుడు ఇంద్రుడు వృద్ధముని వేషంలో వచ్చి అర్జునడితో తపస్సు మాన్పించాలని చూస్తాడు. కానీ అతడి తపస్సు వెనుక దృఢ నిశ్చయం విని, నిజరూపం చూపి శివుడి గురించి తపస్సు చేయమని చెప్పి వెళ్లిపోతాడు.

> **అప్సరసలూ, గంధర్వులూ తిరిగి వెళ్లిపోయి ఇంద్రుడికి రాజర్షి అర్జునుడి విషయం విన్నవిస్తారు. అప్పుడు ఇంద్రుడు వృద్ధముని వేషంలో వచ్చి అర్జునడితో తపస్సు మాన్పించాలని చూస్తాడు. కానీ అతడి తపస్సు వెనుక దృఢ నిశ్చయం విని, నిజరూపం చూపి శివుడి గురించి తపస్సు చేయుమని చెప్పి వెళ్లిపోతాడు.**

> ఇక ఇందులో 12వ సర్గ నుండి 18వ సర్గ వరకూ శివుని గురించి అర్జునుడి మహా తపస్సూ, వారి మధ్య యుద్ధమూ శివుడు ప్రసన్నుడై పాశుపతాస్త్ర ప్రదానం చేయడం ఈ మూడవ భాగంలో ఉంది.


అర్జునుడు సూర్యుడికెదురుగా ఒంటికాలితో నేలపై నిలిచి శివతపస్సు ప్రారంభిస్తాడు. సిద్ధ తాపసులు శివుడికి ఈ విషయం నివేదించగా – నరనారాయణుల్లో నరుడే అర్జునుడని చెప్పి తన ప్రమథ గణాలను కిరాత సేనలుగా ముందు పంపించి తాను కిరాత వేషంలో వచ్చేస్తాడు. తన తపస్సుకు భంగం కలిగిస్తూన్న మూకాసురుడనే వరాహంపై అర్జునుడు బాణం వేస్తాడు. అదే సమయానికి కిరాత వేషధారి శివుడూ బాణం వేస్తాడు. వరాహం నేల కూలుతుంది. దానిని సంహరించింది తామేననీ ఇద్దరి మధ్యా యుద్ధం మొదలవుతుంది. ఆ యుద్ధంలో అర్జునుడి అమ్ముల పొదులు శూన్యమై, ఆయుధాలు విఫలమవుతాయి. అర్జునుడు, శివుడి మధ్య మల్లయుద్ధం మొదలవుతుంది. శివుడి ఎదపై అర్జునుడు పిడికిళ్లతో చరుస్తాడు.

> గాలిలో ఎగిరిన శివుడి పాదాలను పట్టుకొని నేలకు కొట్టాలని ప్రయత్నిస్తాడు. అలిసిపోని అర్జునుడి పరాక్రమానికి శివుడు సంతోషించి నిజరూపం ధరించి అర్జునుడిని కౌగిలించుకొని, ఆతడి తపోదీక్షకు ప్రసన్నుడై పాశుపతాస్త్రాలతో పాటు ధనుర్వేదం ప్రసాదిస్తాడు. లోక పాలకులు విజయ ప్రదాలైన తమ అస్త్రాలను ప్రసాదిస్తారు.

'వజ్ర జయరిం పులోకం.. ధృతగురుజయ లక్ష్మీర్ధర్మసూనుం ననామ' (18–48) అర్జునుడు విజయలక్ష్మిని పొంది వచ్చి, అన్న ధర్మరాజుకు నమస్కరించాడు అనే శ్లోకంతో ఈ 'కిరాతార్జునీయం' మహాకావ్యం సంపూర్ణం అవుతుంది. భారవి రచించిన ఈ 'కిరాతార్జునీయం' మహాకావ్యం మరో మహా కవిని సృష్టించింది. అతడే మాఘ మహాకవి. భారవి ప్రభావంతోనే 'శిశుపాలవధమ్' కావ్యాన్ని మాఘుడు రాశాడు. మహా కవి కాళిదాసుతో పాటు భారవి – సంస్కృత సాహిత్య కావ్య సంవిధాన నిర్మాత అయినాడు!!



రఘువర్మ
(టీయల్యన్)



తెలంగాణ కశ్మీరం..

తూరుపున వేకువ కళ్ళు
తెరుచుకుంది
కలల తలుపులకు తాళాలు వేసి
మస్తిష్కం మేల్కొంది
సౌందర్యాన్ని పూయిస్తున్న వాతావరణంలో
గాలి చిలిపి పరుగులు తీస్తుంది
ఆలోచనల లోయల్లో పచ్చని
లేత ఆకులు రెపరెపలాడాయి
సెరొటోనిన్, ఎండార్ఫిన్‌లు చేసే
రసాయన చర్యలతో మనసు
తన నిండా ఉత్సాహాన్ని నింపుకుంది

2

అడెల్లు దాటినాక అడవి
షేక్ సా లొద్ది నుంచి మొదలయ్యే
మహబూబ్ ఘాట్ రోడ్డు మెలికలు
తిరిగి పడుకున్న నల్లని అనకొండలా
ఉంది
రోడ్డుకిరువైపులా గగనాన్ని తాకే
పచ్చదనం
అద్భుత దృశ్యరూపం కళ్ళప్పగించి
చూసే కళాఖండం
లేత పెదవుల మీద విరబూస్తున్న తెల్లని
ముత్యాల్లా రాలుతున్న చినుకులు
దూరంలో చిత్రకారుడు తన కాన్వాస్‌పై
గీసిన చిత్రంలా ఉంది గోదావరి
నవ్వులు చిలకరిస్తూ ఆహ్వానం
పలుకుతుంది
మంచు దుప్పటి కప్పుకున్న గ్రామాలు
సూక్ష్మ రూపాన్ని ధరించినట్లుంది
అక్కడి గిరిజనుల మనసుల నిండా
మంచితనం

3

కళ్ళ నిండా పచ్చదనం మనసంతా
వెచ్చదనం
కళ్ళల్లో పరుచుకున్న పచ్చని ఊహలు
బతుకుకు భరోసానిచ్చే ఆవరణం
అది ఊహల్లో బతికే స్వప్నాలను
ఉనికిలోకి తెస్తుంది
ఆకాశంలోని చిత్రాలను చూస్తే
జీవితం మీద ఆశను చిగురింపజేస్తాయి
చల్ల గాలి పిలుపులను సందె కాంతి
మలుపులను ఏకాంతపు కన్నులు
గమనిస్తున్నాయి

4

లేత ఆకుల మీది నీటి చుక్కలు
అక్కడి యాడీల రవికల మీద
ఉన్న అద్దాల్లా మెరుస్తున్నాయి
మనసంతా పచ్చదనంతో నాకు నేను
అడవిగా మారిపోయాను
కోయిల పిలుపులు కోనల్లో రాగాల
చినుకులై కురుస్తున్నాయి
అక్కడక్కడా పురివిప్పిన నెమళ్ళు
కనుల విందు చేస్తున్నాయి
పచ్చని రామ చిలుకలు అడవి
పచ్చదనాన్ని పెంచాయి
ఆమని మాటే మరచిన అడవిని మేఘం
తడిపేసింది

5

ఘాట్ రోడ్డు మీద కారు
ఆయాసపడుతుంది
పరిగెట్టడం మరిచి నడుస్తుంది
అద్దం మీద ఫాగ్ (మంచు)
కమ్ముకుంటుంది
కారు లోపల చల్లని కుంపటి
వణుకు పుట్టించే స్థితి
రోడ్డు పక్కన ఛాయ దుకాణాల్లో
రేపటి మీద ఆశ లేని వృద్ధుల
నిస్సహాయపు నవ్వులు విరబూస్తున్నాయి
మైదాన ప్రాంతాల జాడ్యాలు
లేని ఆ అమాయకపు ముఖాల్లో
ఇప్ప పువ్వు పూసినట్లుంది
ఏ టెన్షన్ లేని అమాయకపు
పసి నవ్వులు రోడ్డు పక్కన
ఆడుకుంటున్నాయి

6

గుట్టను చీల్చుకుంటూ వచ్చే వాగు
పచ్చని చెట్ల కింద సేద తీర్చుకుంటూ
సాగుతోంది
కల్మషం లేని వాగు నీళ్ళు అక్కడి
గిరిజనుల మనసుల్లా ప్రవహిస్తున్నాయి
మహబూబ్ ఘాట్ ప్రయాణికుల
దాహం తీర్చే దాపు
వాగులో మౌనంగా సాగిపోయే
నీళ్ళ సోయగాలు నిద్ర పోని అడవికి
నిగరానీ కాస్తుంది
ఆ స్వచ్ఛదనం అక్కడి గోండుల
స్వచ్ఛతకు పతాక
ఆ నీటిలో మన ముఖం అద్దంలో కన్నా
అందంగా కనిపిస్తుంది

7

అడవి నుంచి రోడ్డు మీదకు వచ్చిన
వానర మూక సందడి చేస్తుంది
పరిగెడుతున్నాయి...
ఆడుకుంటున్నాయి
ఆహ్లాదకరమైన వాతావరణాన్ని
ఆస్వాదిస్తున్నాయి
అప్పుడప్పుడు వాహనాల చక్రాల
కింద పడి నుజ్జు నుజ్జు అవుతున్నాయి
వానర సమూహంలో విషాద ఛాయలు
కళ్ళల్లో తడి.. కనురెప్పలు
తడిచే సన్నివేశం
స్పందించే హృదయంలోనే తడి
ఉంటుంది
ఒక మరణం కొన్ని జీవితాల్లో
అమావాస్యను వెలిగిస్తుంది
తుప్పర చినుకులు కారు అద్దాన్ని
కమ్మేస్తున్నాయి
ఒక కన్నీటి తెర కళ్ళను
మసకబారుస్తుంది....



ప్రమోద్ ఆవంచ
70132 72542

(నిర్మల్ నుంచి ఆదిలాబాద్‌కు ఘాట్ రోడ్డు మీద ప్రయాణించినప్పుడు కలిగిన అనుభూతులు)



రమ్మన రాదు యెంత సురరాట్టును వేడిన గాని భూతలిన్
పొమ్మన పదు వారిదము పొంగుచు పంటల ముంచెనంతటన్
ఝుమ్మని వీచె గాలులిక జోరుగ కూలెను మ్రానులన్ని యున్
చెమ్మను గాంచి కీటములు చేర్చెను రోగము గీములందునన్

నిండెను వాగువంతలును నిత్యపు వర్షపు నీటి ధాటికిన్
గండి పడంగ కొల్లలుగ గట్టి గృహంబులు కూలుచుండగన్
అండగనున్న పాడిపసులన్నియు నంతము చెందుచుండగన్
గుండెలు మండుచుండె నతి ఘోర గతిన్ గని మానవాళికి

చక్కటి నేల లేదు మరి సాగదు వాహన చక్ర మెచ్చటన్
చుక్కలు కానరావు శశి చూడడు పున్నమి రాత్రి నందునన్
మిక్కుటమౌ పయోదములు మిన్నున నాటలు నాడుచుండగన్
ఎక్కడ చూచినన్ జలము ఏపుగ పంకిల మంటునంతటన్

కూలికి పోవువారలకు కూటికి కష్టము గుండె మెండుగన్
బాలురు పాఠశాల జన బాటలు నిండెను బంక మట్టితోన్
కాలపు కట్టెలెక్కడను గంజిని వేడిగ గ్రోల బోవగన్
తాలిమి తోడ వేచినను తప్పక పోయెను తిప్పలెల్లెడన్



పూట్ల భద్రయ్య
95502 56840

ఒక మాగి పొద్దు..

అతను మెట్లెక్కి కప్పు పైకి పాకాడు
గూన పెంకుల్ని ఒక్కొక్కటిగా తీసి ఏదో
వెతుకుతున్నాడు
కాసేపు వెతుకులాట
తర్వాత దిగి ఇంటి దొడ్డి గుమ్మం వైపుకి
ప్రవాహంలా సాగి..
పెరిగిన మొక్కల్ని ఒక్కొక్కటిగా
పెరికి నేల మీద గిరాటేశాడు
అతని జీవితంలో అసందర్భాలు
అలా అలా వస్తూ ఉంటాయి
అతనేమీ లెక్క చేయడు!
తెరుచుకున్న ఇంటి మధ్య
భాగంలో నిలబడి తల పైకెత్తి చూస్తాడు
అంతటా నిశ్శబ్దం కప్పబడి వుంటుంది!
ఆకాశంలో చుక్కలు కనబడలేదు
ఇంకా చీకటి కాలేదని గ్రహించాడు..

పగటి వెలుతురును పిడికిలిలో
పట్టుకోవాలని అతని తపన
పిడికిలి పుట్టిన ప్రతిసారి చీకటి గుప్పిట్లోకి
జొరబడుతోంది
గుప్పిట్లోకి తొంగి చూసిన
ప్రతిసారి చుక్కలు కనబడతాయి
ఆశ్చర్యం –భార్య, పిల్లలు,
తల్లి, తండ్రి, బంధువులు,
స్నేహితులు, శత్రువులు
ఇంకా ఇంకా.. అనేకం దర్శనమిస్తాయి!
అప్పట్నుంచి–పగటి వెలుతురులో
చుక్కలు చూడటం మానివేశాడు.
ఇప్పుడతను కప్పు పైన ఒక్కో
గూన పెంకును పొందికగా సర్దుతున్నాడు
పీకి పారేసిన మొక్కల్ని ఒద్దికగా
నాటుతున్నాడు..





డాక్టర్ రూప్‌కుమార్ డబ్బీకార్
91778 57389

విరిసిన మోదుగుపూల వాన

మద్దికుంట లక్ష్మణ్ మొదటి కవితా సంపుటి 'వర్గమూలం'. 60 ఏండ్ల జీవితం 30 కవితలుగా విచ్చుకున్నది. పలుగురాళ్ల మీద నడిచిన పాదాలు ప్రాపంచిక దృక్పథాన్ని వీరికి అందించాయి. చదివిన చదువు జరుగుతున్న పరిణామాలను పట్టుకోవడం నేర్పింది. కష్టాలను, కడగండ్లను నవ్వుతూ దాటాలని అనుభవం తేల్చి చెప్పింది. బాధే సౌఖ్యమనే భావన మృదుత్వాన్ని ప్రసాదించింది. వీటన్నిటి సమాహారంగా లక్ష్మణ్ కవిత్వం కనబడుతుంది.



సైద్ధాంతిక కట్టుడు రాళ్లతో కాకుండా జీవితం ప్రసాదించిన పాకుడురాళ్లతో పొందికగా కవిత్వం కట్టిండు. మూగ బాధ, చేదు జ్ఞాపకం, ముక్కలైన గుండె, కూలిన మెదడులను అగ్గిపెట్టెలో అమర్చిన ఆకులందు బంగారు పురుగును పెట్టినట్టు కవితలుగా చుట్టి అందించాడు. భావకవి కాదు, బాధ కవి. నీటి కళ తెలిసిన పల్లె కవి. వస్తువు చెక్కిన మనిషిని తెలిపిన నగరకవి. మామూలు మాటలే అంతరార్థాన్ని పట్టిస్తాయి. ఉట్టి మాటలే కన్నీళ్లు తెప్పిస్తాయి. అల్కగనే చెప్తాడు. గొట్టు ముచ్చట తెలుస్తది. ఇది ఇతని శైలి. కైకట్టడం అంటే పేర్చడం కాదు, ఏర్రై కారడం. మనిషిలోని పూటికను వాడికే చూపించడం. ఈ దారిలో ఇతడు నడిచాడు.నాస్టాల్జియాను నెమరువేస్తూ నిద్రపోతాడు. నిద్రపోతున్న పాఠకుడిని తట్టి లేపుతాడు. పల్లెను మానవీకరించి పరాయీకరణ ప్రభావాలను విశద పరుస్తాడు. తళుకు బెళుకు అక్షరాలను చెత్తబుట్టలోకి సారభూతమైన పదాలను గుండె గూటిలోకి నెట్టడం తెలిసిన పాఠకుడితడు. కొలతల లోకంలో మానవ విలువలు లెక్కతప్పడాన్ని గుర్తుచేస్తాడు. తిరుగుబాటును, పోరుబాటను జరుగుబాటు మార్గాలుగా ఉపమానీకరించి చెప్పడంలో భావుకత ప్రధాన భూమిక వహించింది. అధికారానికి దాసోహమయ్యే తీరును అందంగా వివరిస్తూ ఫలితాన్ని విషాదపుటంచున నిలబెడుతాడు. సంభాషణను కవితా నిర్మాణంగా స్వీకరించి స్పర్శను పంచుతాడు. గానశకలం లాంటి పదాలు పుల్లెందుల, నింగి నీళ్లు పోసుకుంటది లాంటి శీర్షికలు మనసును మురిపిస్తాయి. ప్రాంతోచిత భాష కొలుపు కొలుస్తది. కవితల్లోని భయద సౌందర్యం భ్రాంతిని పటాపంచలు చేస్తుంది.



బీవీఎన్ స్వామి
92478 17732

ఓ బంగరు చెల్లెమ్మ..!

తొలుసూరు నలుసుకేమో
ఎదురుచూసె స్వాతమ్మ..
ఆ మురిపెం ముంచేసి
పైశాచికానందం..

సిందూరం అద్దినపుడు
చందమామ అందమనే....
కడకేమో పిచ్చి కథలు
నాటకాలు రక్షకులకు..

నువ్వాడిన ఆటలో
అబార్షన్ల మోసమొకటి..
వేప చేదు తీయనైతే
నీ గుండెనేమో కుళ్లె సూడు..

కాలం సల్లిన అక్షింతలు
శ్రీమంతం ఆరాటం
చితి మీదికి నీ ఆశలు..

నీ ఊసులు, బాధలన్నీ
అయినోళ్లకు దూరంగా..
ఉంటుందా దయనీయం
ఎందుకొచ్చే ఈ కష్టం..!

చేత కాని ప్రేమతోటి
చెడిపోయిన మనసుతోటే
నూరేళ్లు అనుకుంటివి..
ప్రేమెట్లా మాసిందో
తుంచె వాడు ఆశలన్నీ..!


అసమానం ఆమె బాస
అనుమానం నీ ఆటాయె
నరరూప రాక్షసుడా
విష నాగుల 'కాటు నయం'..!

పక్క సుఖం ఎరిగినపుడు
అడ్డు రాని కుల గోడలు
పుట్టెబిడ్డ కెట్లొస్తయ్?

చట్టముండే, శిక్షలుండే
నాకెందుకు అనుకోకు
రేపు నీ వొంతే కావొచ్చు..!

ఆది, అంత్య ఈ సృష్టి
ఇంతేనా? ఇంతేనా?

రాబంధుల చెండాడ
రగిలే జ్వాలై రావమ్మా
ఓ బంగరు చెల్లెమ్మ..



సురేంద్ర బండారు
90108 47120



కరీంనగర్ జిల్లా వెన్కేపల్లి-సైదాపూర్ సింగిల్‌విండో వద్ద యూరియా కోసం పోలీస్ పహారా మధ్య పెద్దసంఖ్యలో బారులు తీరిన రైతులు



కరీంనగర్ జిల్లా వెన్కేపల్లి సైదాపూర్ సింగిల్‌విండో ఆఫీస్ వద్ద క్యూలో ఉన్న రైతులను కట్టడి చేస్తున్న పోలీసులు, యూరియా ఇప్పించండయ్యా అంటూ వేడుకుంటున్న మహిళలు

అవే బారులు.. అవే అవస్థలు



కరీంనగర్ జిల్లా బూరుగుపల్లిలో యూరియా కోసం సీఎం రేవంత్‌రెడ్డికి దండం పెడుతున్న రైతు గర్వందుల కిషన్

యూరియా కోసం తప్పని తిప్పలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, సెప్టెంబర్ 7: రాష్ట్రవ్యాప్తంగా యూరియా బస్తాలకోసం రైతులు బారులు తీరుతూ అవస్థలు పడ్డారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా కంకర బోర్డులోని పీఏసీఎస్ కేంద్రానికి 250 బస్తాల యూరియా రాగా 750 మంది రైతులు లైన్‌లో ఉండడంతో వాటిని ఎలా పంపిణీ చేయాలో అర్థంకాక అధికారులు, పోలీసులు తలలు పట్టుకున్నారు. కురవి సొసైటీలో మూడు రోజుల క్రితం కూపన్లు ఇచ్చిన రైతులకు ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ దగ్గరుండి యూరియా పంపిణీ చేయించారు. గుండ్రాతిమడుగు, దంతాలపల్లి పీఏసీఎస్ వద్ద ఒక్కో రైతుకు ఒక్కోబస్తా చొప్పున అందజేశారు. నర్సింహులపేట పీఏసీఎస్ వద్ద రైతులు తిండీతిప్పలు మాని బారులుతీరారు. నెల్లికుదురు మండలం శ్రీరామగిరి, ఎర్రబెల్లిగూడెం సొసైటీ కేంద్రాల్లో పోలీసు పహారాలో యూరియా పంపిణీ చేశారు. బయ్యారం రైతువేదికలో తాగునీరు లేక తీవ్ర ఇబ్బందిపడ్డారు. వరంగల్ జిల్లా బంజరుపల్లిలోని ఫర్టిలైజర్ షాపువద్ద భారీ వర్షంలోనూ రైతులు లైన్‌లో నిలబడ్డారు. కరీంనగర్ జిల్లా వెన్కేపల్లి-సైదాపూర్ సింగిల్‌విండో వద్ద 600 మందికి రైతులు బారులు తీరారు. సీఐతోపాటు ఇద్దరు ఎస్ఐలు పర్యవేక్షించారు. వరంగల్ జిల్లా ఖానాపురం మీదుగా యూరియా లారీలు మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి తరలివెళ్తుండగా గమనించిన స్థానిక రైతులు ఎన్‌హెచ్ 365 జాతీయ రహదారిపై ధర్నా చేశారు. ఎస్సై రఘుపతి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి ఆందోళనను విరమింపజేశారు.

'మీ మీద మన్ను వొయ్య'

రాష్ట్రప్రభుత్వం, పోలీసులపై దుమ్మెత్తి పోసిన మహిళా రైతు



మహబూబాబాద్, సెప్టెంబర్ 7(నమస్తే తెలంగాణ): 'మీ మీద మన్ను పొయ్యా.. ఒక్క బస్తా ఇయ్యరా..! ఇదేమి ప్రభుత్వం'.. అంటూ ఓ మహిళా రైతు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులపై దుమ్మెత్తి పోసింది. వివరాల్లోకి వెళితే.. ఆదివారం మహబూబాబాద్ కంకర బోర్డులోని పీఏసీఎస్‌లో అధికారులు యూరియా పంపిణీ చేపట్టారు. వారం క్రితం కూపన్లు తీసుకున్న రైతులు లైన్‌లో నిలుచున్నారు. ఒకే బస్తా ఇవ్వడంతో ఆగ్రహించిన మహిళా రైతు తనకు మూడు ఎకరాల భూమి ఉంటే ఒక బస్తా ఏమి సరిపోద్ది అంటూ ఆందోళనకు దిగింది. పోలీసులు బయటకు పంపడంతో తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయిన మహిళా రైతు 'మీ మీద మన్ను పొయ్య.. ఎందుకు మమ్మల్ని పరేషాన్ చేస్తున్నరు' అంటూ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులపై దుమ్మెత్తి పోసింది. తిట్లు, శాపనార్థాలు చేస్తుండడంతో పోలీసులు అక్కడ నుంచి చల్లగా జారుకున్నారు.



మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని పీఏసీఎస్ వద్ద బారులు తీరిన రైతులు, పరిస్థితిని పర్యవేక్షిస్తున్న ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్



వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బంజరుపల్లి ఫర్టిలైజర్ షాపు ఎదుట భారీ వర్షంలోనూ లైన్‌లో నిలబడిన రైతులు



మహబూబాబాద్ పీఏసీఎస్ వద్ద యూరియా కోసం ఎండలోనూ క్యూలో నిల్చున్న మహిళలు

రైతుల వెతలు కనిపించడంలేదా?

- కాంగ్రెస్ నేతలకు ఎన్నికల హామీలు గుర్తులేదా
- రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ ఆగ్రహం

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నమస్తే తెలంగాణ): పొలాలు ఎర్రబారుతుంటే యూరియా కోసం దైన్యంగా రైతులు రోడ్లపై నిల్చుండడాన్ని చూస్తుంటే మళ్లీ సమైక్య పాలనలోని పరిస్థితులు కండ్లెదుట కదలాడుతున్నాయని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ ఆవేదన వ్యక్తంచేశారు. స్వపరిపాలనలో అన్నదాతకు ఈ దుస్థితి వస్తుందని ఏనాడు అనుకోలేదని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ అసమర్థతతోనే రైతులు ఎరువుల కోసం అరిగోస పడుతున్నారని మండిపడ్డారు. రైతుల కోసం మేమున్నామంటూ ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ నాయకులకు.. ఇప్పుడు రైతులు పడుతున్న వెతలు కనిపించకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. .

సైన్‌బోర్డులపై బెంగాలీ తప్పనిసరి

కోల్‌కతా మున్సిపాలిటీ ఆదేశం

కోల్‌కతా, సెప్టెంబర్ 7: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో వర్తక, వాణిజ్య సైన్‌బోర్డులు, హోర్డింగ్‌లపై బెంగాల్ భాషను తప్పనిసరి చేశారు. ఈ మేరకు కోల్‌తా మున్సిపల్ కార్పొరేషన్ ఉత్తర్వులు జారీ చేస్తూ.. దానికి సెప్టెంబర్ 30 డెడ్‌లైన్‌గా విధించింది. భాషా అధికారాన్ని ప్రోత్సహించడం, సమ్మిళితత్వాన్ని నిర్ధారించడం లక్ష్యంగా ఈ చర్య తీసుకున్నట్టు కోల్‌కతా మేయర్ ఫిర్హాద్ కాశీమ్ తెలిపారు. కాగా, గత ఏడాది డిసెంబర్ 30న కూడా కార్పొరేషన్ అధికారులు ఇలాంటి సర్క్యులర్‌ను జారీ చేశారు.

యూరియా కొరత... 60 రోజుల వ్యథ

రెండు నెలలైనా తీరని అన్నదాతల వెతలు

- యూరియా పంపిణీలో సర్కారు వైఫల్యం
- కేంద్రం ఇస్తలేదని పాలకుల కాలయాపన
- సీఎం నిర్లక్ష్యమే కారణమని రైతుల ఆగ్రహం
- తమ కోటాను తెచ్చుకున్న ఇతర రాష్ట్రాలు
- మరో 15 రోజుల్లోగా చల్లితేనే ఫలితం
- లేకపోతే దిగుబడి భారీగా తగ్గే అవకాశం

హైదరాబాద్, సెప్టెంబర్ 7(నమస్తే తెలంగాణ): ఒక్క రోజో.. రెండు రోజులో కాదు... ఏకంగా రెండు నెలలు గడుస్తున్నా.. రాష్ట్రంలో రైతుల యూరియా కష్టాలు తీరడంలేదు. కాంగ్రెస్ సర్కారు పెద్దలు మాటలే చెప్పడం తప్పా.. యూరియా మాత్రం ఇవ్వడంలేదని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వివిధ రాష్ట్రాలు మాత్రం కేంద్రం నుంచి అవసరైమన యూరియాను తీసుకెళ్తుంటే.. తెలంగాణ సర్కారు మాత్రం సాకులు చెప్తూ కాలయాపన చేస్తున్నదని మండిపడుతున్నారు. తొలకరి వర్షాలు మొదలైనప్పటి నుంచి ఒక్క బస్తా యూరియా కూడా దొరకని రైతులు కూడా ఉన్నారు. ఇప్పుడు కూడా ఎరువు కష్టాలు తీరే పరిస్థితి కనిపించడం లేదని చెప్తున్నారు.


రేవంత్‌రెడ్డి సర్కారు విఫలం

కేంద్రం నుంచి యూరియా తీసుకురావడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం, మంత్రులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని రైతు సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇతర రాష్ట్రాలు ప్రణాళికబద్ధంగా కేంద్రంతో సంప్రదింపులు చేస్తూ యూరియా తెచ్చుకుంటున్నాయని చెప్తున్నారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల వెల్లడించిన ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. పలు రాష్ట్రాలకు కేంద్రం కేటాయించిన యూరియాలో 65-75శాతం వరకు సరఫరా పూర్తయింది. తెలంగాణ రాష్ట్రం మాత్రం కేవలం 55శాతం మాత్రమే తెచ్చుకున్నదని మంత్రి వెల్లడించారు.

ఢిల్లీకి పోలేదు.. యూరియా తేలేదు

కేంద్రం యూరియా ఇస్తలేదని చెప్పడమే తప్పా.... కేంద్రం నుంచి యూరియా తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఏమిటనేది రైతు సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఢిల్లీ నేతలతో ఎందుకు చర్చించడంలేదని నిలదీస్తున్నారు. కాంగ్రెస్ సర్కారు రైతులను గాలికి వదిలేసిందనే విమర్శలు గుప్పిస్తున్నారు. యూరియా కొరత ముంచుకొస్తుందని ప్రభుత్వానికి, వ్యవసాయశాఖ మంత్రికి, వ్యవసాయశాఖ ఉన్నతాధికారులకు మే నెలలోనే తెలిసినా ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారని మండిపడుతున్నారు. ఢిల్లీకి వెళ్లి కేంద్రంతో మాట్లాడి, మన కోటా యూరియా తీసుకొచ్చేందుకు చర్యలు ఎందుకు తీసుకోవడంలేదని ప్రశ్నిస్తున్నారు. రాజకీయ భేటీల కోసం ఢిల్లీ వెళ్లిన రేవంత్‌రెడ్డి.. ఆ మధ్య ఓ సారి కేంద్రమంత్రి జేపీ నడ్డాను కలిశారు. కానీ పదేపదే ఢిల్లీ వెళ్తున్న ఆయన ఎందుకు ఫాలో అప్ చేయలేదని రైతుల సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రానికి నామమాత్రంగా లేఖలు రాస్తే ఫలితమేంటని నిలదీస్తున్నారు.

రాష్ట్రం	కేటాయింపు (లక్షల టన్నులలో)	తెచ్చుకున్నది (లక్షల టన్నులలో)
తెలంగాణ	9.8	5.42 (55.31%)
రాజస్థాన్	10.72	7.78 (72.57%)
ఉత్తరప్రదేశ్	33.50	25.18 (75.16%)
ఛత్తీస్‌గఢ్	6.57	4.9 (74.58%)
మధ్యప్రదేశ్	17.20	11.20 (65.12%)
మహారాష్ట్ర	15.52	9.86 (63.53%)





మహబూబాబాద్ పీఏసీఎస్ వద్ద యూరియా కొరకు బారులు తీరిన రైతులు

రామగుండంపై ఫ్యాక్టరీపై పట్టింపేది?

రాష్ట్రంలోని రామగుండం ఎరువుల తయారీ ఫ్యాక్టరీ నుంచి మన రాష్ట్రానికి అధిక శాతం యూరియా రావాల్సి ఉంది. సాంకేతిక కారణాలు, రిపేర్లతో ఫ్యాక్టరీ మూడుసార్లు షట్‌డౌన్ అయింది. దీంతో ఆగస్టు వరకు 1.69 లక్షల టన్నుల యూరియా రావాల్సి ఉండగా 1.06 లక్షల టన్నులు మాత్రమే సరఫరా అయింది. అయినా ప్రభుత్వం ఆ విషయం గురించి పెద్దగా పట్టించుకోలేదని రైతు సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. యూరియా కొరత తీవ్రమైన తర్వాత ఆగస్టు 23న ఫ్యాక్టరీ ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల భేటీ అయ్యారు. ఇదే పని చాలా ముందు చేయాల్సిందని చెప్తున్నారు.

రాళ్ల దాడులు... లాఠీచార్జీలు

కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంతో రైతులు యూరియా కోసం అరిగోస పడుతున్నారు. బీఆర్‌ఎస్ పాలనలో చాలా సులభంగా ఎన్ని బస్తాలు కావాలంటే అన్ని బస్తాల యూరియా తీసుకొచ్చుకున్న రైతులు.. ఇప్పుడు ఒక్క బస్తా కోసం యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. యూరియా విషయంలో ఉమ్మడి రాష్ట్రం నాటి దుర్భర పరిస్థితి మళ్లీ కండ్ల ముందుకొచ్చాంది. మళ్లీ చెప్పులు, పాస్ బుక్కుల లైన్లు దర్శనమిస్తున్నాయి.

అదును దాటితే దిగుబడి నష్టం

యూరియా కొరత పంటల సాగుపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదముంది. యూరియా దొరక్కపోవడంతో పంటలకు యూరియా వేయాల్సిన సమయం మించిపోతున్నది. దీంతో పంటల ఎదుగుదల, దిగుబడిపై ప్రభావం ఉంటుందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఇప్పటికే వరికి రెండుసార్లు యూరియా వేయాల్సింది. కానీ చాలా మంది రైతులు ఒక్కబస్తా కూడా చల్లలేదు. మరో 15 రోజుల్లోగా యూరియా చల్లాల్సిన సమయం మించిపోతుంది. ఆ తర్వాత యూరియా వేసినా ఫలితం ఉండదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా యూ రియా పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లోనే 20-30శాతం దిగుబడులు తగ్గే ప్రమాదముందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికీ యూరియా దొరక్కపోతే.. నష్టం మరింత పెరిగే అవకాశముందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు వ్యక్తంచేస్తున్నారు.



'రైతుల కోసం రాజన్న పాదయాత్ర'ను జెండా ఊపి ప్రారంభిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే రాజయ్య, బీఆర్‌ఎస్ నేత రాకేశ్‌రెడ్డి

రేవంత్, కడియం నయవంచకులు

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తీవ్ర ఆగ్రహం

ఐనవోలు, సెప్టెంబర్ 7: సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇద్దరూ ప్రజలను నమ్మించి మోసం చేసిన నయవంచకులేనని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జనగామ జిల్లా వెంకటాపురం నుంచి స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య చేపట్టిన 'రైతన్న కోసం రాజన్న పాదయాత్ర' రెండో విడత కార్యక్రమాన్ని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డితో కలిసి ఎర్రబెల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి పొద్దున లేస్తే అబద్ధాలు ఆడుతాడని, కడియం శ్రీహరి తుపాకీ రాముడు చెప్పినట్టు ముచ్చట చాలాచక్కగా చెప్తాడని ఎద్దేవా చేశారు. దేవాదులలో నీళ్లు పారించిన ఘనత కేసీఆర్‌ది అని కొనియాడారు. రాజయ్య ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 12 ఏండ్ల క్రితం ఆగిపోయిన దేవాదుల కాలువకు నీళ్లు తేవడానికి రూ.250 కోట్లు ఉన్న అంచనాను రూ.350 కోట్లకు పెంచి సుమారు 75 శాతం పనులు పూర్తి చేసిన విషయాన్ని గుర్తుచేశారు. 12 ఏండ్ల తర్వాత రూ.100 కోట్లకు పెంచితేనే అప్పుడు ఆ నాయకులు విమర్శించారని, మరి ఇప్పుడు రెండేండ్లలోనే రూ.350 కోట్లు ఉన్న అంచనాను రీఎస్టిమేషన్ల పేరిట రూ.వెయ్యి కోట్లకు పెంచరాంటే.. ఇది రైతుల కోసం కాదని నాయకుల స్వార్థం కోసమేనని స్పష్టంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల యూరియా కోసం రైతులు గోస పడుతున్నారని అన్నారు. నెల రోజుల్లో ఉప్పుగల్లు రిజర్వాయర్ పనులు పూర్తి చేసి నీళ్లు అందించకపోతే రాజయ్యతో కలిసి పాదయాత్ర చేస్తానని హెచ్చరించారు.

గణేశ్ యాత్రలో కేసీఆర్ పాటల జోష్

- సిరిసిల్లలో పోలీసుల ఆటంకం
- యువకుల వాగ్వాదం

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 7: వినాయక నిమజ్జనోత్సవంలో కేసీఆర్ పాటల జోష్ కనిపించింది. సారే కావాలంటున్నరే, చల్ దేఖ్‌లేంగే, గులాబీల జెండలే రామక్క' పాటలపై యువకులు నృత్యాలు చేశారు. శుక్ర, శని, ఆదివారాల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గణేశ్ నిమజ్జనాలు జరగ్గా, యువతీ యువకులు కేసీఆర్ పాటలపై డాన్సులు చేశారు. సిరిసిల్లకు చెందిన ఓ దివ్యాంగుడు యువకులతో కలిసి 'దేఖ్‌లేంగే' పాటపై చేసిన నృత్యం సోషల్ మీడియాలో వైరల్ అయింది. నిమజ్జనోత్సవ యాత్రలో కేసీఆర్ పాటతో వస్తున్న వారిని సిరిసిల్ల మానేరువాగు వద్ద పోలీసులు పాటను ఆపివేయడంతో వాగ్వావాదం జరిగింది. పోలీసులు అంప్లిఫైర్‌ను తీసుకెళ్లారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కేసీఆర్ పాట వింటేనే ప్రభుత్వం భయపడిపోతున్నదని యువకులు మండిపడ్డారు.

దురాజ్‌పల్లిలో బీఆర్‌ఎస్ నాయకుడి అరెస్టు

- పోలీస్ స్టేషన్ ముట్టడితో విడుదల
- యూరియా కోసం రైతులు బారులు తీరిన వీడియో తీస్తే తప్పా: మాజీ ఎంపీ బడుగుల ఫైర్

చివ్వెంల, సెప్టెంబర్ 7: సూర్యాపేట జిల్లా చివ్వెంల మున్సిపాలిటీ పరిధిలోని దురాజ్‌పల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, ఐదో వార్డు మాజీ కౌన్సిలర్ షేక్ బాషాను హత్యాయత్నం కేసులో శనివారం అర్ధరాత్రి చివ్వెంల ఎస్సై మహేశ్వర్ అరెస్టు చేశారు. సీఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. తనను హత్య చేసేందుకు ప్రయత్నించాడని దురాజ్‌పల్లికి చెందిన షేక్ మునీర్ ఫిర్యాదు మేరకు మాజీ వార్డు కౌన్సిలర్ షేక్ బాషాను పోలీసులు అరెస్ట్ చేశారు. మునీర్ ఎడమ చేయి, ఛాతీ కింది భాగంలో గాయాలైనట్టు మెడికల్ సర్టిఫికెట్ స్వీకరించిన తర్వాత కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. దురాజ్‌పల్లిలో కొన్ని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా బాషా మునీర్ వెంట పరుగెత్తడం కన్పించిందని అన్నారు. ఘటనా స్థలంలో ఎలాంటి మారణాయుధాలు లభించలేదని చెప్పారు. మాజీ కౌన్సిలర్ షేక్ బాషాను అక్రమంగా అరెస్టు చేశారంటూ దురాజ్‌పల్లి వాసులు పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఆందోళన దిగారు. పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, వార్డు ప్రజలు పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్ ను ముట్టడించారు. ప్రజల ఆందోళనతో దిగివచ్చిన పోలీసులు బాషాను విడుదల చేశారు.



బీఆర్‌ఎస్ మాజీ కౌన్సిలర్ బాషా, పార్టీ నేతలతో కలిసి మాజీ ఎంపీ లింగయ్య యాదవ్

యూరియా క్యూలైన్ వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టినందుకు బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ వార్డు కౌన్సిలర్ షేక్ బాషాను అరెస్టు చేశారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆదివారం చివ్వెంల పోలీస్ స్టేషన్ వద్ద బాషాతో కలిసి మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు, పోలీసులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.

తెలంగాణలో పోలీస్ రాజ్యం

- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శలు



సూర్యాపేట, సెప్టెంబర్ 7 (నమస్తేతెలంగాణ) : తెలంగాణలో పోలీసు రాజ్యం నడుస్తున్నదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. మంత్రులకు పాలన చేతకావడం లేదని విమర్శించారు. ప్రజల నుంచి వస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పోలీసులను అడ్డు పెట్టుకొని పాలన సాగిస్తూ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియాపైన అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. సూర్యాపేట జిల్లా దురాజ్‌పల్లికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు షేక్ బాషామియా అక్రమ అరెస్టును ఖండిస్తూ చివ్వెంలలో మీడియాతో మాట్లాడారు. రైతులు యూరియా కోసం క్యూలో నిల్చున్న వీడియో తీసి సోషల్ మీడియాలో పెడితే కేసులేంటని ప్రశ్నించారు.

క్యాన్సర్ పని పట్టే టీకా!

- అభివృద్ధి చేసిన రష్యా పరిశోధకులు
- క్లినికల్ ట్రయల్స్‌లో 100 శాతం సమర్థత.. సురక్షితం
- త్వరలోనే అందుబాటులోకి వ్యాక్సిన్
- లక్షలాది వ్యాధిగ్రస్తులకు శుభవార్త

మాస్కో: ప్రపంచంలోని లక్షలాది మంది క్యాన్సర్ రోగులకు రష్యా శుభవార్త చెప్పింది. కొవిడ్-19 టీకాల్లో విజయవంతంగా ఉపయోగించిన ఎంఆర్ఎన్ఏ (మెసెంజర్ రిబోన్యూక్లియిక్ యాసిడ్) టెక్నాలజీ ఆధారంగా ఎంటెరోమిక్స్ అనే టీకాను అభివృద్ధి చేసింది. ఈ టెక్నాలజీతో తయారైన మొదటి క్యాన్సర్ టీకా ఇదే. క్లినికల్ ట్రయల్స్‌లో ఈ ఎంటెరోమిక్స్ టీకా నూటికి నూరు శాతం సత్ఫలితాలను చూపించింది. పెద్ద కణతులు గల రోగులు ఈ టీకాను తీసుకున్నపుడు, ఆ కణతుల పరిమాణం తగ్గడంతోపాటు, క్యాన్సర్ నాశనమైంది. 'రష్యా టుడే' కథనం ప్రకారం, ఈ టీకాకు ఆరోగ్య మంత్రిత్వ శాఖ అనుమతుల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ అనుమతులు మంజూరైన వెంటనే దీనిని రోగులకు అందుబాటులోకి తీసుకొస్తారు. ప్రతి రోగికి వ్యక్తిగత అవసరాన్ని గుర్తించి అత్యంత కచ్చితత్వంతో క్యాన్సర్ కణాలను తుదముట్టించడమే లక్ష్యంగా ఈ ఎంటెరోమిక్స్ టీకాను అభివృద్ధి చేశారు. ఇది కండరాలలోకి ఇచ్చే ఇంజెక్షన్. రష్యాలోని చాలా ఆంకాలజీ సెంటర్లలో ఇప్పటికే దీనిని క్లినికల్‌గా ఉపయోగించారు. కీమోథెరపీ లేదా రేడియేషన్ విధానాల మాదిరిగా కాకుండా ఈ టీకాను ప్రతి రోగికి వ్యక్తిగత అవసరాన్ని గుర్తించి ఇవ్వవలసి ఉంటుంది. రోగులపై ప్రయోగాత్మకంగా పరీక్షించినపుడు తీవ్రమైన దుష్ఫలితాలు కనిపించలేదు. ఈ టీకాను రష్యాకు చెందిన నేషనల్ మెడికల్ రిసెర్చ్ రేడియలాజికల్ సెంటర్,



ఎంగెల్‌హార్డ్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాలెక్యులార్ బయాలజీ అభివృద్ధి చేశాయి.

ఎలా పని చేస్తుంది?

ఎంటెరోమిక్స్ టీకా రోగి శరీరంలోని ట్యూమర్ మార్కర్స్‌ను గుర్తించడంలో రోగ నిరోధక వ్యవస్థకు శిక్షణ ఇస్తుంది. ఆరోగ్యకరమైన కణాలు, చెడు కణాల మధ్య తేడాను గుర్తించడంలో సహాయపడుతుంది. అనంతరం చెడు కణాలపై దాడి చేసేలా చేస్తుంది. దీనిని రోగులకు ఇచ్చినపుడు, క్యాన్సర్ రకాన్ని బట్టి ట్యూమర్ 60-80 శాతం వరకు తగ్గినట్లు గుర్తించారు. ప్రాణాపాయం నుంచి తప్పించుకునే రేటు కూడా పెరిగినట్లు గమనించారు. ఎంటెరోమిక్స్ టీకా వల్ల రోగులు వారి ట్యూమర్ల ప్రత్యేక జెనెటిక్ ప్రొఫైల్‌కు తగినట్లుగా డిజైన్ చేసిన వ్యాక్సిన్లను తీసుకోవడానికి అవకాశం వస్తుంది. ఈ విధంగా వ్యక్తిగతంగా రోగ నిర్ధారణ చేసి, టీకాలను ఇవ్వడం వల్ల క్యాన్సర్ అనేది ప్రాణాంతక వ్యాధి స్థాయి నుంచి తట్టుకోగల ఆరోగ్య పరిస్థితి స్థాయికి మారుతుంది. ఫలితంగా లక్షలాది మంది రోగుల్లో కొత్త ఆశలు చిగురిస్తాయి.

ఎవరి కోసం?

ఊపిరితిత్తులు, రొమ్ము, కొలెరెక్టల్, పాంక్రియాటిక్ క్యాన్సర్లతో బాధపడేవారు ఈ టీకాను వాడవచ్చు. అదేవిధంగా హెరిడిటరీ క్యాన్సర్ సిండ్రోమ్స్‌తో హై రిస్క్ గల రోగులు, కీమోథెరపీ రెసిస్టెంట్ క్యాన్సర్లు గల వారు ఈ టీకా వల్ల ప్రయోజనం పొందవచ్చు. సంప్రదాయ చికిత్సలను తట్టుకోలేని వారు కూడా ఈ టీకా వైపు చూడవచ్చు.



దేశవ్యాప్తంగా 'సర్'!

- ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ
- ఈ ఏడాది చివరిలోగా చేపట్టే అవకాశం
- సన్నాహాలు చేస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం
- 10న అన్ని రాష్ట్రాల ఎన్నికల అధికారులతో భేటీ



న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికల ముంగిట బీహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై (సర్) వివాదం కొనసాగుతున్న వేళ కేంద్ర ఎన్నికల సంఘం ఈ ప్రక్రియను దేశవ్యాప్తంగా నిర్వహించడానికి సిద్ధమవుతున్నది. దీని నిర్వహణ విషయమై చర్చించడానికి ఈ నెల 10న అన్ని రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారులతో ఈసీ సమావేశం కానుంది. జ్ఞానేశ్ కుమార్ సీఈసీగా బాధ్యతలు చేపట్టాక ఈ తరహా సమీక్ష నిర్వహించడం ఇది మూడోసారి. ఈ ఏడాది చివరి నాటికి ఈ ప్రక్రియను ప్రారంభించవచ్చని అంచనా వేస్తున్నారు. వచ్చే ఏడాదిలో అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. ఆ లోపు ఓటర్ల జాబితాను నవీకరించాలని ఈసీ భావిస్తున్నది. అనర్హుల పేర్లు తొలగించి లోప రహిత, కచ్చితమైన ఓటర్ జాబితాను సిద్ధం చేయడం కోసం 'సర్'ను చేపట్టినట్టు ఈసీ పేర్కొన్నది. ఈ ప్రక్రియలో భాగంగా విదేశీయులు, మరణించినవారు, ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న వారి పేర్లను తొలగించనున్నారు. ఇదే సమయంలో బంగ్లాదేశ్, మయన్మార్ నుంచి వచ్చిన వలసదారులపై చర్యలు తీసుకుంటారు. 'సర్'లో భాగంగా బూత్ స్థాయి అధికారుల ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను ధ్రువీకరిస్తారు.

ఎర్ర సముద్రంలో కేబుల్స్ తెగిపోయి..
భారత్‌లో ఇంటర్నెట్‌కు అంతరాయం

న్యూఢిల్లీ : ఎర్ర సముద్రంలో కేబుల్ కట్స్ వల్ల భారత్, పాక్, యూఏఈ సహా ఆసియా, మధ్య ప్రాచ్య దేశాల్లో ఇంటర్నెట్ సేవలకు ఆదివారం అంతరాయం ఏర్పడింది. ఈ కేబుల్ కట్స్‌కు కారణాలేమిటో వెల్లడి కాలేదు. సౌదీ అరేబియాలోని జెడ్డా సమీపంలో ఉన్న ఎస్ఎండబ్ల్యూ4, ఐఎంఈడబ్ల్యూఈ కేబుల్ సిస్టమ్స్ విఫలమైనట్లు మానిటరింగ్ గ్రూప్ నెట్‌బ్లాక్స్ తెలిపింది. అనేక దేశాల్లో ఇంటర్నెట్ కనెక్టివిటీకి విఘాతం కలిగినట్లు పేర్కొంది. అజ్యూర్ క్లౌడ్ సర్వీస్‌కు కూడా అంతరాయాలు ఏర్పడినట్లు మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. మిడిల్ ఈస్ట్ గుండా వెళ్లే మార్గాల్లోని యూజర్లపై ఈ ప్రభావం పడుతుందని తెలిపింది.

బీడీలపై జీఎస్టీ తగ్గింపు
చావుకు రాయితీ ఇవ్వడమే
ఆరోగ్య నిపుణుల ఆందోళన

న్యూఢిల్లీ: బీడీలపై ఉన్న జీఎస్టీని 28 నుంచి 18 శాతానికి తగ్గించాలన్న కేంద్రం నిర్ణయంపై ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. చౌకైన బీడీల వల్ల వాటి వినియోగం పెరుగుతుందని.. ముఖ్యంగా పేదలు, అణగారిన వర్గాల్లో ఇది పెరిగి దేశ పొగాకు సంబంధిత అనారోగ్య భారాన్ని పెంచుతాయని వారు తెలిపారు. బీడీల వినియోగం పెరగడం క్యాన్సర్లు, ఇతర వ్యాధులకు దారి తీస్తుందని పొగాకు వాడకం నియంత్రణకు కృషి చేస్తున్న డాక్టర్ విశాల్ రావు తెలిపారు. వాటి ధర తగ్గించడమంటే చావుకు రాయితీ ఇవ్వడమేనని అన్నారు. మిగతా పొగాకు ఉత్పత్తులపై 40 శాతం జీఎస్టీని విధించి, బీడీలపై తగ్గించడం సరికాదని.. పొగాకు ఉత్పత్తులపై పన్నుల్లో ఏకరూపతను తీసుకురావాలని ఆయన కోరారు. ఎక్కువ పన్ను పొగాకు వినియోగాన్ని నిరోధించడంలో సాయపడుతుందని ఢిల్లీ ఎయిమ్స్ డాక్టర్ ఉమా కుమార్ తెలిపారు. తక్కువ, మధ్య ఆదాయ దేశాల్లో ధరను పది శాతం పెంచడం వల్ల పొగాకు వినియోగం 4-8 శాతం తగ్గినట్టు అధ్యయనాలు తెలుపుతున్నాయి. పొగాకు సంబంధిత వ్యాధుల కారణంగా భారత్ ఏటా రూ.1.77 లక్షల కోట్లను వైద్య ఖర్చుల రూపంలో కోల్పోతోందని అంచనా.

ముంచుకొస్తున్న మరో యుద్ధం!

- కరేబియన్ సముద్రంలో కమ్ముకున్న యుద్ధ మేఘాలు
- వెనెజులాను ఆక్రమించడానికి అమెరికా ప్రభుత్వం సన్నద్ధం!
- భారీగా యుద్ధ నౌకలు, ఆధునిక ఫైటర్ జెట్లు మోహరింపు
- తగ్గేది లేదని వెనెజులా అధ్యక్షుడు మదురో ప్రకటన



వాషింగ్టన్: ప్రపంచంలో మరో యుద్ధం ముంచుకొస్తున్నది. రెండు దేశాల మధ్య యుద్ధానికి కరేబియన్ సముద్రం వేదికగా మారనుంది. ప్రపంచంలోనే భారీ చమురు నిల్వలున్న దేశంగా ప్రసిద్ధి చెందిన వెనెజులా ఆక్రమణకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెగబడుతున్నారు. ఎన్నో ఏండ్లుగా ఆ దేశంపై కన్నేసిన ట్రంప్ డ్రగ్స్ ముఠాల నెపంతో ఆ దేశాన్ని కబళించడానికి ఉవ్విళ్లూరుతున్నారు. కరేబియన్ సముద్రంలో అగ్రరాజ్యం భారీగా యుద్ధ నౌకలు, హెలికాప్టర్లు, జలాంతర్గములు, అత్యాధునిక ఫైటర్ జెట్‌లను మోహరించింది. ఏక్షణమైనా వెనెజులా దేశంలోకి చొరబడటానికి ఇవి సిద్ధంగా ఉన్నాయి. వీటితోపాటు 4,500 మంది సైనికులు, 2,300 మంది మెరైన్లు కూడా సిద్ధంగా ఉన్నారు. వెనెజులాకు కొద్ది దూరంలోనే ఉన్న ఈ ప్రాంతంలో అమెరికా దళాలు సైనిక విన్యాసాలు చేస్తూ కవ్వింపు చర్యలు ప్రారంభించాయి.

కారణమేంటంటే..

వెనెజులా డ్రగ్స్ ముఠాల నుంచి తమ దేశాన్ని మాదకద్రవ్యాలు ముంచెత్తుతున్నాయంటూ ట్రంప్ ఆరోపిస్తూ వస్తున్నారు. ఈ ముఠాలతో వెనెజులా అధ్యక్షుడు నికోలస్ మదురోకు సంబంధాలు ఉన్నాయని కూడా ఆయన విమర్శించారు. ఆయనను పట్టించే సమాచారం ఇస్తే ఏకంగా రూ.430 కోట్ల బహుమతి ఇస్తామంటూ కూడా ప్రకటించారు.

తగిన సమాధానం ఇస్తాం

అమెరికా యుద్ధ దుందుడుకు చర్యలను వెనెజులా అధ్యక్షుడు నికోలస్ మదురో తప్పుబట్టారు. తమపై యుద్ధానికి దిగితే తాము కూడా సైనిక దాడితో సమాధానం ఇస్తామని హెచ్చరించారు. ట్రంప్ గౌరవం దెబ్బతినేలా ఆయన కార్యదర్శి, విదేశాంగ మంత్రి మార్కో రుబియో కరేబియన్ యుద్ధంలోకి ఆయనను లాగుతున్నారని ఆరోపించారు. 'మిస్టర్ ప్రెసిడెంట్ ట్రంప్.. జాగ్రత్తగా ఉండండి.. రుబియో మీ చేతులను రక్తంతో తడపాలనుకుంటున్నారు' అని ఏడాది తర్వాత తొలిసారిగా కార్కస్‌లో జరిగిన అరుదైన మీడియా సమావేశంలో పేర్కొన్నారు. వెనెజులా పౌరులు పోరాట యోధులని, ఎలాంటి దాడినైనా ఎదుర్కొంటారని ఆయన అన్నారు.


చమురు నిల్వలపై కన్నేసి...

2021 నాటికి వెనెజులా దేశంలో 48 వేల మిలియన్ టన్నుల చమురును గుర్తించారు. ప్రపంచ చమురులో 17 శాతానికి సమానం. వెనెజులాను ఆక్రమించుకోవాలన్న ఆశ ట్రంప్‌కు ఎప్పటి నుంచో ఉంది. 2017లోనే ఆయన వెనెజులాపై మనం యుద్ధం ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. 2023లో సైతం వెనెజులా కుప్పకూలడానికి సిద్ధంగా ఉందని ప్రకటించారు. 'మేము దానిని ఆక్రమించుకునే వాళ్లం. దాని చమురు మొత్తాన్ని తీసుకునే వాళ్లం' అని అన్నారు.

వెనెజులా సైనిక బలగం అంతంతే..!

రెండు దేశాల మధ్య యుద్ధం వస్తే అగ్రరాజ్యం ముందు నిలబడే పరిస్థితి వెనెజులాకు లేదు. ఎందుకంటే ఆ దేశానికి చిన్న సైన్యం, తక్కువ ఆయుధ సంపత్తి మాత్రమే ఉంది. 1,23,00 మంది సైనికులు, 2,30,00 మంది పౌర సైనికులు, సుఖోయ్-30, 1980ల నాటి ఎఫ్-16 ఇరాన్ డ్రోన్లు ఉన్నాయి. మొత్తం 229 యుద్ధ విమానాలు ఉన్నాయి. అమెరికాకు 13 వేల విమానాలు ఉన్నాయి.

నువ్వా.. నేనా?



- ఉపరాష్ట్రపతి ఎన్నికలో రసవత్తర పోరు
- ఆధిక్యంలో ఎన్డీయే అభ్యర్థి
- క్రాస్ ఓటింగ్‌పై 'ఇండియా' ఆశలు
- రేపే ఎన్నికలు.. ఫలితాల ప్రకటన

న్యూఢిల్లీ: మంగళవారం జరగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నికలకు సన్నాహాలు తుది దశకు చేరుకున్నాయి. అధికార ఎన్డీయే, ప్రతిపక్ష కూటముల మధ్య తీవ్రమైన పోరు నడుస్తోంది. అయితే, బీజేడీ, బీఆర్ఎస్ సహా మొత్తం 18 మంది ఎంపీలు ఎవరికి ఓటు వేస్తారన్న విషయంలో స్పష్టత లేదు. ప్రస్తుత గణాంకాల ప్రకారం చూస్తే ఎన్డీయే అభ్యర్థి, మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్.. ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీ సుదర్శన్‌రెడ్డిపై 439-324 ఓట్ల తేడాతో స్పష్టమైన ఆధిక్యంలో ఉన్నారు. ఇది అన్ని పార్టీల ఎంపీలు తమ పార్టీల విధానాలకు అనుగుణంగా ఓటు వేస్తే, ఇంకా నిర్ణయం తీసుకోని వారి ఓట్లు ఎవరికి వెళ్తాయో పరిగణనలోకి తీసుకోకుండా లెక్కిస్తే వచ్చిన లెక్క. బీజేడీ నుంచి ఏడుగురు, బీఆర్ఎస్ నుంచి నలుగురు, అకాలీదళ్, జడ్‌పీఎం, వీవోటీటీపీ నుంచి ఒక్కొక్కరు, అలాగే ముగ్గురు స్వతంత్ర ఎంపీలు ఇప్పటికీ తమ మద్దతు ఎవరికి అనేది స్పష్టంగా వెల్లడించలేదు. ఓటర్ల సంఖ్య ప్రస్తుతం 781గా ఉంది, ఇందులో శిబు సొరెన్ మరణంతో సహా ఏడు ఖాళీలు ఉన్నాయి. బీజేడీకి చెందిన సస్మిత్ పాత్ర, బీఆర్ఎస్‌కు చెందిన కే సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ సరైన సమయంలో పార్టీ నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. అయితే, జేపీఎం, వీవోటీటీపీ ఎంపీలు మాత్రం ఇప్పటి వరకు స్పందించలేదు.

జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఆప్ మద్దతు

ఇండియా కూటమి నుంచి బయటకు వచ్చిన ఆప్ తమ 10 మంది ఎంపీల మద్దతును జస్టిస్ రెడ్డికి ప్రకటించింది. 11 మంది సభ్యుల వైసీపీ రాధాకృష్ణకు మద్దతు ప్రకటించింది. ఇది రహస్య ఓటింగ్ కాబట్టి, ఇరు పక్షాలు క్రాస్ ఓటింగ్‌పై ఆశలు పెట్టుకున్నాయి. ఈ ఎన్నికలను రాజ్యాంగం వర్సెస్ ఆరెస్సెస్-బీజేపీ పోరుగా అభివర్ణిస్తున్న ఇండియా కూటమి జస్టిస్ సుదర్శన్ రెడ్డి తెలుగు వ్యక్తి అని చెప్తూనే ఇతర రాజకీయ కారణాలను ప్రస్తావిస్తూ టీడీపీ, వైసీపీ, జనసేన ఎంపీలను లక్ష్యంగా చేసుకుని ఓట్లు అభ్యర్థిస్తున్నది. కాంగ్రెస్ లోక్‌సభ విప్ మాణికం ఠాగూర్ ఆదివారం వైసీపీ లోక్‌సభ ఫ్లోర్ లీడర్ మిథున్‌రెడ్డిని ఉద్దేశించి మాట్లాడుతూ.. మిమ్మల్ని జైలుకు పంపిన టీడీపీ, బీజేపీ అభ్యర్థికి ఓటేస్తారా? లేక రాజ్యాంగాన్ని కాపాడేందుకు పోరాడుతున్న జస్టిస్ రెడ్డికి ఓటేస్తారా? అని ప్రశ్నించారు. ఫలితం ఎలా ఉన్నా, ఈ పోరులో విజయం సాధించాలని ఇండియా కూటమి పట్టుదలగా ఉంది. క్రాస్ ఓటింగ్ జరిగి తమకు విజయం లభిస్తుందని ధీమాగా ఉంది. జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి 324 ఓట్లు వచ్చి ఓడిపోయినా.. ఓడిన అభ్యర్థికి లభించిన అత్యధిక ఓట్లు ఇవే అవుతాయి. 2002లో సుశీల్ కుమార్ షిండేకు 305 ఓట్లు లభించాయి. అప్పుడు గెలుపొందిన భైరాన్‌సింగ్ షెకావత్‌కు 454 ఓట్లు వచ్చాయి. ఇది ఇప్పటివరకు జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో అత్యంత గట్టి పోటీ.

మాక్ పోలింగ్‌లో అధికార, విపక్షాలు

ఈసారి ఎన్డీయే అభ్యర్థికి 500 ఓట్లు దాటే అవకాశం లేదు. 2022 ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు తమ ఓట్లు వేయకపోవడంతో జగదీప్ ధన్‌ఖడ్‌కు 528 ఓట్లు వచ్చాయి. ఆయన కంటే ముందు ఉపరాష్ట్రపతిగా ఉన్న ఎం వెంకయ్యనాయుడు 516 ఓట్లు పొందారు. బీజేపీ ఇప్పటికే తన ఎంపీలకు ప్రాధాన్యత ఓటింగ్ విధానంలో ఎలా ఓటు వేయాలో శిక్షణ మొదలుపెట్టింది. అటు, ప్రతిపక్షం సోమవారం సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో మాక్ పోల్ నిర్వహిస్తున్నది. దీని తరువాత, పార్లమెంట్ అనెక్స్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విందు ఇవ్వనున్నారు. ఓటర్లు తమ ప్రాధాన్యతలను గుర్తించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక పెన్నులను సరఫరా చేస్తుంది. ఓటర్లు తమ బ్యాలెట్ పేపర్‌ను ఈ ప్రత్యేక పెన్నుతో మాత్రమే గుర్తించాలి, వేరే ఏ సాధనాన్ని ఉపయోగించినా చెల్లని ఓటుగా పరిగణిస్తారు.

ఉక్రెయిన్‌పై 800 డ్రోన్లతో
విరుచుకుపడ్డ రష్యా
రష్యా చమురు పైపులైన్ ధ్వంసం చేసిన ఉక్రెయిన్

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా విరుచుకుపడింది. 800 డ్రోన్లు, 13 క్షిపణులతో సెంట్రల్ కీవ్‌లో మంత్రులు నివసించే క్యాబినెట్ భవనంతోపాటు పలు నగరాలు, పట్టణాలపై వైమానిక దాడికి దిగింది. తొలుత రష్యా వాయుసేన సెంట్రల్ కీవ్‌లో మంత్రులు నివసించే భవనం లక్ష్యంగా దాడులు జరిపింది. ఈ దాడిలో ఏడాది చిన్నారి సహ ముగ్గురు మరణించారు. దీనికి ప్రతీకారంగా ఉక్రెయిన్.. రష్యాలో బ్రియాన్స్క్‌లోని డ్రుజ్బా చమురు పైపులైన్‌పై దాడి చేసింది. రెండు దేశాలు కూడా ప్రభుత్వ మౌలిక సదుపాయాలు లక్ష్యంగా దాడులు జరుపుకున్నాయి. ఈ దాడిలో ఇతర ఉక్రెయిన్ నగరాలను కూడా రష్యా లక్ష్యంగా చేసుకుంది. క్రెమెన్‌చుక్‌లో డజన్ల కొద్దీ విద్యుత్ సౌకర్యాలు రష్యా దాడితో దెబ్బతిన్నాయి. అలాగే అధ్యక్షుడు జెలెన్‌స్కీ సొంత నగరమైన క్రివీరిహ్‌లో కూడా క్షిపణులు రవాణా, మౌలిక సదుపాయాలపై దాడులు జరిపాయి. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి రష్యా జరిపిన అతిపెద్ద గగనతల దాడుల్లో ఇదొకటి.

జపాన్ ప్రధాని రాజీనామా

- పదవి నుంచి వైదొలిగిన షిగెరు ఇషిబా
- ఎన్నికల్లో పార్టీ వరుస పరాజయాలు
- ఓటమికి బాధ్యత వహించాలంటూ పార్టీ నేతల నుంచి ఒత్తిడితో నిర్ణయం



టోక్యో: జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా ఆదివారం పదవి నుంచి వైదొలిగారు. ఎన్నికల్లో వరుస పరాజయాలు, మెజార్టీని నిలబెట్టుకోవడంలో విఫలమైన క్రమంలో పార్టీ నేతల నుంచి వచ్చిన ఒత్తిడి మేరకు ఆయన పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాతో వారసుడు ఎవరన్న దానిపై అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీలో తీవ్ర చర్చ జరుగుతున్నది. 'లిబరల్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నాను. అధ్యక్ష ఎన్నికకు సంబంధించిన ప్రక్రియను చేపట్టాల్సిందిగా సెక్రటరీ జనరల్ మోరియామాను కోరాను' అని ఇషిబా తెలిపారు. 68 ఏండ్ల ఇషిబా గత ఏడాది అక్టోబర్‌లోనే ప్రధాని పదవిని చేపట్టారు. ఎన్నికల్లో పార్టీ వరుస పరాజయాలతో ఆయన నాయకత్వంపై అసంతృప్తి పెరిగింది. రాజీనామా డిమాండ్లు పెరగడం, అవిశ్వాస తీర్మానం తేవాలన్న ప్రతిపాదన కూడా రావడంతో ఆయన తన పదవికి రాజీనామా చేశారు.

ఏఐతో అణు ముప్పు!
ఏఐ గాడ్ ఫాదర్ జెఫ్రీ హింటన్ హెచ్చరిక

వాషింగ్టన్: కృత్రిమ మేధ పితామహుడు జెఫ్రీ హింటన్ సంచలన హెచ్చరిక చేశారు. మానవాళికి ఏఐ ముప్పుగా పరిణమించే ప్రమాదం ఉందన్నారు. సామాన్యుడు సైతం ఏఐని ఉపయోగించుకుని అణు బాంబును తయారు చేయవచ్చునని చెప్పారు. ఓ సాధారణ వ్యక్తి త్వరలో ఏఐ సహాయంతో జీవాయుధాలను తయారు చేయగలుగుతాడని, అది చాలా భయంకరమని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి చెందడం వల్ల కంపెనీలు మునుపెన్నడూ లేనంత లాభాలను ఆర్జిస్తాయని, ఉద్యోగులు తమ ఉద్యోగాలను కోల్పోతారని జెఫ్రీ హింటన్ హెచ్చరించారు. నిరుద్యోగం విపత్కర స్థాయికి పెరుగుతుందన్నారు. సంపన్నులు తమ పనులు చేయించుకోవడం కోసం ఉద్యోగులు, కార్మికులకు బదులుగా ఏఐని వాడుకుంటారని చెప్పారు. మెటా చీఫ్ ఏఐ సైంటిస్ట్ యాన్ లెకున్ అభిప్రాయం వేరొకలా ఉంది. లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ పరిమితంగా ఉన్నాయని, భౌతిక ప్రపంచంతో అర్థవంతంగా వ్యవహరించజాలవని తెలిపారు.

భారత్‌పై మరోసారి సుంకాలు!
అమెరికా తాజా బెదిరింపులు

వాషింగ్టన్, సెప్టెంబర్ 7: ఒక పక్క ఇరు దేశాల మధ్య క్షీణిస్తున్న వాణిజ్య సంబంధాల మెరుగుకు ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ భారత్‌పై మరోసారి టారిఫ్‌లు విధిస్తామని ట్రంప్ యంత్రాంగం బెదిరింపులకు పాల్పడుతున్నది. యుద్ధం ఆపి, ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు వచ్చేలా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై ఒత్తిడి తెచ్చే వ్యూహంలో భాగంగా, ఆ దేశం నుంచి చమురును దిగుమతి చేసుకుంటున్న దేశాలపై మరోసారి సుంకాలతో పాటు ఆంక్షలను విధించాలని వాషింగ్టన్, దాని యూరోపియన్ మిత్ర దేశాలు యోచిస్తున్నట్టు యూఎస్ ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బీసెంట్ ఆదివారం తెలిపారు. అమెరికా, యూరోపియన్ యూనియన్లు జోక్యం చేసుకుని రష్యన్ చమురు కొనుగోలు చేసే దేశాలపై ఆంక్షలు, టారిఫ్‌లు విధించగలిగితే రష్యన్ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోవడమే కాక, అది రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను చర్చలకు తీసుకువస్తుందని ఆయన అన్నారు. ఈ విషయంలో యూరోపియన్ భాగస్వాముల సమన్వయం ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు.

దమ్ముంటే అమెరికాపై
70% సుంకాలు విధించండి
ప్రధాని మోదీకి కేజ్రీవాల్ సవాల్

న్యూఢిల్లీ: ప్రధాని మోదీకి దమ్ముంటే అమెరికాపై 70శాతం సుంకాలు విధించాలని ఆప్ అధినేత కేజ్రీవాల్ సవాల్ విసిరారు. భారత్‌పై అమెరికా పెద్ద మొత్తంలో టారిఫ్‌లు విధిస్తుంటే, దీనిని మోదీ సర్కార్ సరిగా ఎదుర్కోవటం లేదని కేజ్రీవాల్ విమర్శించారు. భారత దిగుమతులపై అమెరికా 50 శాతం టారిఫ్‌లను విధిస్తే, అమెరికాపై భారత్ 75 శాతం టారిఫ్‌లను విధించాలని, ఈ విషయంలో ప్రధాని మోదీ కాస్త దమ్ము, ధైర్యం ప్రదర్శించాలని కేజ్రీవాల్ సూచించారు.

కోల్‌కతాలో యువతిపై గ్యాంగ్ రేప్
పుట్టినరోజు నాడే దారుణం

కోల్‌కతా: 20 ఏండ్ల యువతిపై ఇద్దరు పరిచయస్థులు ఆమె పుట్టినరోజు నాడు కోల్‌కతాలోని సంపన్న వర్గాలుండే రీజెంట్ పార్క్ ప్రాంతంలో సామూహిక అత్యాచారానికి పాల్పడినట్టు పోలీసులు ఆదివారం తెలిపారు. ఘటన తర్వాత ఇద్దరు నిందితులు పరారయ్యారు. నిందితులను చందన్ మాలిక్, దీప్‌గా గుర్తించారు. దీప్ ప్రభుత్వ ఉద్యోగి అని పోలీసులు తెలిపారు. బాధితురాలి పుట్టినరోజు వేడుకను జరపడానికి శుక్రవారం చందన్ ఆమెను దీప్ ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ వారు భోజనం చేశాక ఆమె ఇంటికి తిరిగి వెళతానని కోరినప్పుడు నిందితులు ఆమెను ఆపి తలుపుకు తాళం వేసి ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు.

జైల్లో లైబ్రరీ క్లర్క్‌గా ప్రజ్వల్ రేవణ్ణ
రోజుకు రూ.522 వేతనం

బెంగళూరు: లైంగికదాడి కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు పరప్పన అగ్రహార జైలు అధికారులు లైబ్రరీ క్లర్క్‌గా పని కేటాయించారు. ఇందుకుగాను అతడికి రోజుకు రూ.522 వేతనంగా అందజేస్తున్నట్టు తెలిసింది. ఈ బాధ్యతల్ని అతడు కనీసం 12 రోజులపాటు నిర్వర్తించాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం, జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు జైల్లో ఏదో ఒక పని చేయాలి. వారి సామర్థ్యాలు, నైపుణ్యాలను పరిగణనలోకి తీసుకొని ఖైదీలకు పని అప్పగిస్తారు. పరిపాలనా పరమైన పనులను చేయడానికి రేవణ్ణ ఆసక్తి చూపారు.

సెయింట్‌గా 15 ఏళ్ల బాలుడు

వాటికన్ సిటీ: 'గాడ్స్ ఇన్‌ఫ్లుయెన్సర్'గా ప్రసిద్ధి పొందిన 15 ఏళ్ల బాలుడు కార్లో అక్యూటిస్.. సెయింట్ హోదా పొందారు. ఈ హోదా పొందిన తొలి మిలీనియల్‌గా ఆయన ఘనత సాధించారు. 2006 అక్టోబరులో ఆయన లుకేమియాతో బాధపడుతూ మరణించాడు. పోప్ లియో ఆదివారం సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో జరిగిన కార్యక్రమంలో కార్లోను సెయింట్‌గా ప్రకటించారు. ఓ వ్యక్తి పవిత్ర జీవితాన్ని గడిపి, ప్రస్తుతం స్వర్గంలో దేవుని వద్ద ఉన్నట్లు చర్చి విశ్వసిస్తే, ఆ వ్యక్తికి సెయింట్‌హుడ్‌ను ప్రకటిస్తుంది. కార్లో కంప్యూటర్ జీనియస్. తక్కువ వయసులోనే కళాశాల స్థాయి ప్రోగ్రామింగ్ పుస్తకాలను చదివేశాడు.

నీవి నాలుగే.. నావి 40 ఎకరాలు!

- పంట నష్టం గురించి చెప్పకోవడానికి వచ్చిన రైతుపై ఖర్గే చిందులు
- తనకే ఎక్కువ నష్టం జరిగిందని మందలింపు



బెంగళూరు, సెప్టెంబర్ 7: వర్షాలకు పంట నీట మునిగి నష్టపోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరడానికి వచ్చిన ఒక రైతుకు ఉపశమనం లభించకపోగా.. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేతిలో చీవాట్లు తిన్నాడు. దీనికి సంబంధించిన వీడియో క్లిప్ ఇప్పుడు వైరల్ అవుతున్నది. కలబురిగిలోని ఖర్గే ఇంటికి ఒక రైతు వచ్చి ఇటీవలి వర్షాలకు తాను వేసిన నాలుగు ఎకరాల్లోని పంట దెబ్బతిందని విన్నవించుకున్నాడు. దీంతో 'నీవి నాలుగు ఎకరాలే పోయాయి. నావి అంతకన్నా ఎక్కువగా 40 ఎకరాలు పోయాయి. ఇది ఎలా ఉందంటే ముగ్గురు పిల్లలున్న వ్యక్తి ఆరుగురు సంతానం ఉన్న వ్యక్తి వద్దకు వచ్చి కష్టాలు చెప్పుకున్నట్టు ఉంది' అంటూ ఆ వ్యక్తిని మందలించాడు. పైగా 'ఊరికే ప్రచారం కోసం ఇక్కడకు రావొద్దు. దీని గురించి నాకంతా తెలుసు. ఈ ఏడాది పంటల నష్టం గురించి నాకు అవగాహన ఉంది' అంటూ అవమానించాడు. అంతేకాకుండా మీకు తక్కువ నష్టం కాబట్టి తట్టుకోగలరు. పెద్దమొత్తంలో నష్టపోయిన మాలాంటి వారికి ఇది చాలా కష్టం అని ఖర్గే పేర్కొన్నారు. కాగా, పంట నష్టం గురించి చెప్పుకోవడానికి వచ్చిన రైతు పట్ల ఖర్గే దురుసుగా వ్యవహరించిన తీరుపై విపక్షాలు, ప్రజలు తీవ్రంగా తప్పుపడుతున్నారు.



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ఆదివారం రాత్రి సంపూర్ణ చంద్ర గ్రహణం కనిపించింది. అత్యంత అరుదైన ఈ ఖగోళ అద్భుతాన్ని విద్యార్థులు, శాస్త్రవేత్తలు ఆసక్తిగా పరిశీలించారు. సూర్యుడు, చంద్రుడు మధ్య నుంచి భూమి పయనించడం వల్ల సూర్య కాంతి చంద్రునిపై పడదు. ఫలితంగా చంద్ర గ్రహణం ఏర్పడుతుంది. సూర్య కిరణాలు పరావర్తనం చెందడంతో చంద్రుడు రాగి ఎరుపు రంగులో (బ్లడ్‌మూన్) కనిపించాడు. చంద్ర గ్రహణం ఆదివారం రాత్రి 9.57 గంటలకు ప్రారంభమైంది. సంపూర్ణ గ్రహణం రాత్రి 11.01 గంటల నుంచి మొదలైంది. భూమి నీడలో చంద్రుడు దాదాపు 82 నిమిషాలు ఉన్నాడు. ఈ ఖగోళ అద్భుతాన్ని వీక్షించేందుకు పరిశీలకులకు తగినంత సమయం లభించింది. హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా నగరాల్లో విద్యార్థులు ఆసక్తిగా ఈ గ్రహణాన్ని వీక్షించారు.



హెయిర్ స్టైల్‌తో వాయుకాలుష్యం!

న్యూఢిల్లీ: మీ హెయిర్ స్టైల్ వాయు కాలుష్యానికి కారణమవుతుందన్న సంగతి తెలుసా! సాధారణ హెయిర్ కేర్ ఉత్పత్తులు, జుట్టును ఆరబెట్టే, చిక్కుముళ్లు విప్పే వివిధ సాధనాలు వాడుతూ రోజూ జరిపే 'హెయిర్ స్టయిలింగ్' నుంచి నానో పార్టికల్స్(అత్యంత సూక్ష్మ కణాలు) గాలిలోకి విడుదలవుతాయని తాజా అధ్యయనం ఒకటి తేల్చింది. 10-20 నిమిషాలపాటు చేసే హెయిర్ స్టయిలింగ్.. రద్దీతో కూడిన ట్రాఫిక్ నుంచి వెలువడే వాయు కాలుష్యంతో సమానమని 'పర్డ్యూ వర్సిటీ' (అమెరికా) పరిశోధకులు చెబుతున్నారు. సూక్ష్మ కణాలు ఊపిరితిత్తుల్లోకి చొచ్చుకుపోయి ఆరోగ్య సమస్యలను పెంచుతాయని 'ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ టెక్నాలజీ' జర్నల్ కథనం పేర్కొన్నది.



గుండె వేగాన్ని కొలిచే వైఫై సిగ్నల్స్

కాలిఫోర్నియా: వైఫై సిగ్నల్స్‌తో గుండె వేగాన్ని కచ్చితంగా లెక్కగట్టే సరికొత్త టెక్నాలజీని అమెరికాలోని కాలిఫోర్నియా వర్సిటీ ఇంజనీర్లు తయారుచేశారు. వీరు అభివృద్ధి చేసిన 'పల్స్-ఫై'అనే పరికరం.. 10అడుగుల దూరంలో ఉన్న వ్యక్తి గుండె వేగాన్ని అత్యంత కచ్చితంగా కొలుస్తున్నట్టు ప్రయోగాల్లో తేలింది. సాధారణ వైఫై ట్రాన్స్‌మిటర్, రిసీవర్‌లను మెడికల్ సాధనాలుగా మలుచుకొని 'పల్స్-ఫై' అనే వ్యవస్థను ఇంజనీర్లు రూపొందించారు. దీంట్లో స్మార్ట్‌వాచ్, ఛాతికి అతికించే పట్టీలు, దవాఖాన మానిటర్లతో అవసరం లేదు. ఇండ్లు, పని ప్రదేశాల్లో ప్రస్తుతం మనం వాడుతున్న వైఫై హార్డ్‌వేర్, ఇతర పరికరాలతోనే 'పల్స్-ఫై'ని తయారుచేసుకోవచ్చు.

బీహార్‌లో ఓటమి భయంతో జీఎస్టీ తగ్గింపు

సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నమస్తే తెలంగాణ): బీహార్ ఎన్నికల్లో ఓటమి భయంతోనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జీఎస్టీ శ్లాబులు తగ్గించిందని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ ఆరోపించారు. ఆదివారం సీపీఐ పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. బీహార్‌లో బీజేపీకి వ్యతిరేక పవనాలు వీస్తుండడంతోనే దిద్దుబాటు చర్యలు చేపట్టిందని విమర్శించారు. ఇందులో భాగమే జీఎస్టీ తగ్గింపు నాటకమని పేర్కొన్నారు.

టెట్‌పై సుప్రీం తీర్పును సమీక్షించాలి: యూటీఎఫ్

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నమస్తే తెలంగాణ): ఐదేండ్ల పైబడి సర్వీసున్న ఇన్ సర్వీస్ టీచర్లందరూ రెండేండ్లలో టెట్ ఉత్తీర్ణులు కావాలని, లేదంటే ఉద్యోగాన్ని వదులుకోవాలని ఆదేశిస్తూ.. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని యూటీఎఫ్ డిమాండ్ చేసింది. సర్వీసులో ఉన్న సీనియర్ టీచర్ల ప్రయోజనాల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి, ప్రధాన కార్యదర్శి వెంకట్ కోరారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయ నియామకానికి టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి చేస్తూ 2010లో ఎన్‌సీటీఈ నోటిఫికేషన్ విడుదల చేసింది. అప్పటి నుంచి నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత నుంచి మినహాయింపు ఇచ్చిందని పేర్కొన్నారు. ప్రస్తుతం పదోన్నతి పొందాలంటే టెట్ అవసరమా? లేదా అనే వివాదంపై వివిధ కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయని తెలిపారు.

బాలికపై ఇద్దరు యువకుల లైంగికదాడి!

యాచారం, సెప్టెంబర్ 7 : రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నందివనపర్తిలో గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఓ బాలికపై లైంగికదాడికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని 15 ఏండ్ల బాలికను నందివనపర్తికి చెందిన గడల క్రాంతికుమార్, బాషమోని క్రాంతికుమార్ శనివారం రాత్రి వినాయక నిమజ్జన కార్యక్రమంలో ఉన్న బాలికను 'మీ అమ్మకు యాక్సిడెంట్ జరిగింది' అని చెప్పి బైక్‌పై ఎక్కించుకుని నందివనపర్తి నుంచి తాటిపర్తికి వెళ్లే దారిలో ఓ గెస్ట్‌హౌస్‌కు తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక తనవద్ద ఉన్న మొబైల్ ఫోన్‌తో 100 నంబర్‌కు కాల్ చేయగా సీఐ నందీశ్వర్‌రెడ్డి, ఎస్ఐ మధు చేరుకుని బాధితురాలిని చికిత్స కోసం వనస్థలిపురం ఏరియా దవాఖానకు తరలించారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేట్ దవాఖానలో యువతిపై లైంగికదాడి!

కరీంనగర్ విద్యానగర్, సెప్టెంబర్ 7: జగిత్యాలకు చెందిన ఓ యువతి జ్వరంతో బాధపడుతుండగా కుటుంబసభ్యులు ఈ నెల 6న కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో అడ్మిట్ చేశారు. ఆ యువతికి శనివారం రాత్రి దవాఖానలో పని చేస్తున్న కాంపౌండర్ మత్తు ఇంజెక్షన్ ఇచ్చి లైంగికదాడికి పాల్పడినట్టు యువతి తండ్రి త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. బాధితురాలిని వైద్య పరీక్షలకు స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. త్రీటౌన్ సీఐ జాన్‌రెడ్డి మాట్లాడుతూ, యువతిపై లైంగికదాడి జరిగినట్టు ఫిర్యాదు అందిందని, కేసు దర్యాప్తు అనంతరం వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం.

భక్తియోగమే తరింపజేస్తుంది

అనన్యేనైవ యోగేన మాం ధ్యాయంత ఉపాసతే।
తేషామహం సముద్ధర్తా మృత్యు సంసార సాగరాత్॥
(భగవద్గీత– 12–6/7)

'ఎవరైతే ఏకాగ్ర మనస్కులై, అనన్య భక్తితో నన్నే ధ్యానిస్తూ ఆరాధిస్తారో.. వారిని సంసార సాగరం నుంచి ఉద్ధరిస్తాను' అని అంటున్నాడు కృష్ణ పరమాత్మ. 'నన్ను ధ్యానించు.. ఆరాధించమ'ని చెప్పడం ద్వారా. భగవద్ధ్యానాన్ని యోగంగా భావిస్తూ పూర్తి భక్తి భావనతో.. స్థిర చిత్తంతో, సంశయానికీ, భయానికీ అతీతంగా ఆరాధించిన వారు.. ఏ స్థానం నుంచి భూమిపైకి వచ్చారో.. ఆ స్థానాన్ని తిరిగి పొందుతారని భావించాలి. భగవంతుడిని ఆశ్రయిస్తే.. సకల బాధలూ తొలగిపోతాయి. భగవంతుని నిరాకార రూపాన్ని



అర్చించడం కన్నా సాకార రూపాన్ని ఆరాధించడం వల్ల ఉపయోగం ఎక్కువగా ఉంటుంది. చేసే పనినే భగవదర్చనగా భావిస్తూ పూర్తి విశ్వాసంతో, ఏకాగ్ర మనస్కులై, ఫలితానికి అతుక్కుపోకుండా, సేవాభావనతో పనిచేసే వారికి ఫలితం అందుతుంది. సేవాభావన అంటే అందుకునే ప్రతిఫలానికి సరిపోయేంతగా పనిచేయడం కాకుండా.. ఎక్కువ సేవలను అందించడం. అదే సమర్పణా భావన. ఎక్కువగా సమర్పించడం అంటే ఎక్కువగా పొందడమే.

అయితే, మనలను ఇతరులతో పంచుకోవడంలో నిరోధిస్తున్నది ఏమిటి? ఎందుకని మనం ఇతరులపై ఆధిపత్యాన్ని చాటేందుకు ఇష్టపడుతున్నాం? మనలోని శాంతిని గుర్తించలేక బాహ్యంగా శాంతిని ఎందుకు వెతుక్కుంటున్నాం? స్థూలంగా ఎన్ని చెప్పుకొన్నా వీటన్నింటికి మూలకారణం భయం.. ఆకలి. వాటినుంచి విముక్తిని ప్రసాదించేది.. యోగమే. నిజానికి యోగం అంటే భగవంతునితో అనుసంధానం కావడం. దానికి మార్గం భౌతిక జీవితంలోని వాసనల నుంచి విముక్తిని పొందడమే! భయాన్ని, ఆకలిని జయిస్తే.. అంటే అవగాహన చేసుకుంటే.. కలిగేది శాంతి. అదే అనంతమైన ఆనందం. దాన్ని సాధించిన వ్యక్తి కర్మలను ఆచరించినా దానికి అతుక్కుపోడు, కర్మ ఫలాన్ని పొందడు.

గీత ఎప్పుడూ 'పనిచేయు ఫలితం ఆశించకు' అని చెప్పదు. సూర్యోదయంలో సూర్య కిరణాల నుంచి తప్పుకోవడం ఎలాగైతే అసాధ్యమో అలాగే కర్మ చేయడం నుంచి తప్పుకోవడమూ అసాధ్యమే! కాబట్టి చేసే పనిని సంపూర్ణమైన స్పృహతో చేయమంటుంది. విలువైన వనరులను, సమయాన్ని, శక్తిసామర్థ్యాలను వెచ్చించి చేసే పనిని ఎందుకు చేస్తున్నామో తెలియకుండా చేయడం నిరర్థకము. అప్పుడేది ఉత్తమమైన పని? ఒకపని ఉత్తమమైనదని మరొకటి కాదని భావించలేం. అది ఎవరికి వారే.. వారి బలాబలాలను, శక్తియుక్తులను, నైపుణ్యాలను తెలుసుకొని నిర్ణయించుకోవలసిన అంశమే కాని, అందరూ చేస్తున్నారు కాబట్టి ఉత్తమమైనదని భావించలేం. సంపూర్ణ స్పృహతో, ఇష్టపడి ఎన్నుకున్న పనిని ఉపాసనా భావనతో అనుష్ఠించే వ్యక్తి ఆ పనిని ప్రేమిస్తాడు. అతనికి ఆ పనే ప్రేరణ నిస్తుంది. ఆ పనినే ప్రతిఫలంగా భావిస్తాడు. దానితో వచ్చే ఫలితాన్ని ప్రసాదంగా, ఆరాధనా భావనతో స్వీకరిస్తాడు.

మనిషి మనసు సకారాత్మకంగానూ, నకారాత్మకంగానూ ప్రవర్తిస్తుంది. నకారాత్మకమైన మనసు వినాశానికి దారితీస్తుంది. సకారాత్మక మనసు.. సమున్నత ఆవిష్కరణలను సాకారం చేస్తుంది. సంఘర్షణలలోనూ సామరస్యతను సాధిస్తుంది. స్థిర నిశ్చయాన్ని, తపనను, లక్ష్యాన్నీ అనుగ్రహించేదీ మనసే. మానవ హననానికి దోహదపడేదీ మనసే. కోరికలకు నిలయమైన మనసు.. కోరికలను త్యజించిన మనసు.. రెండూ మనిషిలో సహజీవనం చేస్తుంటాయి. దేనిని ఆదరిస్తామో తదనుగుణమైన ఫలితాన్ని పొందుతాం.

సర్వ సమర్పణా భావనే భక్తి గాని యాంత్రికంగా తీర్థయాత్రాదులకు వెళ్లడమో, భజనాది కార్యక్రమాలలో పాల్గొనడమే భక్తిగా భావించలేం. ఒకవ్యక్తి నదిలో స్నానాన్ని ఆచరించి.. నా పాపాలన్నింటినీ నీవు తీసుకున్నావు కదా అని నదిని అడిగాడట! తీసుకున్నానని చెప్పిందట నది. వాటిని ఏం చేస్తావని అతను మళ్లీ అడిగాడట. సముద్రునిలో కలిపేస్తానన్నది నది. సముద్రుడిని అదే ప్రశ్న వేశాడతను. మేఘాలకు ఇస్తానన్నాడు సముద్రుడు. మేఘాలనూ అదే ప్రశ్నిస్తే.. వర్ష రూపంలో మీకే ఇస్తానన్నాయట. కాబట్టి యాంత్రికంగా చేసిన పని వల్ల దేనిని విడిచిపెట్టామో.. తిరిగి అదే మనలను పలకరిస్తుంది.

... పాలకుర్తి రామమూర్తి

ఇస్లాం బోధ


ప్రవక్త చూపిన బాటలో

ప్రతి సెకనుకు ప్రపంచంలో ఎక్కడో ఒకచోట 'ఆయన' అనే పేరు వినిపిస్తుంది. నిత్యం ఏదో ఒక నగరంలో అజాన్ (ప్రార్థన కోసం పిలుపు)లో ఆయన పేరు లేకుండా పూర్తికాదు. శుక్రవారం ప్రార్థనలు, ఈద్ ప్రార్థనలు లేదా వివాహాల కోసం ఇచ్చే ఉపన్యాసాలు ఆ పవిత్ర నామం తీసుకోకుండా పూర్తి కావు. ఆయనెవరో కాదు ముస్లింలు ప్రాణానికి మిన్నగా ప్రేమించే ముహమ్మద్ ప్రవక్త (స). ఆయన బోధనలు సదా స్మరణీయాలు. అజ్ఞానాంధకారంలోని ప్రపంచానికి కొత్త వెలుగులను ప్రసాదించిన మహనీయుడు ప్రవక్త ముహమ్మద్ (స). ఆయన మానవాళికి సాఫల్య మార్గం చూపించారు. రాజకీయంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా మానవ సమాజానికి మార్గ దర్శనం చేశారు. సత్య, ధర్మాల గురించి తెలుసుకోవాలంటే ప్రవక్త ముహమ్మద్ (స) ఆచరణాత్మక జీవితాన్ని ఉదాహరణగా తీసుకోవాలి. తన కన్నా ముందు ఉన్న ప్రవక్తలు తీసుకొచ్చిన ఆధ్యాత్మిక సందేశానికి ఆయన ముగింపును ఇచ్చారు. మనుషుల సామాజిక జీవితాన్ని, వ్యక్తిగత జీవితాన్ని, అంతర్గత, బాహ్య ఆచరణలను చక్కదిద్దారు. అన్ని రంగాలు, వ్యవస్థల్లో సంస్కరణలను తీసుకొచ్చారు. మానవ సమాజాన్ని సంస్కరించి మానవత్వ విలువలను పునరుద్ధరించారు.
సమ సమాజ నిర్మాణం ఆయన ధ్యేయం. ఆర్థిక పతనం కాకుండా సమాజాన్ని కాపాడటం ఆయన స్థాపించిన ఇస్లాం ప్రధాన ఉద్దేశం. ముహమ్మద్ (స) జీవితాన్ని మనం సరిగా అవగాహన చేసుకొని, ఆయన బోధనలను ఆచరించినప్పుడే జీవితంలో విజయం సాధించగలుగుతాం. అశాంతి, స్వార్థం, నైతిక విలువల పతనం నెలకొన్న నేటి సమాజంలో ఆయన బోధనలు ఆచరించడం తక్షణావసరం.

ప్రవక్త (సఅసం) ప్రబోధనలు


- దేవుణ్ని, అంతిమ దినాన్ని విశ్వసించే వ్యక్తి పలికితే మంచిమాట పలకాలి లేదా మౌనంగా ఉండాలి.
- తనకోసం ఇష్టపడేదే తన సోదరుని కోసం కూడా ఇష్టపడనంత వరకూ మీలో ఎవరూ నిజమైన ముస్లిం కాజాలరు.
- వితంతువులు, నిరుపేదల బాగుకోసం కృషి చేసేవాడు దైవమార్గంలో పోరాడే యోధుడితో సమానం.
- ఏ విశ్వాసీ విశ్వాసురాలిని (భార్యను) అసహ్యించుకోరాదు. ఆమెలో ఒక గుణం నచ్చకపోయినప్పటికీ.. నచ్చే మరో గుణం ఆమెలో ఉండవచ్చు.
- తల్లి పాదాల కింద స్వర్గం ఉంది. తండ్రి స్వర్గద్వారాలన్నిటిలో మధ్య ద్వారం.
- మీరు సముద్రంలో వేలు ముంచి తీస్తే ఎంత నీరు అంటుకుంటుందో పరలోక జీవితం ముందు ఇహలోక జీవితం (విలువ) కూడా అంతే సుమా!

... ముహమ్మద్ ముజాహిద్
96406 22076





శ్రీ శుక ఉవాచ... పరీక్షిన్మహారాజా!
నారాయణుని కుమారుడు
మారుడు– మన్మథుడు, పూర్వం
కామారి– ముక్కంటి కంటి మంటల్లో
కాలి మసిగా మారిన తరువాత
మాపిన – మంటగలిపిన తన రూపు
(దేహం) మరల తనకు ప్రసాదించమని
అసమ (విషమ) నేత్రుని, దిసమొల
దేవుని– శంకరుని పలుమారులు
ప్రార్థించాడు. ఆయన కృపతో ద్వాపర
అంతంలో రుక్మిణీ కృష్ణులకు అసుర
మర్దనుడైన విష్ణుమూర్తి మారట– అపర
అవతారమో అన్నట్లు 'ప్రద్యుమ్నుడు'
(అపరిమిత ధన, బల, వైభవ
సంపన్నుడు) అను పేరిట ప్రభవించాడు.
ఇతడు చతురాత్ముడైన చతుర్భుజుని–
విష్ణుని 'చతుర్వ్యూహం'లో ఒక అంశం.
అంతఃకరణ చతుష్టయంలోని
'బుద్ధి'కి అధిష్ఠాన దైవం.



స్యమంతకమా? శమంతకమా?

జాంబవతీ సత్యభామల వివాహ ప్రస్థానానికై వైయాసకి శుకయోగి స్యమంతక ఉపాఖ్యాన కథనం ప్రారంభించాడు. ద్వారకావాసియైన యాదవ ప్రముఖుడు సత్రాజిత్తు ఆదిత్యుని– సూర్యుని భక్తితో ఆరాధించి ఆయన నుంచి స్యమంతకం అనే మణిని సంపాదించాడు. మహామహిమ గల ఆ మణిని కంఠంలో ధరించి అతడు మహిలో– భూమిపై ద్వితీయ ద్యుమణి– రెండవ సూర్యుని వలె వెలిగిపోతూ ద్వారకా నగరానికి విచ్చేశాడు. నగరవాసులు ఆ మణి ప్రభలకు– కాంతులకు కన్నులు మిరుమిట్లు గొనగా మిన్ను మానికం– విన్ను వెలుంగు (సూర్యుడు) అని భ్రాంతి పడి వెన్నుని– కృష్ణుని వద్దకు వచ్చి ఇలా విన్నవించారు.

కం॥ 'నారాయణ! దామోదర!
నీరజదళ నేత్ర! చక్రి! నిఖిలేశ! గదా
ధారణ! గోవింద! నమ
స్కారము యదుపుత్ర! నిత్య కల్యాణ నిధీ!

'నారాయణా! దామోదరా! పద్మదళాక్షా! చక్రపాణీ! సర్వేశ్వరా! గదాధరా! గోవిందా! నందనందనా! నిత్యకల్యాణ ఆనంద నిధీ! నీకు వందన చందనాలు. దేవదేవా! యదువీరా! దిక్కుల నిండా కాంతులు వెదజల్లుచూ తోయజ బంధుడో– సూర్యుడో, నీరజ గర్భుడో– బ్రహ్మదేవుడో నిన్ను చేర వస్తున్నాడు'. ఆ సమయంలో రోచిష్ణుడు– ప్రకాశ శీలుడు కృష్ణుడు పాచికలాడుతున్నాడట! పౌరుల మాటలు విని వారి అమాయకత్వానికి నవ్వుతూ ఆమ్నాయ (వేద) స్వరూపుడు శౌరి, 'అయ్యా! మీరు పొరబడుతున్నారు. ఆ మణిధారి సత్రాజిత్తేనని, చిత్రభానువు– సూర్యుడు కాడు' అని వారికి చెప్పి పంపించివేశాడు.

అనంతరం సత్రాజిత్తు ఓజో (కాంతి, శక్తి)వంతమైన ఆ స్యమంతక మణిని తన పూజా మందిరంలో ఉంచి అర్చించసాగాడు. ఆ మణి రోజూ ఎనిమిది భారాల– బారువుల ('భారస్స్యాత్ వింశతిః తులాః'– ఇరవై తులాలు ఒక భారం) అనగా నూట అరవై తులాల బంగారాన్ని ప్రసాదిస్తుంది. అంతేకాక..

కం॥ 'ఏ రా జేలెడు వసుమతి
నా రత్నము పూజ్యమానమగు నక్కడ రో
గారిష్ట సర్వమాయిక
మారీ దుర్భిక్షభయము మాను నరేంద్రా!'

'రాజా! ఏ ప్రభువు పాలించే దేశంలో ఆ రత్నం పూజ్యమానమై– పూజింపబడుతూ రాజిల్లుతుందో, ఆ రాజ్యంలో కరువు కాటకాలూ, ఆధి వ్యాధులూ, అకాల మరణాల వంటి ఏ అశుభాలూ, అరిష్టాలూ ఉండవు'.

ఒక రోజున అకలంకుడు, బకవైరి కృష్ణుడు సకల జన కల్యాణార్థం ఆ స్యమంతక మణిని మహారాజైన ఉగ్రసేనునికి ఇమ్మని సత్రాజిత్తుని అడిగాడు. 'నల్లనయ్యకు ఇయ్యక పోతే ఏమౌతుందిలే' అనుకొని స్వార్థపరుడైన ఆ అయ్య సత్రాజిత్తు నిరాకరించాడు. 'వస్తువు సర్వారిష్ట నివారకమై ఎంత అఖర్వమైన– గొప్పదైనా, త్వదీయం వస్తు గోవింద తుభ్యమేవ సమర్పయే'– (ఆది దేవా! ఈ వస్తువు నీదే, మోదంతో నీకే అర్పిస్తా!) అంటూ దానిని సర్వేశ్వరునికి, గోవిందునికి సమర్పించక ఎవడైనా ముందుగా భోగిస్తే– పొందుతే అది అనిష్ట– దుఃఖహేతువే అవుతుంది' అని ఆర్యుల అనుభవ వచనం. స్యమంతక మణి కూడా హృదంతరం– మనసులో నిరంతరం 'శం'– సుఖశాంతులను 'అంతకం'– అంతమొందించి, అనే కులకు– చివరికి సత్రాజిత్తుకు కూడా ప్రాణాంతకమై వంత– సంతాపం మాత్రమే మిగిల్చేదిగా అయింది.

శుకుడు– రాజా! అనంతరం సత్రాజిత్తు తమ్ముడు ప్రసేనుడు ఎంతో వేడుకగా స్యమంతకాన్ని కంఠాన ధరించి వేటాడే తమకం (మోహం)తో అడవికి వెళ్లగా, అక్కడ ఒక హరి– సింహం వానిని సంహరించి ఆ మణిని హరించుకు పోతుండగా భల్లూకరాజు జాంబవంతుడు దానిని అంతమొందించి ఆ మణిని తాను సొంతం చేసుకున్నాడు. దానిని, కొండగుహలో ఉన్న తన ప్రియ నందనునికి ఆనందంగా కేళీ కందుకం– ఆటబంతిగా అమర్చాడు. అంత, వేటకై వెడలిన తమ్ముడు ప్రసేనుడు ఎంతకూ తిరిగి రానందున సత్రాజిత్తు ఎంతో చింతిల్లి, స్యమంతకం కోసం కంసాంతకుడే (కృష్ణుడే) కసి కొద్దీ ప్రసేనుణ్ని అంతం చేసి ఉంటాడనీ, హరికి ఇసుమంత– కొంచెం కూడా మరియాద– న్యాయం, ధర్మం లేదని చాటు–మాటుగా దూషింపసాగాడు. ఆ నిందా వాక్యాలు విన్న అరవిందాక్షుడు 'ఆ నీలాపనిందను ఏ చందాన తొలగించుకోవాలి' అని ఆలోచించి, కొందరు అనుచరులతో కూడి అరణ్యంలో అన్వేషిస్తూ, లభించిన ఆనవాళ్లను అనుసరించి ఎలుగుబంటి వెళ్లిన గుహను చూచాడు. వెంట వచ్చిన వారిని గుహ ద్వారం వద్దనే ఉంచి, తాను ఒంటరిగా లోనికి ప్రవేశించి చూడగా స్యమంతకం కంట పడ్డది. యదు వల్లభుడు మెల్లమెల్లగా శిశువు వద్దకు వచ్చి మణిని అంటుకొనబోగా, దాది చూసి గుండెలు జల్లుమనగా పెద్దపెట్టున కేక పెట్టింది. ఆ కేక విని భల్లూకరాజు జాంబవంతుడు వచ్చి మేఘశ్యాముని కని, తన ఆరాధ్య దైవమైన ఇనకులావతంసుడు (సూర్య వంశ శిరోభూషణుడు) రాముడే యని కనుగొనలేక అని– కయ్యానికి తలపడ్డాడు. ఈ శార్దూల వృత్తంలో క్లిష్టమైన ప్రాసాక్షరాన్ని (ష్ట) స్వీకరించి అమాత్యుడు పోతన పద్యాన్ని స్పష్టమైన అర్థపుష్టితో ఆలంకారిక శైలిలో ఎంత విశిష్టంగా వెలయించాడో అవలోకించండి..

శా॥ 'సృష్టాహంకృతు ఉల్లసిల్ల హరియున్ భల్లూక లోకేశుడున్
ముష్టాముష్టి నహర్నిశంబు జయసమ్మోహంబునం బోరుచో
బుష్టిం బాసి ముకుంద ముష్టిహతులం బూర్ణశ్రమోపేతుడై
పిష్టాంగోరు శరీరుడై యతడు దా భీతాత్ముడై యిట్లనున్'

కృష్ణ జాంబవతులిరువురూ విజయాభిలాషులై ఇరవై ఎనిమిది అహోరాత్రాలు మహా భీకరంగా బాహాబాహీ– ముష్టాముష్టిగా, బలే జోరుగా పోరు సలిపారు. జిష్ణువు– జయశీలియైన కృష్ణుని పిడుగుల వంటి పిడికిలి పోట్లకు జాంబవంతుని ఒడలు– దేహం బడలి సడలి– నశించి పోయింది. అడలి– భయపడి భల్లూకరాజు, తనకు పూర్వం ఇచ్చిన మాటను మన్నిస్తూ కడలి శయనుడే– కామపూరుడైన (కోర్కెలు తీర్చు) రామ నారాయణుడే తన యెడల కరుణ చూపి దర్శనమిచ్చాడని ఇలా స్తుతించాడు..

సీ॥ 'బాణాగ్ని నెవ్వడు పఱపి పయోరాశి
నింకించి బంధించి యేపు నూపె
బరగనెవ్వడు ప్రతాప ప్రభారాశిచే
దానవ గర్వాంధ తమస మడచె
గంజాతములు ద్రెంచు కరిభంగి
నెవ్వడు దశకంఠు కంఠ బృందములు ద్రుంచె
నా చంద్రసూర్యమై యమరు లంకారాజ్య
మునకు నెవ్వడు విభీషణుని నిలిపె'

తే॥ 'నన్ను నేలిన లోకాధినాథుడెవ్వ
డంచితో దారకరుణా రసాబ్ధి యెవ్వ
డా తడవు నీవ కావె, మహాత్మ! నేడు
మాఱుపడి యెగ్గు సేసితి మఱవవలయు'

'దేవాధిదేవా! నీవు పురాణ పురుషుడవు మహావిష్ణువని తెలుసుకొన్నాను. శరా (బాణా)గ్నిచే సాగరాన్ని ఇంకించి సేతువు కట్టినవాడవు. పౌరుష ప్రతాపాలనే ప్రభారాశిచే రాక్షసుల గర్వమనే కారుచీకట్లు పోకార్చి– అణచి వేసి వాసికెక్కిన వాడవు. అరవిందా– కమలాలను తెంచే కరి– ఏనుగులాగా రావణాసురి తలలు త్రుంచిన ఖల విదారి– దుష్టసంహారివి. విభీషణుని ఆచంద్రార్కం లంకారాజ్యానికి రాజుగా చేసిన నిష్కలంకుడవు. కరుణా వరుణాలయు– సముద్రుడవు. నన్నేలిన ఇనకులోత్తముడవు, లోకనాథుడవు నీవే కదా! మహాపురుషా! నీ చరణారవిందాలకు వందనాలు. పొరబడి నిన్నెదిరించి అపచారం చేశాను. మది నెన్నక– మనసులో తలపక నన్ను మన్నించు ప్రభూ!'

శుకుడు– రాజా! ఆపన్నుడైన– ఆపద పొందిన జాంబవంతుడు ఈ తెన్ను–విధంగా విన్నవించుకోగా ప్రపన్నార్తి హరుడు కృష్ణుడు తన చేతితో అతని మేను నిమిరి, అని– పోరు వలన కలిగిన బారి– వెత (శ్రమ)ను తొలగించి గంభీరమైన కంఠస్వరంతో... 'జాంబవంతా! ఈ స్యమంతక మణి అపహరింతకు నేను పాలుపడ్డానని అజ్ఞానులు నాపై వేసిన అపనిందను, ఓ భల్లూక నృపా! తొలగించుకోవడానికే నీ మందిరమైన ఈ బిలానికి వచ్చాను' అని ఇందిరావరుడు పలుకగా పరమానందం పొంది జాంబవంతుడు స్యమంతకంతోపాటు తన కుమార్తె జాంబవతి అనే కన్యకామణిని కూడా లక్ష్మీరమణునికి కానుకగా సమర్పించాడు. ఆమెను స్వీకరించిన పరమాత్మ అతనికి ముక్తిని ప్రసాదించాడు. భగవంతునికి భీష్మక కన్య రుక్మిణి ఎంతో.. కామిని యైన భల్లూక భామని కూడా అంతే! హరితో వచ్చి దరీ– బిల (గుహ) ద్వారం వద్ద నిలిచిన వారందరూ పన్నెండు రోజులు శౌరికై నిరీక్షించి వేసారి విలవిలలాడుతూ ద్వారకకు తిరిగి వెళ్లారు. దేవకీ వసుదేవులు, రుక్మిణి మొదలైన అంతఃపురవాసులు ద్వారక ప్రజలు శోక సముద్రంలో మునిగిపోయారు. హరి క్షేమంగా తిరిగి రావాలని చంద్రభాగను– దుర్గాదేవిని ప్రార్థించారు...

కం॥ 'డోలాయిత మానసులై
జాలింబడి జనులు గొలువ జండిక పలికెన్
బాలామణితో మణితో
హేలాగతి వచ్చు నంబుజేక్షణు డనుచున్'

ద్వారక భక్త జనావళి డోలాయమాన మానసులై– ఆందోళన చెందుతూ జాలిగా ప్రార్థించగా, కాలాత్మకుడు హరి మణితోను బాలామణి తోను హేలాగతి– అనాయాసంగా తిరిగి రాగలడని దుర్గాదేవి పలికింది. నారాయణి దుర్గమ్మ తల్లి ఆశీర్వదించినట్లుగానే హరి మణిద్వయంతో రయమున ద్వారవతీ పురి చేరాడు. అంబికామాత అనుగ్రహంతో జాంబవతీ సమేతుడై వేంచేసిన జగన్నాథుని శ్రీహరిని కని, మృతుడైనవాడు పునరాగతుడై– తిరిగి వచ్చినట్లుగా భావించి ద్వారకాపురవాసులు నిండైన ఆనందోత్సాహాలతో మెండుగా పండుగ చేసుకున్నారు.

(సశేషం)



తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

సంపూర్ణ సత్యం

గురుశిష్యులిద్దరు ఒక ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొనడానికి రైలులో ప్రయాణిస్తూ ఉన్నారు. 'ఎవరినైనా బేరీజు వేయాలంటే ఎలా?' అని అడిగాడు శిష్యుడు. 'సమయం వచ్చినప్పుడు సమాధానమిస్తాన'ని చెప్పాడు గురువు. కొద్దిసేపయ్యాక శిష్యుడికి అదే రైలులో ప్రయాణిస్తున్న వారు పరిచయమయ్యారు. వారు తాము వెళ్తున్న ఊరు వారేనని చాలా సంతోషించాడు. మాటామాటా కలిసింది. వారు అభిమానంగా తమ దగ్గర ఉన్న పండ్లను, మంచి నీళ్లను, మిఠాయిలను శిష్యుడికి ఇచ్చారు. అతను చాలా సంతోషించాడు. చిన్నగా గురువు దగ్గరికి వచ్చి ఆ ఊరి వారు చాలా మంచివారని, కొత్త వ్యక్తుల పట్ల విశేష ఆదరాభిమానాలను చూపుతారని పొగిడాడు. 'అలాగా' అని తల ఊపి ఊరుకున్నాడు గురువు. ఇంతలో వాళ్లంతా దిగాల్సిన స్టేషన్ రానే వచ్చింది. రైలు దిగుతూ 'మీలాంటి పెద్దల సత్సంగం మాకెంతో ఆనందాన్నిచ్చింద'ని పదేపదే చెప్పి వెళ్లిపోయారు ఆ ఊరివాళ్లు. ఇక తమ సామానులన్నీ ప్లాట్‌ఫాంపైకి దించాడు శిష్యుడు. కార్యనిర్వాహకులు వచ్చి తమను తీసుకుని వెళ్తారని ఎదురుచూడసాగాడు. రైలు కదిలి వెళ్లిపోయింది. కాసేపటికి నిర్వాహకులు వచ్చి నమస్కరించి సామానులన్నీ తీసుకుని కారులో ఎక్కిస్తూ ఉండగా ఒక సంచి కనిపించలేదు. దొంగలెవరో ఎత్తుకు పోయినట్లు గుర్తించాడు శిష్యుడు. గురువును పక్కకు పిలిచి విషయం చెప్పిన శిష్యుడు బాధగా 'ఈ ఊరి వాళ్లు దొంగలు' అన్నాడు. గురువు చిరునవ్వు నవ్వి 'రైల్లో ప్రయాణిస్తున్నప్పుడు ఈ ఊరి వాళ్లు ఎంతో మంచివాళ్లు, ఇంత మంచివారిని ఎక్కడా చూడలేదన్నట్లు చెప్పావు. ఇప్పుడేమో ఈ ఊరి వాళ్లంతా దొంగలంటున్నావు. ఇక్కడ నువ్వు గమనించాల్సింది ఒకటుంది. మనం ఒక సంఘటన చూసి, ఒక్క పార్శ్వాన్ని చూసి దేన్నీ, ఎవ్వరినీ బేరీజు వేయకూడదు. సంపూర్ణంగా చూడాలి. అప్పుడే వాస్తవం తెలుస్తుంది. పాక్షికంగా చూసినప్పుడు మనకు కనిపించిందే వాస్తవం అనుకుంటాం. మిగిలిన కోణాల్లో చూడలేదు కాబట్టి చూసిందే నమ్మి దాని ప్రకారమే ఎదుటి వారిపట్ల వ్యవహరిస్తాం' అని వివరించాడు. 'నిజమే... ఒక్క పార్శ్వాన్ని మాత్రమే చూస్తే మనకు గోచరించేది పాక్షిక సత్యమే కానీ, సంపూర్ణ సత్యం కాదు' అని తెలుసుకుని గురువుతోపాటు కారు ఎక్కాడు శిష్యుడు.



... ఆర్సీ కృష్ణస్వామి రాజు, 93936 62821

ప్రభువు దారిలో..

క్రీస్తు సందేశం

క్రైస్తవులం అని చెప్పుకోవడమే కాదు.. క్రీస్తులా మాట్లాడాలి, క్రీస్తులా ప్రవర్తించాలి, క్రీస్తులా ప్రార్థించుకోవాలి. ప్రభువు ప్రధానంగా రెండు విషయాలపై దృష్టి సారించాడు. మొదటిది దేవుడ్ని పూజించాలి. రెండోది సాటి మనిషిని ప్రేమించాలి. తోటివారికి సాయపడటంలో ప్రేమ కనబరచాలి. ఈ రెండు అంశాలూ పది ఆజ్ఞల్ని గర్భీకరించుకున్న మహా సూత్రాలు. 'దేవుడిపై కనబరచే ప్రేమను నీ పక్కనే ఉన్నవానిపై చూపించాలి. దేవుడు ప్రేమమయుడు, కాంతిమంతుడు, సత్య బోధకుడు. ఇవన్నీ కలబోసిన దేవుడ్ని ఆరాధించాలంటే.. ఆయన మనోగతాన్ని ప్రేమించాలి, అభిమానించాలి, ఆచరించాలి. ప్రభువు బాటలో నడిచేవారే నిజమైన క్రైస్తవులు అంటారు మతపెద్దలు. మానవ బలహీనతలకు , ఉన్న పరిస్థితులకు లొంగిపోయినా, తప్పు తెలుసుకున్నాక పశ్చాత్తాపంతో తిరిగి వాటిని చేయకుండా ఉండాలి. 'నా దారి ఇరుకైంది, క్లిష్టం' అని ప్రభువే బోధించాడు. ఎన్ని విపత్కర పరిస్థితులు ఎదురైనా.. ప్రభువు బోధలు పాటించాలి. తోటివారిని ప్రేమించడం మానవుల నైతిక బాధ్యత. అది క్రీస్తు పునరుద్ఘాటించిన సత్యం. దానిని క్రీస్తు సందేశంగా స్వీకరించి ప్రవర్తించాలి. అప్పుడే క్రైస్తవత్వం సిద్ధిస్తుంది.

... ప్రొ॥బెర్నార్డ్ రాజు, 98667 55024

..పంటలు మొలిచే పాలమూరులోన!

> మొదటిపేజీ తరువాయి..

అధ్యయనంలో వెలుగులోకి వచ్చిన కీలక విషయాలు. తెలంగాణ జలవనరుల అభివృద్ధి కార్పొరేషన్ సహకారంతో సెస్ బృందం ఈ అధ్యయనం చేపట్టింది. 'ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గ్రామీణుల జీవితంపై లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల ప్రభావం' పేరిట చేపట్టిన అధ్యయనంతో రూపొందించిన నివేదికను సెస్ ఇటీవలే విడుదల చేసింది. లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లు అందుబాటులోకి రావడంతో ప్రజల జీవన ప్రమాణాలు ఎంతగానో మారాయని తెలిపింది. ఉమ్మడి పాలమూరు తెలంగాణలోనే అతి పెద్ద జిల్లా. 35 లక్షల ఎకరాలకుపైగా సాగుకు యోగ్యమైన భూములున్నాయి. సారవంతమైన ఎర్ర, నల్లరేగడి భూములున్నాయి. కృష్ణ, తుంగభద్ర, భీమా, దుందుభి.. తదితర అపార నీటి వనరులు ఆ జిల్లాకు అందుబాటులో ఉన్నా యి. కోనసీమగా విలసిల్లాల్సిన పాలమూరు.. ఉమ్మడి పాలనలో కరువుకు నెలవైంది. వలసల జిల్లా అనే పేరును మూటగట్టుకున్నది. దేశవ్యాప్తంగా అత్యంత వెనుకబడిన జిల్లాలుగా తొమ్మిదింటిని గుర్తిస్తే అందులో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఒకటిగా ఆనాడు నిలిచిందంటే ఎంత దుర్భిక్ష పరిస్థితులు ఉండేవో అర్థం చేసుకోవచ్చు. 40 లక్షలు గల జిల్లా జనాభాలో సగానికిపైగా జనాభా పొట్టచేతబట్టుకుని వలసల్లో మగ్గాల్సిన దుస్థితి ఉండేది. ఉమ్మడి రాష్ట్రంలో మారిన పాలకులు.. జిల్లాను దత్తత తీసుకున్నవారు ఉన్నారు. అయినా కరువు పోలేదు. ప్రజల బతుకులు మారలేదు. వలస బతుకు తప్ప లేదు.

కేసీఆర్ వచ్చాకే పట్టాలెక్కిన లిఫ్ట్ ప్రాజెక్టులు

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డాక తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి పాలమూరు జిల్లాపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించారు. వలస నివారణకు బహుముఖ వ్యూహాలను అమలుచేశారు. ఉమ్మడి పాలకుల దశాబ్దాలుగా పడావు పెట్టిన లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లను పట్టాలెక్కించారు. కేవలం రెండేండ్లలోనే మహబూబ్‌నగర్ పెండింగ్ ప్రాజెక్టు పనులను 50 శాతం నుంచి 95 శాతానికి పూర్తిచేశారు. దీంతో 2016-17లో కల్వకుర్తి ద్వారా 1.6 లక్షల ఎకరాలు, నెట్టెంపాడు ద్వారా 1.2 లక్షలు, రాజీవ్ భీమా ద్వారా 1.4 లక్షల ఎకరాలు, కోయిల్‌సాగర్ ద్వారా 8 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు.. మొత్తంగా 4 ఎత్తిపోతల పథకాల ద్వారా 4.5 లక్షల ఎకరాలకు తొలిసారిగా సాగునీటిని అందించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కింది. క్రమంగా డిస్ట్రిబ్యూటరీల పనులను పూర్తిచేయడంతో ఆయా ప్రాజెక్టుల కింద 2017-2018లో 6.5 లక్షల ఎకరాలకు, 2018-2019లో 8 లక్షల ఎకరాలకు సాగు నీటి విస్తీర్ణం పెరుగుతూ వచ్చింది. నికరంగా ప్రస్తుతం 10 లక్షలకు పైగా ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నది. అధికార ఉమ్మడి పాలమూరు జిల్లాలో దాదాపు 1000కి పైగా చెరువులను కేసీఆర్ హయాంలోనే పునరుద్ధరించారు. వాటిని సైతం ఎత్తిపోతల పథకంతో అనుసంధానం చేశారు. నీటిసంరక్షణ చర్యల ఫలితంగా భూగర్భజలాలు పెరిగి బోరుబావుల కింద సైతం సాగువిస్తీర్ణం క్రమంగా పెరిగింది. నీటిపారుదల వ్యవస్థ అందుబాటులోకి రావడంతో వలస వెళ్లిన వారు తిరిగి రావడం ప్రారంభమైంది. వారంతా సొంతూళ్లలో దర్జాగా వ్యవసాయాన్ని చేపట్టారు.



సాగు పెరిగింది.. వలస తగ్గింది

సెస్ నివేదిక ప్రకారం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిధిలోని సాగువిస్తీర్ణం పెరిగింది. వలసలు తగ్గిపోయాయి. భూమిని సాగుచేసే రైతుల సంఖ్య 58% నుంచి 84 శాతానికి పెరిగింది. మెట్టభూముల సాగు 44% నుంచి 16 శాతానికి తగ్గింది. నీటిపారుదల వ్యవస్థ మెరుగుపడడంతో భూమి కౌలు కూడా పెరిగింది. తద్వారా దాదాపు 30% మంది రైతులు ప్రయోజనం పొందారు. 2016-17లో అది 5% మాత్రమే. భూగర్భ జలవనరుల ద్వారా వ్యవసాయం చేసే రైతులు 47 శాతానికి పెరిగారు. వర్షపాతంపై ఆధారపడిన రైతులు 45% నుంచి 20 శాతానికి తగ్గిపోయారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వలస వెళ్లిన వారిలో 20% కుటుంబాలు తిరిగి వచ్చారు. తిరిగి వచ్చిన వారిలో 57% మంది కూలీలు, 28% మంది రైతులు, 14% మంది సంప్రదాయ కులవృత్తిదారులు ఉన్నారు. సెస్ బృందం అధ్యయనం ప్రకారం 2000 సంవత్సరంలో వలస వెళ్లి తిరిగొచ్చిన వారు 36.9% ఉండగా, 2010-16 మధ్య 28.5% మంది, 2016-22 మధ్య 16.2% మంది మాత్రమే తిరిగి వలస వెళ్లారు.

నాలుగు ప్రాజెక్టుల పరిధి గ్రామాలపై స్టడీ

పూర్తి చేసిన 4 లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులైన రాజీవ్‌భీమా, కల్వకుర్తి, జవహర్ నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల ద్వారా వాటి పరిధిలోని గ్రామాల్లో వచ్చిన మార్పులపై సెస్ అధ్యయనం చేసింది. అందుకోసం ఆయా ప్రాజెక్టుల పరిధిలోని నాగర్‌కర్నూల్ జిల్లాలో 5 మండలాల నుంచి 15 గ్రామాలు, గద్వాల్ జిల్లాలో 2 మండలాల నుంచి 6 గ్రామాలు, వనపర్తి జిల్లాలో 2 మండలాల నుంచి 6 గ్రామాలు, మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక మండలం నుంచి 3 గ్రామాల చొప్పున ఎంపిక చేసింది. ఒక్కో గ్రామం నుంచి 30 ఇండ్ల చొప్పున మొత్తంగా 900 గృహాలను సర్వే కోసం సెస్ బృందం ఎంపిక చేసుకున్నది. ఆయా గృహాలకు చెందిన వారిలో విభిన్న తరగతులకు చెందిన వారు ఉండేలా చూసుకున్నది. ప్రధానంగా సర్వేకోసం ఎంపిక చేసుకున్న వారిలో రైతులు 34 శాతం మంది (5 ఎకరాల కంటే తక్కువ ఉన్నవారు 20 శాతం, 5 ఎకరాలకంటే ఎక్కువున్న రైతులు 14 శాతం), వేతన కార్మికులు 46 శాతం, సంప్రదాయ కుల ఆధారిత వృత్తులు చేసుకునేవారు 20 శాతం మంది ఉన్నారు. అధ్యయనం కోసం 2016-17 ముందు, 2021-22 తర్వాత వలసల పరిమాణాన్ని పరిశీలించింది. అందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యవసాయ శాఖ, కార్మికశాఖ తదితర విభాగాలు ప్రచురించిన నివేదికలను సైతం సెస్ బృందం అధ్యయనం చేసింది. డాటాను సేకరించి విశ్లేషించింది. ఆయా ప్రాజెక్టుల ద్వారా వచ్చిన మార్పును అధ్యయనం చేసి నివేదికను రూపొందించింది.

ఇతర రంగాల్లో ఉపాధి

లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారా నీటిపారుదల సౌకర్యం అందుబాటులో ఉండటం వల్ల రైతులు 2 సీజన్లలో వ్యవసాయం చేయడం వల్ల వలసలు తగ్గాయి. శ్రామికశక్తి గ్రామంలో లాభదాయకమైన ఇతర ఆర్థిక కార్యకలాపాలైన నిర్మాణ పనులు, స్వయం ఉపాధి, సంప్రదాయ వృత్తులు, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాల్లోనూ పాల్గొని ఉపాధి పొందే అవకాశం ఏర్పడింది. ఇదంతా స్వల్పకాలంలోనే అంటే 2015 నుంచి ఆ జిల్లాలు కొత్తగా నిర్మించిన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు అందుబాటులోకి వచ్చిన తర్వాతేనని తేల్చింది. లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లకు సంబంధించి ఆపరేషన్స్ అండ్ మెయింటనెన్స్, నీటి సమర్థవంత వినియోగం, పంట నమూనాల మార్పు తదితర వాటిని మెరుగుపరిస్తే ప్రాజెక్టుల ప్రయోజనాలు మరింత పెరుగుతాయని సైతం సెస్ బృందం అధ్యయనంలో వెల్లడించింది.

సెస్ సర్వే జరిపిన గ్రామాల వివరాలు

జిల్లా	మండలాలు	గ్రామాలు
నాగర్‌కర్నూల్	5	15
జోగులాంబ గద్వాల	2	6
వనపర్తి	2	6
మహబూబ్‌నగర్	1	3

సర్వేలో పాల్గొన్న వారి వివరాలు

తరగతులు	శాతం
రైతులు	34
వేతన కార్మికులు	46
వృత్తిదారులు	20

లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులతో మరికొన్ని ప్రయోజనాలు

- రాష్ట్రంలోని వర్షాధార ప్రాంతంలో నెట్టెంపాడు, కల్వకుర్తి, రాజీవ్‌భీమా, కోయిల్‌సాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణంతో నీటిపారుదల లభ్యత పెరిగింది. తద్వారా ఖరీఫ్, రబీ సీజన్లలో సాగు విస్తీర్ణం పెరిగింది.
- చిత్తడి నేలల సాగు గణనీయంగా పెరిగింది. వాణిజ్య పంటలైన వరి, పత్తి సాగు పెరిగింది. సంప్రదాయ పంటల సాగు బాగా తగ్గింది.
- ప్రాజెక్టుల ద్వారా రైతులు, తర్వాత కార్మికులు, సంప్రదాయ వృత్తిపరమైన కుటుంబాలు ప్రయోజనం పొందాయి.
- భూగర్భజలాలు పెరిగిన ఫలితంగా డ్రిప్, బోర్ బావుల కింద కూడా నీటిపారుదల సదుపాయం పెరిగింది. కాలువ నీటిపారకం పెరగడం వల్ల పైపుల ద్వారా నీటిని ఎత్తిపోసే ఖర్చు తగ్గింది.
- పెరిగిన వ్యవసాయ కార్యకలాపాల వల్ల స్థానిక కార్మికులు సంవత్సరంలో ఎక్కువ రోజులు ఉపాధిని పొందుతున్నారు. శ్రామికశక్తిలో మహిళల భాగస్వామ్యం పెరిగింది.
- కూలీ రేట్లు పెరిగాయి. తద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వేతన అంతరం తగ్గింది.
- ప్రాజెక్టుల పరిధిలో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నందున దీర్ఘకాలిక వలసలు తగ్గాయి. తాత్కాలిక సీజనల్ వలసలు కొంతవరకు మాత్రమే ఉన్నాయి. అదీ వ్యక్తిగత, స్వచ్ఛందం మాత్రమే.
- వలస వెళ్లి వచ్చిన వారు సాగు చేయడం, కౌలుకు తీసుకోవడం, ఇతర రైతుల పొలాల్లో పనిచేస్తున్నారు. వ్యవసాయ కార్యకలాపాల్లోనూ అనేక మార్పుల వచ్చాయి. ఆధునిక సాగు పద్ధతులు పాటిస్తున్నారు. బిందు, స్ప్రింక్లర్ సాగు వంటి ఆధునిక నీటిపారుదల పద్ధతుల వ్యాప్తి స్థిరంగా ఉంది. ఫలితంగా ఉద్యానవన పంటల విస్తీర్ణం గణనీయంగా విస్తరించింది. తద్వారా స్థానిక సాగుదారులు, కార్మికులకు ప్రత్యామ్నాయ ఆదాయ వనరులు, ఉపాధి అవకాశాలు పెరిగాయి.
- నీటిపారకం వల్ల వ్యవసాయ కార్యకలాపాలు పెరిగి గ్రామాల్లో ఎరువుల దుకాణాలు, మెకానిక్ దుకాణాలు, ట్రాక్టర్ మరమ్మతు దుకాణాలు, కోళ్ల దుకాణాలు, చేపల దుకాణాలు, కిరాణా దుకాణాలు, హోటళ్ళు వంటి కొత్త వ్యాపారాలు పుట్టుకొచ్చాయి. ఇదంతా ప్రత్యక్షంగా, పరోక్షంగా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారానే సాధ్యమైంది.
- జిల్లాలలో వ్యవసాయం, వ్యవసాయేతర భూముల విలువ చాలా రెట్లు పెరిగింది.
- కోల్డ్ స్టోరేజ్, ఫిష్ ప్రాసెసింగ్ యూనిట్లు వంటివి వచ్చాయి.

ఆ నాలుగు లిఫ్ట్ ప్రాజెక్టులతో జరిగిన మార్పులు

- లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిధిలో సాగువిస్తీర్ణం పెరిగి, వలసలు తగ్గిపోయాయి.
- భూమిని సాగుచేసే రైతుల సంఖ్య 58% నుంచి 84 శాతానికి పెరుగుదల
- మెట్టభూముల సాగు 44% నుంచి 16 శాతానికి తగ్గింది.
- భూమి కౌలు పెరిగి దాదాపు 30% మంది రైతులు ప్రయోజనం పొందారు.
- భూగర్భ జలవనరుల ద్వారా వ్యవసాయం చేసే రైతులు 47 శాతానికి పెరిగారు.
- వర్షపాతంపై ఆధారపడిన రైతులు 45% నుంచి 20 శాతానికి తగ్గిపోయారు.
- వలస నుంచి తిరిగొచ్చిన వారిలో 57% మంది కూలీలు, 28% మంది రైతులు, 14% మంది సంప్రదాయ కులవృత్తిదారులు ఉన్నారు.

నెల్లుట్ల రమాదేవికి కాళోజీ పురస్కారం

- రేపు రవీంద్రభారతిలో అవార్డు ప్రదానం
- రచయిత్రిగా, కవయిత్రిగా, కార్టూనిస్ట్‌గా బహుముఖ ప్రజ్ఞ
- రమాయణం పేరిట 'నమస్తే తెలంగాణ'లో రచనలు

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (నమస్తే తెలంగాణ)/స్టేషన్ ఘన్‌పూర్: ప్రముఖ రచయిత్రి, కాలమిస్ట్ నెల్లుట్ల రమాదేవి 2025 సంవత్సరానికిగాను ప్రతిష్ఠాత్మక కాళోజీ పురస్కారానికి ఎంపికయ్యారు. మంగళవారం (9వ తేదీన) కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని అవార్డును ప్రదానం చేయనున్నారు. ప్రజాకవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు పేరిట తెలంగాణ ప్రభుత్వం భాషా, సాంస్కృతిక శాఖ ద్వారా ఏటా ప్రతిష్ఠాత్మకంగా సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న విషయం తెలిసిందే. 2025వ సంవత్సరానికి కాళోజీ పురస్కారం ఎంపికకు ప్రభుత్వం అందెశ్రీ అధ్యక్షతన జ్యూరీ కమిటీని ఏర్పాటుచేసింది. ఆ కమిటీ ప్రముఖ కవయిత్రి, రచయిత్రి, కాలమిస్ట్ నెల్లుట్ల రమాదేవిని కాళోజీ సాహితీ పురస్కారానికి ఎంపిక చేసినట్టు ఆదివారం ప్రకటించింది. తెలంగాణ భాషా దినోత్సవం సంబురాల్లో భాగంగా మంగళవారం రవీంద్రభారతిలో నిర్వహించనున్న కాళోజీ జయంతి వేడుకల్లో అవార్డును ప్రదానం చేయనున్నారు. రమాదేవిని సత్కరించడంతోపాటు అవార్డు కింద రూ.1,01,116 నగదు బహుమతిని అందజేయనున్నారు. అవార్డుకు ఎంపికైన రమాదేవికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సాంస్కృతిక, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.



ఎన్నెన్నో అవార్డులు

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లి గ్రామానికి చెందిన నెల్లుట్ల రమాదేవి వృత్తిరీత్యా సీనియర్ బ్యాంక్ మేనేజర్. రమ కలం పేరుతో కార్టూనిస్ట్‌గా, రచయిత్రిగా పేరు పొందారు. మనసు భాష (కవిత్వం)- 2011, రమణీయం(కార్టూన్లు)-2011, మనసు మనసుకూ మధ్య (కథలు)-2011, చినుకులు (నానీలు)-2021, తల్లి వేరు (కథలు)-2021, డీ కామేశ్వరి కథలపై మోనోగ్రాఫ్-2023, అశ్రు వర్ణం (కవిత్వం)-2024, రమాయణం-1 (కాలమ్స్)-2024 ప్రచురించారు. ఇప్పటికే సుశీలా నారాయణరెడ్డి పురస్కారం, అపురూప అవార్డు, తెలంగాణ ప్రభుత్వ ఉత్తమ రచయిత్రి (వరంగల్ జిల్లా), తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం, ప్రతి భా పురస్కారం, జాతీయ సాహిత్య పరిషత్తు, సిద్దిపేట ఐతా భారతి చంద్రయ్య సంప్రదాయ కథా సాహితీ పురస్కారం, గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్ అవార్డు, గుర్రం జాషువా ఫౌండేషన్ పురస్కారం, వెంకటసుబ్బు స్మారక అవార్డు, పర్చా రంగారావు స్మారక అవార్డు, తిరుమల స్వరాజ్యలక్ష్మి సాహితీ పురస్కారం, రాగతి పండరి స్మారక పురస్కారం, ప్రొఫెసర్ వాసిరెడ్డి భాస్కర్‌రావు స్మారక పురస్కారం, ఎక్స్‌రే పత్రిక ఉత్తమ కవితా పురస్కారం, డాక్టర్ రాణీ పులోమజాదేవి స్మారక గౌరవ పురస్కారం, డాక్టర్ సినారె సాహిత్య పురస్కారాలతోపాటు కార్టూన్లు, కవిత్వం, కథలకూ పలు అవార్డులను పొందారు.

వరంగల్‌లో కుండపోత



వరంగల్‌లో ఆదివారం ఉదయం భారీ వర్షం వర్షం కురిసింది. రెండు గంటల్లో 5.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రైల్వే అండర్ బ్రిడ్జి కిందికి భారీగా వరద పోటెత్తింది. వరద ప్రభావాన్ని అంచనా వేయకుండా ఇద్దరు ఆర్టీసీ డ్రైవర్లు అజాగ్రత్తగా రాంగ్ రూట్‌లో బస్సులు నడిపి ప్రయాణికుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టారు. రైల్వే అండర్ బ్రిడ్జి కిందకి వెళ్లిన బస్సుల ఇంజిన్లు నిలిచిపోయాయి. మిల్స్ కాలనీ పోలీసులు ఘటనా స్థలానికి వెళి రెండు ఆర్టీసీ బస్సుల్లో ఉన్న 60 మంది ప్రయాణికులను స్థానికుల సహాయంతో రక్షించారు. ఈ ఘటనలో హెడ్ కానిస్టేబుల్ ఉస్మాన్ కాలికి గాయమైంది. - ఖిలావరంగల్

'పెద్ది' ఊహలకందని ఓ అద్భుతం

ఫైనల్ జడ్జిమెంట్ డైరెక్టర్‌దే అయినా.. ఆ అవుట్‌పుట్‌ను కెమెరాలో బంధించి మనకందించేది మాత్రం ఛాయాగ్రాహకుడే. అందుకే వాళ్లను DOP(డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ) అంటారు గౌరవంగా. రామ్‌చరణ్ 'పెద్ది' సినిమాకు రత్నవేల్ ఛాయాగ్రహణం అందిస్తున్నారు. రీసెంట్‌గా ఆ సినిమా గురించి రత్నవేల్ చెప్పిన విశేషాలు 'పెద్ది'పై అంచనాల్ని ఆకాశంలో నిలబెట్టేలా ఉన్నాయి. ' 'పెద్ది' అందరూ అనుకుంటున్నట్టు సామాన్యమైన కమర్షియల్ సినిమా కాదు. ఇది ఊహలకు అందని అద్భుతం. ఇందులో రామ్‌చరణ్‌లోని కొత్త యాంగిల్‌ని ఆడియన్స్ చూస్తారు. ఆయన నటన, స్టైల్, డిక్షన్ అన్నీ గత సినిమాలకు భిన్నంగా ఉంటాయి. ఈ సినిమాకోసం ఆయన కొత్తగా మారిపోయారు. బుచ్చిబాబు చాలా స్ట్రాంగ్ స్క్రిప్ట్ రాసుకున్నారు. ఈ సినిమా నేను చేయడానికి కారణం ముఖ్యంగా కథే. నన్ను అంత ఎగ్జైట్ చేసిందీ కథ. అంత కొత్తదనం కథలో ఉన్నప్పుడు నేనూ కచ్చితంగా కొత్తగా ట్రై చేయాలి. అందుకే కొత్తగా తీస్తున్నా. నాచురల్ లైటింగ్‌తో, ఓ కొత్త టింట్‌తో 'పెద్ది' సినిమా ఉంటుంది. దర్శకుడు బుచ్చిబాబు నెక్ట్స్ లెవల్లో 'పెద్ది'ని తెరకెక్కిస్తున్నారు. 'రంగస్థలం' చిత్రాన్ని మించేలా 'పెద్ది' ఉంటుంది.' అని తెలిపారు రత్నవేల్.



భాగ్యనగరిలో చిరు చిందేస్తే!


మెగా అభిమానులంతా ఆతృతగా ఎదురు చూస్తున్న సినిమా 'మన శంకర వరప్రసాద్‌గారు'. చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. ప్రస్తుతం చిరంజీవి, నయనతార, ఇతర తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. సోమవారం నుంచి చిరంజీవి, నయనతారలపై ఓ పాటను హైదరాబాద్‌లో చిత్రీకరిస్తున్నట్టు ఆదివారం ఓ ప్రకటన ద్వారా మేకర్స్ తెలియజేశారు. విజయ్ పోలంకి కొరియోగ్రఫీ అందిస్తున్న ఈ పాటను స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ సిసిరోలియో మంచి మాస్ బీట్‌తో స్వరపరిచారని, ఈ పాట సినిమాకే హైలైట్ కానున్నదని మేకర్స్ తెలియజేశారు. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల కానున్న ఈ చిత్రానికి రచన: ఎస్.కృష్ణ, జి.ఆది నారాయణ, కెమెరా: సమీర్‌రెడ్డి, సమర్పణ: అర్చన, నిర్మాతలు: సాహు గారపాటి, సుస్మిత కొణిదెల, నిర్మాణం: షైన్ స్క్రీన్స్ అండ్ గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్.



చిత్రం

ప్రపంచ సినిమా షేకయ్యేలా?

ప్రస్తుతం దేశంలో నిర్మితమవుతున్న పాన్ వరల్డ్ సినిమాల్లో 'SSMB 29' అగ్రభాగంలో ఉంటుంది. సూపర్‌స్టార్ మహేశ్‌బాబు కథానాయకుడిగా విఖ్యాత దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి తెరకెక్కిస్తున్న సినిమా కావడమే ఈ హైప్‌కు కారణం. నిధి అన్వేషణ నేపథ్యంలో సాగే అడ్వెంచరస్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం కెన్యాలో జరుగుతున్నది. ఈ షెడ్యూల్‌కు చెందిన ఆసక్తికరమైన వివరాలు కూడా బయటకు వచ్చాయి. ఈ ఏడాది నవంబర్‌లో ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ని హాలీవుడ్ లెజెండరీ డైరెక్టర్ జేమ్స్ కామెరాన్ చేతుల మీదుగా విడుదల చేసేందుకు రాజమౌళి సన్నాహాలు చేస్తున్నట్టు ఇప్పటికే వార్తలొచ్చాయి. కానీ దానితోపాటు అంతకు మించిన ట్రీట్ ఇచ్చేందుకు రాజమౌళి సన్నాహాలు చేసుకుంటున్నారని వినికిడి. ఫస్ట్ లుక్‌తోపాటు ఫస్ట్ గ్లింప్స్‌ని, అలాగే రిలీజ్ డేట్‌ను కూడా ఆ రోజే ప్రకటిస్తారట. భూమండలంపై సినిమాకు ప్రాధాన్యతనిచ్చే ప్రతి దేశంలో, అలాగే.. ప్రపంచంలో సినిమా రూపొందే ప్రతి భాషలోనూ 'SSMB 29' విడుదలయ్యేలా వ్యూహాన్ని రచిస్తున్నారు రాజమౌళి. దీనికోసం వివిధ దేశాల ప్రతినిధులతో కూడా ఆయన మాట్లాడుతున్నారని సమాచారం. మొత్తానికి నవంబర్‌లో ప్రపంచ సినిమాకే చర్చనీయాంశంగా 'SSMB 29' నిలువనున్నది. ప్రియాంక చోప్రా కథానాయిక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్, మాధవన్‌లతోపాటు పలు హాలీవుడ్ ప్రముఖులు కూడా నటిస్తున్నారు. దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్.నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.





హారర్ సినిమాల్లోకెల్లా ఇది ప్రత్యేకం

బెల్లంకొండ సాయిశ్రీనివాస్ నటించిన మిస్టీరియస్ థ్రిల్లర్ 'కిష్కింధకాండ'. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. కౌశిక్ పెగల్లపాటి దర్శకుడు. సాహు గారపాటి నిర్మాత. ఈ నెల 12న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం విజయవాడలో విలేకరుల సమావేశం నిర్వహించారు. 'కిష్కింధపురి' హారర్ సినిమాల్లోకెల్లా ప్రత్యేకమైన సినిమా అని, ఇందులో మలుపులు, షాక్ ఫ్యాక్టర్స్ చాలా ఉంటాయని, సినిమాను ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మాత సాహు గారపాటి నిర్మించారని, దర్శకుడు కౌశిక్ అద్భుతంగా తెరకెక్కించారని, డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇదని బెల్లంకొండ సాయిశ్రీనివాస్ అన్నారు. 'కిష్కింధపురి' ఓ యూనిక్ హారర్ మూవీ అని, తెలుగులో వచ్చిన బెస్ట్ హారర్ సినిమాల్లో ఒకటిగా ఈ సినిమా నిలుస్తుందని కథానాయిక అనుపమ పరమేశ్వరన్ నమ్మకం వెలిబుచ్చారు.




ఆ పొగడ్తలకు అసలు కారణం ఇదేనా?

కన్నడభామ రుక్మిణి వసంత్ బంపర్ ఆఫర్ కొట్టేసిందని టాలీవుడ్ టాక్. రీసెంట్‌గా 'మదరాసి'తో సందడి చేసిన ఈ అందాలభామ ప్రస్తుతం ఎన్టీఆర్-నీల్ ప్రాజెక్ట్‌తో బిజీగా ఉన్నారు. దీనితోపాటు మరో ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌లో కూడా రుక్మిణి భాగం కానున్నట్టు తెలుస్తున్నది. ఆ వివరాల్లోకెళ్తే..

సుకుమార్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా ఓ సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే. 'పెద్ది' తర్వాత రామ్‌చరణ్ చేసే సినిమా ఇదే కావడం గమనార్హం. ఈ సినిమాలో కథానాయికగా రుక్మిణి వసంత్ ఖరారైనట్టు సమాచారం. రీసెంట్‌గా 'మదరాసి' సినిమా ప్రమోషన్స్‌లో తనకు రామ్‌చరణ్ అంటే ఇష్టమంటూ తెగ పొగిడేసింది రుక్మిణి వసంత్. ఆ పొగడ్తలకు అసలు కారణం ఇదే నంటూ ఫిల్మ్ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

అభిమానులకు అక్షయ్ పుట్టినరోజు కానుక




1987లో 'ఆజ్' చిత్రంతో నటుడిగా ఎంట్రీ ఇచ్చారు అక్షయ్‌కుమార్. 38ఏండ్ల తన నట జీవితంలో ఎన్నో చిరస్మరణీయమైన పాత్రల్ని పోషించారాయన. అంతేకాదు, ఆయన సమకాలికుల్లో ఏడాదికి ఎక్కువ సినిమాల్లో నటించిన క్రెడిట్ కూడా అక్షయ్‌దే. ఈ కారణంగానే తక్కువ సమయంలోనే 200వ చిత్రానికి చేరవయ్యారాయన. నెల 9న అక్షయ్ పుట్టినరోజు. ఈ సందర్భంగా తన 200వ చిత్రాన్ని అక్షయ్ ప్రకటించబోతున్నారని సమాచారం. అభిమానులకు కానుకగా ఈ ప్రకటన ఉండబోతున్నదని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇందుకోసం ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేయనున్నారట. ఈ సినిమా వివరాలు అప్పుడే ప్రకటిస్తారని తెలిసింది. ఆయన నటించిన 'జాలీ ఎల్ఎల్‌బీ 3' చిత్రం ఈ నెల 19న విడుదల కానున్న విషయం తెలిసిందే.

ఉత్కంఠను కలిగించే విద్రోహి

రవిప్రకాశ్, శివకుమార్, చరిష్మా శ్రీకర్, సాయికి ప్రధాన పాత్రల్లో నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'విద్రోహి'. వి.ఎస్.వి. దర్శకత్వంలో విజ్జన వెంకట సుబ్రహ్మణ్యం నిర్మించిన ఈ చిత్రం నిర్మాణం పూర్తి చేసుకొని, విడుదలకు సిద్ధంగా ఉంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమాలోని తొలి పాటను మేకర్స్ విడుదల చేశారు. అగ్ర దర్శకుడు వి.వి.వినాయక్ పాటకు విడుదల చేసి, చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. ఇప్పటివరకూ రాని కొత్త పాయింట్‌తో ఈ సినిమా రూపొందించామని, త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని దర్శకుడు వి.ఎస్.వి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐబీఎం మెగా మ్యూజిక్ అధినేత పప్పుల కనకదుర్గారావు కూడా పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: సతీశ్ ముత్యాల, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.





తెలుసు కదా అలాంటి కథే

సిద్ధు జొన్నలగడ్డ, కథానాయకుడిగా రూపొందుతున్న రొమాంటిక్ డ్రామా 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలు. ప్రముఖ స్టైలిస్ట్ నీరజా కోన ఈ సినిమా ద్వారా దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. ప్రతిష్ఠాత్మక పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం నిర్మాణం తుది దశకు చేరుకుంది. తాజాగా కథానాయిక రాశీ ఖన్నా తన షూటింగ్‌ని పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'కెమెరాలు ఆగిపోయిన తర్వాత కూడా మరిచిపోలేని కథలు కొన్ని ఉంటాయి. అలాంటి కథే 'తెలుసు కదా'. అద్భుతమైన అనుభవాలను పంచిన ప్రయాణమిది. ఈ జర్నీలో నాతో పాటు నడిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. మేం సృష్టించిన ఈ ప్రపంచంలోకి మీరు అడుగు పెట్టే రోజుకోసం ఎదురుచూస్తున్నా.' అని తెలిపారు రాశీ ఖన్నా. దీపావళి కానుకగా అక్టోబర్ 17న విడుదల కానున్న ఈ చిత్రానికి కెమెరా: జ్ఞానశేఖర్ వీఎస్, సంగీతం: తమన్.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



ఆసియా హమారా

ఫైనల్లో కొరియాపై భారత్ ఘన విజయం • దిల్‌ప్రీత్‌సింగ్ డబుల్ • ప్రపంచ హాకీ టోర్నీకి అర్హత

రాజ్‌గిర్(బీహార్): ఆసియా కప్ టోర్నీలో భారత్ టైటిల్ విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో భారత్ 4-1 తేడాతో డిఫెండింగ్ చాంపియన్ కొరియాను మట్టికరిపించింది. ఆద్యంతం ఏకపక్షంగా సాగిన పోరులో టీమ్‌ఇండియా అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఆసియా కప్ గెలువడం ద్వారా వచ్చే ఏడాది బెల్జియం, నెదర్లాండ్స్‌లో జరిగే ప్రతిష్టాత్మక ప్రపంచకప్ టోర్నీకి భారత్ నేరుగా అర్హత సాధించింది. 2017 తర్వాత తొలిసారి ఆసియా కప్ గెలిచిన భారత్ నాలుగోసారి టైటిల్‌ను సగర్వంగా ముద్దాడింది. గతంలో 2003(కౌలాలంపూర్), 2007(చెన్నై) టోర్నీల్లోనూ భారత్ విజయ పతాక ఎగురవేసింది. మ్యాచ్ విషయానికొస్తే ఐదుసార్లు చాంపియన్ కొరియాపై ఆది నుంచే టీమ్‌ఇండియా తమదైన ఆధిపత్యం ప్రదర్శించింది. దిల్‌ప్రీత్ సింగ్(28ని, 45ని) డబుల్ గోల్స్‌తో అలరించగా, సుఖ్‌జీత్‌సింగ్(1ని), అమిత్ రోహిదాస్(50ని) ఒక్కో గోల్ చేశారు. డియాన్ సన్(51ని)..కొరియాకు గోల్ అందించాడు.

భారత్‌దే ఆధిపత్యం:

కొరియాతో ఆఖరి పోరులో భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. మ్యాచ్ మొదలైన 29 సెకన్లకే సుఖ్‌జీత్‌సింగ్ ఫీల్డ్ గోల్‌తో భారత్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. కొరియా డిఫెన్స్‌ను ఏమారుస్తూ భారత స్ట్రైకర్లు విరామం ఎరుగకుండా దాడులు చేయడం కలిసి వచ్చింది. ఎక్కువ శాతం బంతిని తమ ఆధీనంలో ఉంచుకునేందుకు భారత్ ప్రయత్నించడం కలిసి వచ్చింది. దీంతో తొలి క్వార్టర్ ముగిసే భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. రెండో క్వార్టర్‌లో ఏ మాత్రం జోరు తగ్గని భారత్ పెనాల్టీ కార్నర్లు లక్ష్యంగా ముందుకు సాగింది. ఈ దశలో 28వ నిమిషంలో దిల్‌ప్రీత్ ఫీల్డ్ గోల్ చేయడంతో ఆధిక్యం 2-0కు చేరుకుంది. ఈ దశలో కొరియా ప్రతిదాడులకు ప్రయత్నించినా భారత్ దీటుగా తిప్పికొట్టింది. మిడ్‌ఫీల్డ్‌తో పాటు డిఫెండర్లు కొరియా ఎటాకింగ్‌ను సమర్థంగా నిలువరించారు. రెండో క్వార్టర్ అయిపోతుందన్న తరుణంలో వచ్చిన పెనాల్టీని దిల్‌ప్రీత్ గోల్‌గా మలువడంతో ఆధిక్యం 3-0కు చేరుకుంది. అయితే నిమిషం తేడాతో స్ట్రైకర్ డియాన్ సన్ గోల్ కొట్టడంతో కొరియా ఖాతా తెరిచింది. ఆఖరిదైన నాలుగో క్వార్టర్‌లో భారత్ ఎక్కడా వెనుకకు తగ్గలేదు. ఓవైపు కొరియా డిఫెన్స్‌ను కకావికలు చేస్తూ వరుస దాడులు చేస్తూనే ప్రతిదాడులను అడ్డుకుంది. ఈ క్రమంలో 50వ నిమిషంలో వచ్చిన పెనాల్టీ కార్నర్‌ను రోహిదాస్ గోల్ చేయడంతో భారత్ గెలుపు సంబురాల్లో మునిగిపోయింది. కొరియా గోల్‌కీపర్‌ను కంగుతినిపిస్తూ రోహిదాస్ కొట్టిన బంతి బుల్లెట్‌లాగా గోల్‌పోస్ట్‌లోకి దూసుకుపోయింది. ఇటీవలి టోర్నీల్లో విఫలమైన భారత హాకీ జట్టు అంచనాలకు మించి రాణించింది.

342 పరుగుల తేడాతో

వన్డేల్లో ఇంగ్లండ్ రికార్డు విజయం

సౌతాంప్టన్(ఇంగ్లండ్): సుదీర్ఘ వన్డే క్రికెట్ చరిత్రలో ఇంగ్లండ్ రికార్డు విజయాన్నందుకుంది. ఆదివారం జరిగిన మూడో వన్డేలో ఇంగ్లండ్ ఏకంగా 342 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై చారిత్రక విజయం సాధించింది. తొలుత ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 414/5 భారీ స్కోరు చేసింది. రూట్ (100), జాకబ్ బెతెల్ (110) సెంచరీలతో విజృంభించారు. స్మిత్ (62), బట్లర్(62 నాటౌట్) అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు. బాష్, మహరాజ్ రెండేసి వికెట్లు తీశారు. లక్ష్యఛేదనలో ఆర్చర్ (4/18) ధాటికి సఫారీలు 20.5 ఓవర్లలో 72 పరుగులకు కుప్పకూలింది. బాష్(20) మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు.



భారత్ పతక ధమాకా

రియో(బ్రెజిల్): వుషు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత్ అదరగొట్టింది. ఆదివారం జరిగిన వేర్వేరు విభాగాల్లో భారత వుషు ప్లేయర్లు నాలుగు పతకాలతో చరిత్ర సృష్టించారు. మహిళల 75కిలోల విభాగంలో శివానీ, అపర్ణ(52కి), కరీనా(60కి) ప్రత్యర్థుల చేతిలో ఓడి రజత పతకాలు సొంతం చేసుకున్నారు. మరోవైపు పురుషుల 56కిలోల విభాగంలో సాగర్‌కు కాంస్య పతకం దక్కింది.

క్వీన్ సబలెంకా

ఫైనల్లో అనిసిమోవాపై అద్భుత విజయం

వరుసగా రెండో సారి టైటిల్ సొంతం

యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ



4 సబలెంకకు ఇది నాలుగో గ్రాండ్‌స్లామ్ టైటిల్. అన్నీ హార్డ్‌కోర్ట్‌పైనే గెలిచినవే.

ప్రైజ్‌మనీ

విజేత: సబలెంకా	రూ.44.08 కోట్లు
రన్నరప్: అనిసిమోవా	రూ.22.04 కోట్లు

న్యూయార్క్: వరల్డ్ నంబర్‌వన్ అరీనా సబలెంకా యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో చాంపియన్‌గా నిలిచింది. శనివారం అర్ధరాత్రి(భారత కాలమానం ప్రకారం) జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ సబలెంకా 6-3, 7-6(7/3)తో అమెరికా నయా సంచలనం అమందా అనిసిమోవాపై అద్భుత విజయం సాధించింది. గంటన్నర పాటు హోరాహోరీగా సాగిన తుది పోరులో సబలెంకాదే పైచేయి అయ్యింది. వరుస విజయాలతో ఫైనల్లోకి దూసుకొచ్చిన ఎనిమిదో సీడ్ లోకల్ ప్లేయర్ అనిసిమోవాపై చెక్ పెడుతూ సబలెంకా వరుసగా రెండోసారి యూఎస్ ఓపెన్ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకుంది. తద్వారా అమెరికా టెన్నిస్ దిగ్గజం సెరెనా విలియమ్స్(2014) తర్వాత రెండు టైటిళ్లు అందుకున్న ప్లేయర్‌గా ఈ బెలారస్ బ్యూటీ నిలిచింది. మ్యాచ్ మొత్తంలో టాప్ సీడ్ సబలెంకా ఒక ఏస్ కొడితే అనిసిమోవా నాలుగు ఏస్‌లతో ఆకట్టుకుంది. అయితే డబుల్ ఫాల్ట్స్ సబలెంకా రెండు సార్లు చేస్తే అనిసిమోవా ఏడుసార్లు తప్పిదం చేసింది. ఆరింటిలో ఐదు బ్రేక్ పాయింట్లను సబలెంకా కాపాడుకుంటే ఏడింటిలోఅనిసిమోవా నాలుగింటికే పరిమితమైంది. సబలెంకా 13 విన్నర్లు కొడితే.. అమెరికా యువ ప్లేయర్ 22 కొట్టినా లాభం లేకపోయింది. సబలెంకా 15సార్లు అనవసర తప్పిదాలు చేస్తే..29 సార్లు చేసిన అనిసిమోవా మూల్యం చెల్లించుకుంది. టాప్‌సీడ్ మొత్తంగా 76 పాయింట్లు ఖాతాలో వేసుకుంటే అనిసిమోవా 59 పాయింట్లతో సరిపెట్టుకుంది. ఇలా రెండు సెట్ల పోరు అభిమానులను ఆకట్టుకుంది.

హోరాహోరీగా:

టోర్నీ టైటిల్ ఫేవరెట్లలో ఒకరిగా బరిలోకి దిగిన సబలెంకా అంచనాలకు అనుగుణంగా రాణించింది. మరోవైపు అసలు అంచనాలు లేకుండా బరిలోకి దిగిన అనిసిమోవా అనూహ్య విజయాలతో అందరినీ ఆశ్చర్యపరిచింది. ఫైనల్లో సబలెంకా, అనిసిమోవా మధ్య పోరు నువ్వానేనా అన్నట్లు తలపించింది. తొలి సెట్‌ను సబలెంకా 6-3తో కైవసం చేసుకుంది. అనిసిమోవా తొలి సర్వీస్‌ను బ్రేక్ చేసిన సబలెంకా 2-0 ఆధిక్యం కనబరిచింది. మూడో గేమ్‌లోనూ 30-0తో ఆధిక్యంలో నిలువడంతో అంతా అనిసిమోవా పని అయిపోయింది అనుకున్నారు. కానీ ఒక్కసారిగా పుంజుకున్న అనిసిమోవా గేమ్ గెలిచి ఆశ్చర్యపరిచింది. ఈ క్రమంలో 3-2 ఆధిక్యంలోకి వెళ్లింది. తన అనుభవాన్ని ఉపయోగిస్తూ సబలెంకా వరుసగా నాలుగు గేములు గెలిచి..తొమ్మిదో గేమ్‌లో అనిసిమోవా సర్వీస్‌ను బ్రేక్ చేసి 38 నిమిషాల్లోనే తొలి సెట్‌ను ఖాతాలో వేసుకుంది. రెండో సెట్‌లోనూ ఇద్దరు దూకుడుగా ఆడారు. అయితే 5-4 ఆధిక్యంతో సబలెంకా చాంపియన్‌షిప్ సర్వీస్ చేస్తున్న సమయంలో అతి సులువైన ఓవర్‌హెడ్ స్మాష్‌ను విడిచిపెట్టుకుంది. దీంతో సెట్ టైబ్రేక్‌కు దారితీసింది. ఇక్కడా పొరపాటుకు అవకాశమివ్వని సబలెంకా ప్రశాంతంగా పని కానిచ్చింది.



భారత్ కొత్త చరిత్ర

పురుషుల కాంపౌండ్ టీమ్‌కు తొలి స్వర్ణం

సురేఖ, రిశబ్ జోడీకి రజతం • ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్

గ్వాంగ్జు(దక్షిణకొరియా): ప్రతిష్టాత్మక ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత్ కొత్త చరిత్ర లిఖించింది. గత రికార్డులను తిరుగరాస్తూ పురుషుల కాంపౌండ్ టీమ్ అదరగొట్టింది. ఆదివారం ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన ఫైనల్ పోరులో రిశబ్ యాదవ్, అమన్ సైనీ, పార్థమేశ్‌తో కూడిన భారత త్రయం 235-233 తేడాతో ఫ్రాన్స్ టీమ్(నికోలస్ గిరార్డ్, జీన్ ఫిలిపి, ఫ్రాన్కోసిస్)పై గెలిచి పసిడి పతకంతో మెరిసింది. టోర్నీ చరిత్రలో భారత పురుషుల టీమ్ తొలిసారి స్వర్ణాన్ని సగర్వంగా ముద్దాడింది. చివరి వరకు గెలుపు దోబూచులాడిన పసిడి పతక పోరులో భారత ఆర్చర్లు అద్భుత ప్రదర్శన కనబరిచారు. ముఖ్యంగా భారత్ తరఫున తక్కువ ర్యాంక్‌తో బరిలోకి దిగిన పార్థమేశ్ అంచనాలకు మించి రాణించాడు. తొలి రౌండ్‌లో రెండు బాణాలతో తొమ్మిదేసి పాయింట్లు స్కోరు చేసిన 22 ఏండ్ల పార్థమేశ్ ఆ తర్వాత వరుసగా ఆరుసార్లు చెక్కుచెదరని గురితో పదేసి పాయింట్లు ఖాతాలో వేసుకున్నాడు. చివరి వరుసలో పార్థమేశ్ విల్లు నుంచి వెళ్లిన బాణంతో భారత్ చిరస్మరణీయ విజయం ఖరారైంది. పసిడి గెలిచిన తర్వాత భారత కాంపౌండ్ చీఫ్ కోచ్ జివన్‌జ్యోత్‌సింగ్ మాట్లాడుతూ 'ఈ విజయం మా అందరిలో మరింత ఆత్మవిశ్వాసాన్ని నింపింది. జట్టులోని ప్రతీ సభ్యుడు అద్భుతంగా రాణించారు. తొలి రౌండ్‌లో 57-59తో వెనుకంజలో ఉన్నా..ఆ తర్వాత ఆరుసార్లు 10 పాయింట్లు దక్కడంతో స్కోరు 117తో సమమైంది. ఆఖరిదైన మూడో రౌండ్‌లో 59 పాయింట్లతో 176-176 స్కోరు దగ్గర పార్థమేశ్ గోల్‌తో భారత్ విజయం వైపు నిలిచింది' అని అన్నారు. మరోవైపు కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్లో భారత ద్వయం వెన్నెం జ్యోతి సురేఖ, రిశబ్ యాదవ్ 155-157 తేడాతో నెదర్లాండ్స్ జోడీ మైక్ షోలెసర్, సానె డీ లాట్ చేతిలో



ఓడి రజతం కైవసం చేసుకుంది. తొలి రౌండ్‌లో ఆధిక్యం ప్రదర్శించినప్పటికీ అదే జోరు కొనసాగించలేకపోయారు. మహిళల కాంపౌండ్ టీమ్ ఈసారి ప్రిక్వార్టర్స్‌లోనే వెనుదిరిగి 2017 తర్వాత తొలిసారి పతకం సాధించకుండానే టోర్నీని పేలవంగా ముగించింది.

లక్ష్య ముందంజ

లివర్‌పూల్: ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్ల మెరుగైన ప్రదర్శన కొనసాగుతున్నది. ఆదివారం జరిగిన పురుషుల 80కిలోల తొలి రౌండ్‌లో భారత యువ బాక్సర్ లక్ష్య చాహర్ 5-0 తేడాతో హుస్సేన్ ఇషాహ్(జోర్డాన్)పై అద్భుత విజయం సాధించాడు. ఆది నుంచే తనదైన జోరు కనబరిచిన లక్ష్య..ఏషియన్ చాంపియన్‌షిప్ స్వర్ణ పతక విజేత అయిన హుస్సేన్‌పై తనదైన ఆధిపత్యం కొనసాగించాడు. అయితే రెండో రౌండ్‌లో పుంజుకునేందుకు జోర్డాన్ బాక్సర్ ప్రయత్నించినా లాభం లేకపోయింది. ఆఖరిదైన మూడో రౌండ్‌లో లక్ష్య క్లీన్‌పంచ్‌లతో విరుచుకుపడటంతో గెలుపు ఖరారైంది. మరోవైపు పవన్(55కి) పోరాటం ముగిసింది.

ఇటలీ చాంప్ వెర్‌స్టాపెన్



మొంజా(ఇటలీ): ఇటాలియన్ ఫార్ములావన్ గ్రాండ్‌ప్రి రేసులో మాక్స్ వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. ఆదివారం హోరాహోరీగా సాగిన రేసులో రెడ్‌బుల్ డ్రైవర్ వెర్‌స్టాపెన్ అగ్రస్థానంలో నిలిచాడు. గత కొన్ని రేసుల్లో నిరాశపరిచిన వెర్‌స్టాపెన్ మే నెల తర్వాత తొలిసారి టైటిల్‌తో మెరిశాడు. ఫార్ములావన్ చరిత్రలోనే అత్యంత వేగవంతమైన టైమింగ్‌తో పోల్ పొజిషన్ దక్కించుకున్న వెర్‌స్టాపెన్ ఫైనల్లోనూ అదే జోరు కొనసాగించాడు. 20 సెకన్ల ఆలస్యంతో నోరిస్(మెక్‌లారెన్), పియాస్ట్రి(మెక్‌లారెన్) వరుసగా రెండు, మూడు స్థానాలతో పోడియం ఫినిష్ చేశారు. ఇటలీ గ్రాండ్ ప్రి తర్వాత పియాస్ట్రి 324 పాయింట్లతో నంబర్‌వన్‌లో కొనసాగుతుండగా, నోరిస్(293), వెర్‌స్టాపెన్(230) ఆ తర్వాత స్థానాల్లో కొనసాగుతున్నారు.